Estd. 1938

# ఆంధ్రప్రభ

www.prabhanews.com Journalism first!

నేటి మీ కపిల్ చిట్స్ తో సభ్యత్వం
ఓ మంచి ఆర్థిక నేస్తంతో బంధుత్వం
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
39 YEARS Safeguarding Trust
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

**ముహూర్తం**

శ్రీ వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, కృష్ణపక్షం; తిథి: పాడ్యమి (మంగళవారం) ఉ.4.20 వరకు; నక్షత్రం: రేవతి ఉ.10.21 వరకు; అమృతకాలం: ఉ.7.42 నుండి 9.28 వరకు; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: మ.12.25 నుండి 1.12 వరకు, మ.2.45 నుండి 3.31 వరకు; రాహుకాలం: ఉ.7.39 నుండి 9.07 వరకు; యమగండం: ఉ.10.34 నుండి మ.12.02 వరకు;

సంపుటి:58 • సంచిక: 175 • సోమవారం 14 అక్టోబర్ 2019 • హైదరాబాద్ * పేజీలు:10+12 • వెల: 5.00 • Published from: Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur | Nellore



## నియామకాలకు నోటిఫికేషన్

### ఎక్కడికక్కడ నియామకాలు... అనుభవాన్ని బట్టి పారితోషికం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలోని అన్ని బస్‌డిపోల్లో అవసరమైన సిబ్బందిని నియమించుకునేందుకు సంబంధిత మేనేజర్లు చర్యలు చేపట్టాలని ఆర్టీసీ యాజమాన్యం ఆదేశించింది. రవాణా శాఖ ఉపకమిషనర్, ఇతర అధికారుల సమన్వయంతో తాత్కాలిక ప్రాతిపదికన డ్రైవర్లు, కండక్టర్లను నియమించి వీలైనన్ని ఎక్కువ బస్సులు నడిపి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పేర్కొంది. పోలీసు శాఖలో పదవీ విరమణ చేసిన డ్రైవర్లతో పాటు విశ్రాంత ఆర్టీసీ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని సూచించింది. మెకానిక్‌లు, శ్రామిక్, టైర్ మెకానిక్‌లు, ఎలక్ట్రీషియన్‌లతో పాటు బస్‌డిపోలలో, బస్టాండ్‌లలో అవసరమైన సిబ్బంది ఎంపికకు దరఖాస్తులను ఆహ్వానించాలని ఆదేశాలిచ్చింది. అర్హత కలిగిన తాత్కాలిక డ్రైవర్, కండక్టర్లను

➪ 3వ పేజీలో...

# గేరు మారింది... వేగం పెరిగింది

"కార్మికుల సమ్మె చట్టవిరుద్ధమని ప్రకటించిన ప్రభుత్వం ఒకవైపు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించగా మరోవైపు కార్మికుల నిరసన తీవ్రమవుతోంది. గత వారం రోజులతో పోలిస్తే, ఆదివారం బస్సుల రాకపోకలు గణనీయంగా పెరిగాయి. ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా 5334 బస్సులు తిరిగాయి.

**పెరిగిన బస్సుల రాకపోకలు**

- అద్దె బస్సులు నడిపేందుకు యత్నాలు
- రెండు, మూడ్రోజుల్లో పూర్తిస్థాయిలో బస్సులు నడిచేలా కార్యాచరణ
- ప్రైవేటు బస్సుల యజమానులతో ఆర్టీసీ, ఆర్టీఏ అధికారుల సంప్రదింపులు
- ఇతర రాష్ట్రాలకు రాకపోకలపై దృష్టి
- ముఖ్యమంత్రి కేసీఆర్ స్వీయపర్యవేక్షణ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఆర్టీసీ కార్మికుల సమ్మె చట్టవిరుద్ధమని, కార్మిక సంఘాల నాయకులతో ఇక ఎటువంటి చర్చలు జరిపేది లేదని సీఎం కేసీఆర్ స్పష్టం చేయడంతో పాటు సంస్థలో తాత్కాలిక నియామకాల ప్రక్రియను వేగవంతం చేసి వారం రోజుల్లో బస్సులన్నింటినీ తిప్పాలని ఆదేశించడంతో ఆర్టీసీ, రవాణాశాఖ అధికారులు ఉరుకులు పరుగులు తీస్తున్నారు. మరోవైపు సమ్మెకు దిగిన కార్మికులు ఎటువంటి పరిస్థితుల్లోను తమ ఆందోళనను విరమించేది లేదని ప్రభుత్వం చర్చలు జరిపి తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పట్టుబట్టడంతో ఈ సమస్య ఇప్పట్లో పరిష్కారమయ్యే అవకాశం కనిపించడం లేదు. ఆర్టీసీలో తాత్కాలిక నియామకాల ప్రక్రియను ఆ సంస్థ యాజమాన్యం వేగవంతం చేసింది. రానున్న వారం రోజుల్లో తాత్కాలిక ప్రాతిపదికన డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లు, మెకానిక్‌లతోపాటు ఇతర ఆఫీసు సిబ్బందిని నియమించాలని నిర్ణయించింది. నియామకాలకు సంబంధించి ఇప్పటికే ఆర్టీసీ యాజమాన్యం నోటిఫికేషన్‌లు జారీచేసి దరఖాస్తులను ఆహ్వానించింది. మరోవైపు తాత్కాలిక ప్రాతిపదికన ఇప్పటికే కొంతమంది డ్రైవర్లు, కండక్టర్లను ఆర్టీసీ యాజమాన్యం

➪ 3వ పేజీలో...

## శ్రీనివాస్‌రెడ్డి మృతి

డీఆర్‌డీవో-అపోలో ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత

ఖమ్మంకు తరలింపు.. అంత్యక్రియలు

నేడు ఉమ్మడి ఖమ్మం జిల్లా బంద్

## విపక్షాల ఉచ్చులో ఆర్టీసీ కార్మికులు

మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, గంగుల కమలాకర్

5





రెండో టెస్టులో సఫారీలపై ఇన్నింగ్స్ విజయం

## చరిత్ర లిఖించారు

- వరుసగా 11వ టెస్టు సిరీస్ భారత్ కైవసం
- ఆసీస్ రికార్డులను బద్దలుకొట్టిన టీమిండియా
- విదేశాల్లో వరుసగా 6 టెస్టు సిరీస్‌లు ఓడిన ఘనత సాధించిన దక్షిణాఫ్రికా జట్టు
- టెస్టు విజయాల్లో కోహ్లీ సరికొత్త రికార్డు





## మాంద్యం తీవ్రం

- డిమాండ్ ఢమాల్
- జీడీపీ 6 శాతమే
- ప్రపంచ బ్యాంక్ అంచనా

6



## తీరం మాయం!

- నానాటికీ పెరుగుతున్న సముద్రమట్టం
- 30ఏళ్లలో మూడొంతుల తీరం గల్లంతు
- ఒడిశాలో 150కి.మీ. తీరప్రాంతం మునక
- ఇక్కడ ఏటా ఐదు కి.మీ. మేర కోతకు గురి
- తీవ్రరూపం దాల్చుతున్న వాతావరణ మార్పులు

సాగరుడు భూమ్మీదకు పరుగులు తీస్తున్నాడు. ఏటేటా తీరాన్ని మింగేస్తూ మున్ముందుకు దూసుకొస్తున్నాడు. తీరంపై తీరని దాహంతో మైళ్లకుమైళ్లు చొచ్చుకొస్తున్నాడు. వాతావరణ మార్పులు, మానవ తప్పిదాలు ఇందుకు కారణం అవుతున్నాయి. ప్రపంచంలోని సముద్రమట్టాలన్నీ ఏటికేటికి పెరుగుతున్నాయి. మన దేశం విషయానికొస్తే 26 ఏళ్లలో దాదాపు (1990 నుంచి 2016 వరకు) 6632 కి.మీ. తీరప్రాంతం కోతకు గురైనట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇదే సమయంలో ఒడిశాలో దాదాపు 150 కి.మీ మేరకు తీరం సముద్రంలో కలిసిపోయింది. గ్రామాలకు గ్రామాలు ఖాళీ అయ్యాయి. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఇక్కడ సముద్రమట్టం 35 అడుగుల నుంచి 10 అడుగులకు కుచించుకుపోయింది.

వివరాలు 2లో...

## గ్రామ పంచాయతీల్లోనే వివాహ రిజిస్ట్రేషన్లు!

జనన, మరణ ధ్రువీకరణ మాదిరిగానే నమోదు

కార్యదర్శులకు బాధ్యతలు • నెలరోజుల్లోపు నమోదు ఉచితం



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** వివాహాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రభుత్వం స్థానిక సంస్థలకే అప్పగించింది.తెలంగాణ నూతన పంచాయతీరాజ్ చట్టంలో నిర్దేశించిన ప్రకారం ప్రతి వివాహబంధం స్థానిక సంస్థల రికార్డులతో అనుబంధం కానుంది. నూతన పంచాయతీరాజ్ చట్టం అమల్లోకి రాకముందు వరకూ రాష్ట్ర రిజిస్ట్రేషన్ల శాఖ పరిధిలో వివాహ రిజిస్ట్రేషన్ల బాధ్యతలు ఉంటూ వచ్చాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే వివాహ రిజిస్ట్రేషన్లు రిజిస్టర్ చేయించుకోవాల్సి వచ్చేది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోవటం, స్లాట్ బుక్ చేసుకోవటం, ఆధార్ కార్డులు, స్థానికత సర్టిఫికెట్లు, వివాహ ఫోటోలు, వరుడితోపాటు వధువు హాజరు సంతకాలు, ఇరువైపుల వారి తల్లిదండ్రుల హాజరు, పెద్దల సాక్షి సంతకాలు అంటూ పెద్ద తతంగమే నడిచేది. ఈ ప్రక్రియనంతా పూర్తిచేసేందుకు తగిన అవగాహన లేకపోవటం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ తిరిగే ఓపిక లేకపోవటంతో

➪ 3వ పేజీలో...



## సెయింట్‌గా మరియం థ్రెసియా

- వాటికన్ సిటీలో పోప్ ఫ్రాన్సిస్ ప్రకటన
- సెయింట్ హోదా సాధించిన రెండవ భారతీయురాలుగా గుర్తింపు

8



## కంపెనీల రొట్టె విరిగి గనిలో..!

- మైనింగ్‌లో భారీ సంస్కరణలు
- ఉత్పత్తిని వాడుకోవడమే కాదు.. విక్రయించుకోవచ్చు
- ఉత్పత్తి, పెట్టుబడుల పెంపే లక్ష్యం
- కమిటీ సిఫారసుల మేరకు లీజింగ్ విధానంలో మార్పులు?

**న్యూఢిల్లీ:** పెట్టుబడులు ఆకర్షించడం, దేశంలో ఖనిజాల ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా మైనింగ్ రంగంలో కీలకమైన సంస్కరణలు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. కేవలం కంపెనీల వినియోగం కోసమే బొగ్గు సహా ఇతర ఖనిజ వనరుల మైనింగ్ హక్కులను కట్టబెట్టే విధానానికి ముగింపు పలకాలని భావిస్తోంది. కొత్తగా హైబ్రీడ్ మైనింగ్ లీజ్ అగ్రిమెంట్ విధానాన్ని తీసుకురావాలనుకుంటోంది. ఈ విధానంలో కేవలం విద్యుత్, స్టీల్, సిమెంట్ వంటి కంపెనీల ఉత్పత్తి వినియోగం కోసమే కాకుండా బహిరంగ మార్కెట్లో వ్యాపారం

➪ 3వ పేజీలో...





## ఉద్యోగాలడిగితే చంద్రుడిని చూపిస్తున్నారు

- ప్రజల దృష్టిని మరల్చేందుకే చంద్రయాన్ ప్రస్తావన
- సంపన్నులకే మేలు చేశారు... పేదలకేం చేయలేదు
- లాతూర్ సభలో మోడీ ప్రభుత్వంపై రాహుల్ ధ్వజం



8



## దమ్ముంటే 370ని వెనక్కి తీసుకురండి

- అలాగే ట్రిపుల్ తలాఖ్‌ను తిరిగి ప్రవేశపెట్టండి
- మహారాష్ట్ర ఎన్నికల సభలో విపక్షాలకు మోడీ సవాల్
- గ్రామీణాభివృద్ధికి రూ.25 లక్షల కోట్లు

# సముద్రంతో నేను..

### మహాబలిపురం భావాలను పంచుకున్న ప్రధాని

### సముద్రపు ముచ్చట్లతో హిందీలో పద్యం

**న్యూఢిల్లీ:** ఉదయాన్నే మహాబలిపురం బీచ్‌లో మార్నింగ్ వాక్ చేస్తూ స్వచ్ఛతే సేవ అని ప్రపంచానికి చాటిన ప్రధాని నరేంద్ర మోడీ.. తన మనసులోని భావాలను సముద్రంతో పంచుకున్నారు. సముద్రంతో సూర్యుడికి ఉన్న సంబంధం, అలలు వాటి వెనకున్న బాధలు వంటి వాటి గురించి పద్యరూపంలో వివరించారు. సముద్రంలో తాను పంచుకున్న భావాలను హిందీలో పద్యంగా మలచిన మోడీ.. ఆ పద్యాన్ని ట్విట్టర్ వేదికగా ప్రజలతో పంచుకున్నారు. మహాబలిపురంలో రెండోరోజు ఉదయాన్నే బీచ్‌లో వాకింగ్ చేస్తున్న ఫొటోలు ఆయన సహజ మనస్తత్వాన్ని బయటపెట్టాయి.

### మోడీ చేతిలో ఆ పరికరమేంటి..?

మహాబలిపురం బీచ్‌లో ప్రధాని నరేంద్ర మోడీ మార్నింగ్ వాక్ చేస్తున్నప్పుడు స్వచ్ఛ భారత్‌కు దిగడంపై దేశవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమౌతుండగా.. మోడీ షేర్ చేసిన వీడియోను నిశితంగా పరిశీలించిన కొంతమంది నెటిజన్లు .. ప్రధాని మరో చేతిలో ఉన్న పరికరమేంటి..? అని చర్చించుసాగారు.. ఒకరు అది టార్చ్ అని అంటే మరొకరు కాదు కాదు చిన్న సైజు డంబెల్ అని చెప్పుకోసాగారు. ప్రధాని నరేంద్ర మోడీ సన్నిహితుల్లోనూ ఈ విధమైన చర్చ నడిచింది. దీంతో అందరి మదిలో ఉద్భవించిన ఆ ప్రశ్నకు మోడీ సమాధానమిచ్చారు. తాను మార్నింగ్ వాక్ చేస్తున్నప్పుడు ఒక చేత్తో చెత్త ఏరివేస్తూ.. మరో చేతిలో పట్టుకున్న వస్తువు గురించి చాలామందిలో ఎన్నో ప్రశ్నలు పుట్టుకొచ్చాయి. అదేంటో కాదు.. ఆక్యుప్రెజర్ రోలర్. అప్పుడప్పుడు నేను ఆక్యుప్రెజర్ రోలర్‌ను వాడుతుంటా. అది నాకెంతో మేలు చేస్తుంది అని మోడీ ట్వీట్ చేశారు. ఆక్యుప్రెజర్ రోలర్‌ను చాలామంది మార్నింగ్ వాక్‌లో వాడతారు. తరుచూ దాన్ని రోల్ చేయడం ద్వారా రక్త ప్రసరణ బాగా జరుగుతుంది.ఉద్వేగాలను నియంత్రించడంతో పాటు నిద్ర లేమిని తగ్గిస్తుంది. జీర్ణ సమస్యలను నివారించడానికి దోహదం చేస్తుంది.






## హేయ్.. నావైపు చూడవేం!

మనుషులకే కాదు.. గుర్రాలకూ సరదాలుంటాయ్. సరసాలూ ఉంటాయ్. కాకపోతే ఎప్పుడోకాని అవి విచ్చలవిడిగా వ్యవహరించవ్. పుట్టిన వెంటనే ఆవుదూడలు, పెయ్యలు ఎలా ఉత్సాహంగా గెంతుతూ, తుళ్లుతా పరిగెడుతూంటాయో గుర్రప్పిల్లలూ అలాగే తిరుగుతాయ్. దాదాపు ఏడాది వయసు వచ్చేవరకు వాటి ఈ తరహా అల్లరి మామూలే. ఇదిగో జర్మనీలోని వెర్వెమ్‌లో గుర్రాల మైదానంలో ఆడుతూ తిరుగుతున్న రెండు గుర్రపిల్లల తీరు ఇలా ఉంది. ఒకటి నిర్వికారంగా ఉంటే, మరోటి నొసటిని చిట్లించి నోటితో నవ్వినట్లు, నావైపు చూడటం లేదన్నట్లు ఓ భంగిమను ప్రదర్శించింది.




# కోడ్ ఉల్లంఘన కేసులు 25!

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** హుజూర్‌నగర్ ఉపఎన్నికల అధికార ప్రతిపక్షాలకు ప్రతిష్టాత్మకంగా మారిన నేపథ్యంలో కోడ్ ఉల్లంఘనలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. ప్రచారంలో అభ్యర్థుల ఖర్చుల వివరాలు, కేసులు, నగదు, పట్టుబడిన మద్యం వంటి వివరాలతో కూడిన బులిటెన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి చంద్రయ్య ఆదివారం విడుదల చేశారు. ఈ ఉప ఎన్నికలో 104 ప్రచార వాహనాలు వినియోగిస్తున్నారు. ఇప్పటి వరకు రూ.72,29,500 నగదును పట్టుకున్నారు. 7వేల లీటర్ల మద్యంను సీజ్ చేయగా, కోడ్ ఉల్లంఘన కింద 10 కేసులను నమోదు చేశారు. సి విజిల్ యాప్ ద్వారా 15 కేసులను నమోదు చేశారు. ఇదిలావుండగా కేవలం మఠంపల్లి మండలం లోనే రూ. 1,25,200 విలువైన మద్యం పట్టబడటం గమనార్హం. టీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి రూ.8,65,112 ఖర్చు చేయగా, కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి రెడ్డి రూ.5,27,621 ఖర్చు చేశారు. భాజపా అభ్యర్థి కోట రామరావు రూ.4,22,258 ఖర్చు చేశారు, స్వతంత్ర అభ్యర్థి తీన్మార్ మల్లన్న రూ.3,73,945 ఖర్చు చేశారు. టిడిపి అభ్యర్థి చావా కిరణ్మయి రూ.3,73,945 ఖర్చు పెట్టారు. స్వతంత్ర అభ్యర్థి దేశగాని సాంబశివ గౌడ్ రూ.10360 ఖర్చు చేసినట్లు రిటర్నింగ్ అధికారి వెల్లడించారు.

# 17న హుజూర్‌నగర్‌లో కేసీఆర్ ప్రచారం

### ఒక బహిరంగ సభతో పాటు రోడ్‌షోలో పాల్గొనే అవకాశం

### కాంగ్రెస్ ప్రచార వ్యూహాన్ని తిప్పికొట్టి పైచేయిగా నిలిచేందుకు కేసీఆర్ వ్యూహం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** హుజూర్‌నగర్ ఉపఎన్నికను అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న అధికారపార్టీ తెలంగాణ రాష్ట్ర సమితి ఎలాగైనా ఆ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. పోలింగ్‌కు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ప్రచార కార్యక్రమానికి సిద్ధమయ్యారు. ఈ నెల 17న హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని కీలక ప్రాంతాల్లో ఆయన పర్యటించనున్నారు. ఈ విషయాన్ని ఆదివారం పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఎన్నికల బరిలో నిలిచిన ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఆ పార్టీల అగ్రనేతలు ప్రచారాన్ని ముమ్మరం చేసిన తరుణంలో తనదైనశైలిలో ప్రజా క్షేత్రంలోకి వెళ్ళేందుకు కేసీఆర్ సంసిద్ధమ్యారు. తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, పురపాలకశాఖామంత్రి కేటీ రామారావు రెండు రోజుల క్రితం ఆ యోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి ప్రచారం చేశారు. తుదిగా సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచారానికి వస్తే గెలుపు తథ్యమని ఉమ్మడి నల్గొండ జిల్లా తెరాస వర్గాలు గట్టి నమ్మకంతో ఉండడంతో హుజూర్ నగర్ నియోజకవర్గంలో ఒక బహిరంగ సభలో పాటు రోడ్‌షోలలో పాల్గొనేందుకు కేసీఆర్ సుముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ తమ సిట్టింగ్ స్థానాన్ని తిరిగి దక్కించుకునేందుకు రాష్ట్ర నాయకత్వంతో పాటు కేంద్ర పార్టీ నాయకులు కూడా అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఆ తరహాలోనే విస్తృత ప్రచార కార్యక్రమాల్లో నేతలు నిమగ్నమయ్యారు. అదే సమయంలో వారి ప్రచార వ్యూహాన్ని తిప్పికొట్టి హుజూర్‌నగర్ స్థానాన్ని ఎలాగైనా కైవసం చేసుకోవాలన్న పట్టుదలతో కేసీఆర్ వ్యూహరచన చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఓడించి సత్తా చాటాలన్న పార్టీ ఆదేశాలతో తెరాస నాయకత్వం వ్యూహం రచించుకుని గత కొన్ని రోజులుగా అందుకు అనుగుణంగా ప్రచారం నిర్వహిస్తూ వస్తోంది. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లను రంగంలోకి దింపి వారి ద్వారా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఒక్కో మండలానికి ఇద్దరేసి ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలకు ప్రచార బాధ్యతలను పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు అప్పగించారు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి మొదటి నుంచీ నియోజకవర్గంలోనే మకాంవేసి ప్రచారం నిర్వహిస్తున్నారు. పలువురు మంత్రులు ఇప్పటికే విడతలవారీగా నియోజకవర్గంలో పర్యటించి ప్రచారంలో పాల్గొంటున్నారు. తుదిగా అధినేత కేసీఆర్ ప్రచారం పార్టీ కేడర్‌లో మరింత ఉత్తేజం పెంచుతుందని, పెద్దసంఖ్యలో ఓటర్లను ప్రభావితం చేయనున్నారని నేతలు భావిస్తున్నారు.





## అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి: ఉత్తమ్

**హుజూర్‌నగర్, ప్రభన్యూస్ :** దేశ చరిత్రలోనే కనీవినీ ఎరుగని తరహాలో హుజూర్‌నగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పరిచానని, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, ప్రజలే కుటుంబసభ్యులుగా భావించి ఈప్రాంతాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేశానని పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో పర్యటించారు. ఉప ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి గా పోటీ చేస్తున్న పద్మావతిని ఆశీర్వదించాలని కోరారు. బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు ఎత్తిపోతల నిర్మాణం, లోఓల్టేజ్ సమస్యకు సబ్ స్టేషన్ల ఏర్పాటు, అంతర్గత రోడ్ల నిర్మాణం, కృష్ణానదిపై వంతెన నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేశానని, మరోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాయమాటలు చెప్పే ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

### రేవంత్‌రెడ్డి ప్రచారం

పార్టీ అధినాయకత్వం ఆదేశాల మేరకు ఎంపీ రేవంత్ రెడ్డి ప్రచారానికి సిద్ధమయ్యారు. 18,19 తేదీలలో ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. కాగా, రేపు(సోమవారం) కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, మాజీమంత్రి చిన్నారెడ్డి ప్రచారానికి రానున్నారు.



## లాడెన్ షెల్!

లండన్‌లో ఈ మధ్య ఓ అరవై ఏళ్ల వృద్ధ జంట, తమ నలభై ఏళ్ల వివాహ వార్షికోత్సవ వేళ, ససెక్స్‌లోని విన్ చెల్సియా తీరంలో వేడుకలు జరుపుకున్నారు. మధ్యలో అలా ఇద్దరూ కలసి తీరంలో కొద్దిసేపు నడిచారు. అలా వెడుతున్నప్పుడు వారికి ఓ శంఖం (సముద్రజీవి ఉండే షెల్) దొరికింది. అయితే దానిని చూసిన తరువాత ఆ ఇద్దరూ కొద్దిసేపు నోటమాట రాకుండా ఉండిపోయారు. అది అచ్చం ఉగ్రవాద సంస్థ అల్‌ఖైదా వ్యవస్థాపకుడు, అమెరికా జంట టవర్ల విధ్వంసానికి కారకుడైన ఒసామాబిన్ లాడెన్‌లా స్ఫురించడమే అందుకు కారణం. ఆ షెల్‌పై ఎవరో గీచినట్లు పాకుడు పట్టడంతో అచ్చం ఒసామా మాదిరిగానే కనిపించింది. ఈ శంఖం చిత్రాన్ని ఆ ఇద్దరూ సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేయడంతో అది చక్కర్లు కొడుతోంది. ఇంతకీ ఆ విచిత్ర వస్తువును చూసిన జంట డెబ్రా ఒలివర్, ఆమె భర్త మార్టిన్.

# తీరం మాయం!



## నానాటికీ పెరుగుతున్న సముద్రమట్టం

### 30 ఏళ్లలో మూడొంతుల తీరం గల్లంతు

### ఒడిశాలో 150కి.మీ తీరప్రాంతం మునక

**న్యూఢిల్లీ:** ఒడిశాలో సగటున ఏటా 5 కిలోమీటర్ల తీరం సముద్రగర్భంలో కలిసిపోతున్నది. గత రెండు దశాబ్దాల్లో బరాహపూర్, శాతభయా గ్రామాలకు చెందిన 3000 మంది సొంతూళ్లను విడిచి వెళ్లారు. ఇక వ్యవసాయ భూముల్లో క్రమంగా ఇసుక మేటలు పేరుకుంటున్నాయి. గూగుల్ మ్యాప్‌లలో శాతభయా గ్రామం నీట మునిగిన దృశ్యాలు తరుముకొస్తున్న ముప్పును కళ్లకు కడుతుంది. ఈ అనుభవం ప్రస్తుత తీరగ్రామాల ప్రజలను మరింత ఆందోళకు గురిచేస్తోంది. వచ్చే పదేళ్లలో తమ గ్రామాలూ సముద్రగర్భంలో కలిసిపోతాయన్న బెంగపట్టుకుంది. ఒడిశాకు మొత్తంగా 550 కి.మీ. సముద్రతీరం ఉంది. గత రెండున్నర దశాబ్దాల్లో 28శాతం ముంపునకు గురైందని చెన్నైలోని జాతీయ తీరప్రాంత పరిశోధనా కేంద్రం వెల్లడించింది. తీర ప్రాంతం పరిధిలో ఆరు జిల్లాలుండగా, వీటిలో కేంద్రపాద, జగత్‌సింగపూర్ జిల్లాలు తుపానుల వల్ల తీవ్రనష్టానికి గురయ్యాయి. రెండు జిల్లాలు వరుసగా 31 కి.మీ, 14.5 కి.మీ చొప్పున తీరప్రాంతాన్ని కోల్పోయాయి. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. 1960లో పారాదీప్ ఓడరేవు నిర్మాణం సమయంలో ఇక్కడున్న వేలాది ఎకరాల అటవీప్రాంతాన్ని తొలగించారు. ఇదే ఇప్పుడు శాపంగా మారిందని శాతభయా గ్రామస్తులు వాపోతున్నారు. 1999 నాటి సూపర్ సైక్లోన్ ఈ ప్రాంతానికి తీవ్ర నష్టం కలిగించిందని చెబుతున్నారు. మిగతా సముద్రతీర రాష్ట్రాలదీ ఇదే పరిస్థితి. పశ్చిమబెంగాల్ (63శాతం), పుదుచ్చేరి (57శాతం), కేరళ (45శాతం), తమిళనాడు (41శాతం) రాష్ట్రాల్లో తీరాలు కోతకు గురయ్యాయి. ద.ఆసియాలోని 170 కోట్ల మంది అధిక ఉష్ణోగ్రతలు, సముద్రమట్టాల పెరుగుదల పర్యవసానాల ప్రభావాన్ని ఎదుర్కొంటున్నారు. వీరంతా తరచూ తుపానులు, వరదల బీభత్సానికి అల్లాడిపోతున్నారు.

### తాగునీటికి ప్రయాస..

ఒడిశా తీరంలోని గ్రామాల తాగునీటి అవసరాలకు బోరు బావులే ప్రధాన వనరు. భూమి కోతకు గురవుతుండటం వల్ల వీటికి ముప్పు ఏర్పడింది. శాతభయాలోని చేతిపంపుల రూపంలో ఉన్న రెండు బోరుబావులు ఒకప్పుడు సముద్రమట్టానికి ఆరు మీటర్ల ఎత్తులో ఉన్నవికాస్తా, ఇప్పుడు కేవలం ఒక మీటరు ఎత్తుకే పరిమితం అయ్యాయి. దీంతో వీటిని కృత్రిమ ఏర్పాట్లతో ఎత్తు పెంచారు. వీటి నుంచి నీటిని తోడుకోవాలంటే అల్లంత ఎత్తులో ఉన్న బోరింగ్‌ను తాడు సహాయంతో ఆడించాల్సి వస్తోంది. మరొక చేతిపంపు రెండు నెలల కిందటే ఇసుకలో పూడిపోయింది. ఒకవైపు పంటపొలాలు ఇసుక దిబ్బలుగా మారడం, ఇంకొకవైపు పశువులకు గ్రాసం అందుబాటులో లేకపోవడంతో ఇక్కడి ప్రజల మనుగడ ప్రశ్నార్ధ కంగా మారింది. కేంద్రపాద ఏరియాలోని 200 మంది యువకులు బతుకుదెరువు కోసం తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు వలసవెళ్లారు.

- 1990-2016 మధ్య కాలంలో ఇండియాలోని మూడో వంతు సముద్రతీరం (6632 కి.మీ) ముంపునకు గురైంది.
- గత ముప్పయేళ్లలో బంగాళాఖాతం తుపాన్లతో తూర్పు తీర ప్రాంతానికి భారీ నష్టం వాటిల్లింది.
- పశ్చిమబెంగాల్ (63శాతం), పుదుచ్చేరి (57శాతం), కేరళ (45శాతం), తమిళనాడు (41శాతం) తీరాలు కోతకు గురయ్యాయి.
- ఆసియాలోనే అత్యధిక ఉప్పునీటి మడుగులు ఒడిశా తీరంలోనే ఉన్నాయి.
- ఆలివ్ రిడ్లే తాబేళ్లకు ఈ ప్రాంతం ప్రపంచ ప్రసిద్ధి.
- ఇక్కడి భితార్కనిక మడ దండకారణ్యం ఉపఖండంలో రెండవ అతిపెద్ద అటవీ ప్రాంతం




### దేవుళ్లకూ తప్పని తిప్పలు

ప్రజలతోపాటు దేవుళ్లు కూడా ప్రమాదం నుంచి పారిపోవాల్సి వస్తోంది. శాతభయా పంచాయతీ పరిధిలోని పంచబురాహి అమ్మవారు కూడా వలసబాట పట్టారు. ఈ దేవాలయాన్ని 10 కిమీ దూరంలోని బాగపాటియా గ్రామానికి తరలించారు. 2008-17 మధ్య కాలంలో 571 మంది సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లారు. ఈ గ్రామ పంచాయతీ పరిధిలో ఇప్పటికీ 120 కుటుంబాలు సాగరుడితో పోరాటం సాగిస్తూ మొండిగా బతుకీడుస్తున్నారు.

### సింథటిక్ కుడ్యం

ఈ విపత్తును అధిగమించేందుకు ఒడిశా ప్రభుత్వం తమ వంతు ప్రయత్నాలు చేపడుతోంది. యుద్ధ ప్రాతిపదికన విపత్తును ఎదుర్కొనేందుకు కసరత్తు మొదలుపెట్టింది. సాధ్యమైనంత వరకు సముద్రుడిని నిలువరించేలా ప్రణాళికలు అమలు చేస్తోంది. 600 మీటర్ల పొడవున సింథటిక్ సాగర కుడ్యాన్ని నిర్మిస్తోంది. 39 కోట్ల రూపాయలతో కేంద్రపాద ఏరియాలోని పెంథా గ్రామం వద్ద మూడేళ్ల కిందట ఈ ప్రాజెక్టును ప్రారంభించింది. ఆటుపోట్ల తాకిడి నుంచి భూమి కోతకు గురికాకుండా ఈ ఏర్పాట్లు చేస్తున్నది. అదే సమయంలో సమీప ప్రాంతాల ప్రజలను ఇప్పటి నుంచే అప్రమత్తం చేస్తూ, పునరావాసం కల్పించే చర్యలు వేగవంతం చేసింది.



ఒడిశా తీరంలోని ఓ గ్రామంలో పూడిపోతున్న చేతిపంపును ఎప్పటికప్పుడు పైకి లేపుతూ తాడు సాయంతో వాడుతున్న దృశ్యం



## ఆందోళనలోనూ సృజన

ఈక్వేడార్‌లో పదిరోజులుగా అల్లర్లు కొనసాగుతున్నాయ్. పెట్రోలుపై సబ్సిడీ ఎత్తివేయాలన్న అధ్యక్షుడు లెనిన్ మొరెనో నిర్ణయంపై నిరసన మొదలై ఇప్పుడు పతాకస్థాయికి చేరుకుంది. ఏకంగా దేశాధ్యక్షుడి పాలన రాజధానినుంచి వేరే నగరానికి మార్చే పరిస్థితి ఏర్పడింది. ఆందోళనకారులపై బాష్పవాయు ప్రయోగం, లాఠీఛార్జ్, నీటిని చిమ్మడం వంటి ప్రయోగాలు చేస్తున్నారు. వాటిని అడ్డుకునే ప్రయత్నంలో యువ ఆందోళన కారులు సృజనకు చోటిచ్చారు. ప్రధానంగా బాష్పవాయువువల్ల శ్వాస, చూపునకు ఇబ్బంది రాకుండా ఉండేందుకు ఇళ్లలోని ప్లాస్టిక్ వాటర్ క్యాన్‌లు, ఇతర పాస్టిక్ సీసాలను ఒకవైపు కోసి వాటిని మాస్కులుగా చేసి ధరిస్తున్నారు. ఎంతో కోపంగా వస్తున్న బలగాలను వీళ్లని చూసి నవ్వాలో, శిక్షించాలో తెలీక వెనుదిరుగుతున్నారు. ఈ ఆందోళనల్లో స్థానిక గిరిజన తెగల ప్రభావం ఎక్కువగా ఉంది. 2005లో వీరి ఆందోళనవల్లే అప్పటి అధ్యక్షుడు లూసియా గొట్టిరొాజ్ పదవీచ్యుడయ్యాడు.



## బేబీ సుమో!

దాదాపు ఆరు కిలోల బరువుతో పుట్టిన తన గారాల రెండో కూతుర్ని చూసి వాళ్లమ్మ ఎమ్మాయే తనకు సుమోలాంటి ఆడపిల్ల పుట్టిందని తెగ మురిసిపోయింది. వైద్యపరీక్షల్లో 4 కిలోల బరువున్నట్లు తేలినా... ఒకటి రెండువారాల తరువాత గడువుకున్నా ముందుగానే నొప్పులు మొదలవడంతో సిజేరియన్ చేయాల్సి వచ్చింది. భారీ కాయంతో ఉన్న ఆడపిల్ల బరువు చూస్తే... 5.88 కిలోలు ఉండటంతో వైద్యులు ఒకటికి రెండుసార్లు పరిశీలించారు. ఈ అరుదైన ఘటన ఆస్ట్రేలియాలోని సిడ్నీ ఒల్లాంగ్ గాంగ్ హాస్పిటల్‌లో ఆదివారం సాయంత్రం సంభవించింది. ఆ బేబీ సుమోకు రెమీ ఫ్రాన్సిస్ అని తల్లిదండ్రులు ఎమ్మా, డేనియల్ పెట్టారు. ఆస్ట్రేలియాలో నవజాత శిశువుల సగటు బరువు 3.3. కిలోలు. అయితే ఇక్కడ ఓ విశేషం చెప్పుకోవాలి. రెండేళ్ల ఎమ్మా మొదటి కూతురు విల్లో కూడా పుట్టినపుడు 5.5 కిలోలు ఉండటం విశేషం.



# ఎన్నారై పాలసీ ఆలోచన భేష్

● సీఎం కేసీఆర్‌కు ఎన్నారైల తరఫున మహేష్ బిగాల కృతజ్ఞతలు ● హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో ప్రవాసుల పాత్రపై సమాలోచనలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** గల్ఫ్ ఎన్నారైలను తెలంగాణకు రప్పించడానికి స్వయంగా సీఎం కేసీఆర్ త్వరలో గల్ఫ్ దేశాలు పర్యటిస్తున్న సందర్భంగా, ఎన్నారై విధానం కోసం ప్రత్యేక బృందాన్ని కేరళకు పంపిస్తున్నందుకు సీఎం కేసీఆర్‌కు టీఆర్ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేష్ బిగాల అమెరికాలో మీడియా సమావేశం నిర్వహించి ధన్యవాదాలు తెలిపారు. మహేష్ మీడియాతో మాట్లాడుతూ ఎన్నారై విధానం మీద చర్చ మొదలు కాక ముందే, దుబాయ్ ప్రభుత్వం క్షమాభిక్ష విధించినప్పుడు 600 మందిని సీఎం కేసీఆర్ ఆదేశాల మేరక ు తెలంగాణకు రప్పించామన్నారు. హుజూర్‌నగర్ ఉపఎన్నికలో ఎన్నారైల పాత్ర గురించి అమెరికా టీఆర్ఎస్ ముఖ్య సభ్యులతో చర్చించామన్నారు. రెండవసారి సైదిరెడ్డికి టికెట్ ఇవ్వడం ఎన్నారైలందరు గౌవరవంగా భావిస్తున్నామన్నారు. తాను ఇండియాకు తిరిగి రాగానే సీఎం కేసీఆర్‌ను కలిసి గల్ఫ్ బాధితుల సమస్యల పైన వినతి పత్రం ఇస్తామన్నారు. ఎన్నారైలు తమవంతు పాత్ర పోషించి టీఆర్ఎస్ పార్టీ అభ్యర్ధి సైదిరెడ్డిని గెలిపించాలన్నారు. తమ బంధు మిత్రులకు ఫోన్‌లో ప్రచారం చేయాలన్నారు. సోషల్ మీడియాలో మరింత చురుకుగా ఉండాలన్నారు. వీలైన వారు హుజుర్‌నగర్‌కు వచ్చి ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహేష్‌తో పాటు టీఆర్ఎస్ యూఎస్ఏ కన్వీనర్ గనగోణి శ్రీనివాస్, టీఆర్ఎస్ అమెరికా నాయకులైన దేవేందర్ నల్లమాడ, శ్రీనివాస్ మల్లై, వెంకట్ గజ్జల పాల్గొన్నారు.

# వేగం పెరిగింది

(మొదటిపేజీ తరువాయి)

నియమించింది. ఆర్టీసీ కార్మికుల సమ్మె జోరుగా కొనసాగుతున్నప్పటికీ ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా అధికారులు ఆదివారం 5334 బస్సులను నడిపారు. ఇందులో ఆర్టీసీకి చెందిన బస్సులు 3507, ఆర్టీసీ అద్దె బస్సులు 1827 ఉన్నాయి. అంటే 50.99 శాతం బస్సులు నడిచాయి. ఆదిలాబాద్ రీజియన్‌లో మొత్తం 373 బస్సులు తిరగగా అందులో 192 ఆర్టీసీ బస్సులు, ఆర్టీసీ అద్దె బస్సులు 181, కరీంనగర్ రీజియన్‌లో 564 బస్సులు తిరుగగా అందులో ఆర్టీసీ బస్సులు 369, ఆర్టీసీ అద్దె బస్సులు 195, ఖమ్మం రీజియన్‌లో మొత్తం 57 బస్సులు తిరుగగా అందులో ఆర్టీసీ బస్సులు 30, ఆర్టీసీ అద్దె బస్సులు 27, నిజామాబాద్ రీజియన్‌లో మొత్తం 386 బస్సులు తిరుగగా అందులో ఆర్టీసీ బస్సులు 204, ఆర్టీసీ అద్దె బస్సులు 182, వరంగల్ రీజియన్‌లో 625 బస్సులు తిరుగగా అందులో ఆర్టీసీ బస్సులు 400, ఆర్టీసీ అద్దె బస్సులు 225, మహబూబ్‌నగర్ రీజియన్‌లో 666 బస్సులు తిరుగగా అందులో ఆర్టీసీ బస్సులు 457, ఆర్టీసీ అద్దె బస్సులు 209, మెదక్ రీజియన్‌లో మొత్తం 493 బస్సులు తిరుగగా అందులో ఆర్టీసీ బస్సులు 338, ఆర్టీసీ అద్దె బస్సులు 155, నల్గొండ రీజియన్‌లో మొత్తం 504 బస్సులు తిరుగగా అందులో ఆర్టీసీ బస్సులు 301, ఆర్టీసీ అద్దె బస్సులు 203, రంగారెడ్డి రీజియన్‌లో మొత్తం 344 బస్సులు తిరుగగా అందులో ఆర్టీసీ బస్సులు 208, ఆర్టీసీ అద్దె బస్సులు 136, హైదరాబాద్ రీజియన్‌లో మొత్తం 690 బస్సులు తిరుగగా అందులో ఆర్టీసీ బస్సులు 482, ఆర్టీసీ అద్దె బస్సులు 208, సికింద్రాబాద్ రీజియన్‌లో మొత్తం 632 బస్సులు తిరుగగా అందులో ఆర్టీసీ బస్సులు 526, ఆర్టీసీ అద్దె బస్సులు106 తిరిగాయని ఆర్టీసీ కార్యాలయం జారీ చేసిన ప్రకటన పేర్కొంది.

**అద్దెబస్సులకోసం సంప్రదింపులు**

సీఎం కేసీఆర్ తాజాగా జారీ చేసిన ఆదేశాల ప్రకారం వచ్చే నాలుగైదు రోజుల్లో 50 శాతం బస్సులను నడిపేందుకు వీలుగా తాత్కాలిక ప్రాతిపదికన సిబ్బందిని నియమించేందుకు ఆర్టీసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాల్లో నియామకాలకు సంబంధించి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని 30 శాతం బస్సులను అద్దె ప్రాతిపదికన తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతించడంతో బస్సులను రప్పించేందుకు ఆయా బస్సుల యజమానులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. 20 శాతం బస్సులను స్టేజీ క్యారేజీలుగా మార్చి ఆయా రూట్లను ప్రైవేట్‌వారికి అప్పగించాలని సీఎం ఆదేశించిన నేపథ్యంలో ఏయే రూట్లను ఇవ్వాలన్న అంశానికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని ఆయా డిపోల రీజనల్ మేనేజర్లు. డిపో మేనేజర్లను ఆదేశించినట్లు సమాచారం. ఇప్పటికే తమ డిపోలు, రీజనల్ల పరిధిలో సర్వే నిర్వహించిన ఆర్టీసి అధికారులు ఏయే రూట్లను ప్రైవేట్ యాజమాన్యాలకు అప్పగించాలన్న అంశంపై ఓ స్పష్టతకు వచ్చినట్లు తెలుస్తోంది.

**ప్రైవేట్‌కు పల్లెవెలుగు రూట్‌లు**

ముఖ్యంగా, గ్రామీణ ప్రాంతాలకు నడిపే రూట్లను ప్రైవేటు వ్యక్తులకు, సంస్థలకు అప్పగించాలని, పల్లెవెలుగు బస్సులు నడిపే అత్యధిక రూట్లను ప్రయివేటీకరించాలని ప్రతిపాదించినట్లు సమాచారం. ఈ రూట్లలో బస్సులను నడపడం ద్వారా సంస్థకు భారీ నష్టం వస్తోందని, ఇప్పటికే యాజమాన్యం గగ్గోలు పెడుతోంది. వీటిని ప్రైవేటీకరించడం ద్వారా నష్టాల బారి నుండి బయట పడొచ్చని ఆర్టీసీతో పాటు ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఇతర రాష్ట్రాలకు నడిపే కొన్ని రూట్లను కూడా ప్రైవేటుకు అప్పగించాలన్న యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ నుంచి షిర్డీ, బెంగళూరు, బైలడిల్ల, నాంథేడ్, ముంబై. తిరుపతి, విశాఖపట్నం ప్రాంతాలకు నడుపుతున్న కొన్ని రూట్లను ప్రైవేటుకు ఇస్తే ఎలా ఉంటుందన్న అంశంపై ఆర్టీసీ అధికారులు మథనం చేస్తున్నట్లు సమాచారం.

**అందుబాటులోకి స్కూల్ బస్సులు**

రాష్ట్రంలో పాఠశాలలు, కళాశాలలతో పాటు విశ్వ విద్యాలయాలకు ఇచ్చిన దసరా సెలవులను మరో వారం రోజుల పాటు పొడిగించడంతో వారి బస్సులను తీసుకుని ఆయా ప్రాంతాలకు నడపాలని రవాణాశాఖ నిర్ణయించింది. పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలతో ఇప్పటికే సంప్రదింపులు జరిపిన రవాణాశాఖ అధికారులు సోమవారం నుంచి ఈ బస్సులను నడపాలని నిర్ణయించారు. ఈ బస్సులు నడిపే డ్రైవర్లు, ఇతర సిబ్బందికి ఆర్టీసీ ఖరారు చేసిన వేతనాలను చెల్లించేందుకు రవాణాశాఖ అంగీకరించినట్లు సమాచారం. ఈ బస్సుల నిర్వహణకు అయ్యే ఖర్చును కూడా భరించేందుకు ఆర్టీసీ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఆదివారమే పాఠశాలలు, కళాశాలల బస్సు డ్రైవర్లు, సిబ్బందిని పిలిపించిన యాజమాన్యం వారిని వాహనాలతో సహా రవాణాశాఖ అధికారులకు అప్పగించారు. ఏయే రూట్లలో బస్సులు నడపాలన్న అంశంపై అధికారులు ఇప్పటికే వారికి దిశానిర్దేశన చేశారు. హైదరాబాద్, సికింద్రా బాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఉన్న స్కూల్ బస్సులను సిటీ బస్సులు నడిపిన రూట్లలో తిప్పనున్నారు.

ఇంటర్నేషనల్ స్కూల్స్, ఇంజనీరింగ్ కళాశాలల బస్సులను దూర ప్రాంతాలకు నడపాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రయాణీకులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఇతర రాష్ట్రాల రవాణా శాఖ అధికారులు తమ బస్సుల సంఖ్యను పెంచినప్పటికీ ప్రయోజనం నెరవేరడం లేదు. విజయవాడతో పాటు రాయలసీమ, కోస్తా, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ప్రతిరోజు హైదరాబాద్‌కు వచ్చే బస్సులకు తోడు మరికొన్ని బస్సులు నడుపుతున్నా ఆశించిన రీతిలో ప్రయాణీకులు రావడం లేదని, పరిస్థితి ఇలానే ఉంటే అదనంగా నడిపే బస్సులను రద్దు చేసుకుంటామని ఆయా డిపోలకు చెందిన మేనేజర్లు తెగేసి చెబుతున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు, తెలంగాణలోని ఇతర ప్రాంతాలకు నడు పుతున్న అదనపు బస్సుల పరిస్థితి కూడా ఇందుకు భిన్నమేమి కాదని చెబుతున్నారు. రాయ్‌చూర్, బెంగళూరు, నాంథేడ్, పరబ్బనీ, లాతూర్, నాగ్‌పూర్ తదితర ప్రాంతాల నుంచి నడుపుతున్న అంతరాష్ట్ర సర్వీసుల్లో ప్రయాణిస్తున్న వారి సంఖ్య బాగా తగ్గిం దని.. దీనివల్ల నష్టాలు ఎదుర్కొంటున్నామని ఆయా రాష్ట్రాలకు చెందిన రవాణాశాఖ అధికారులు ఇక్కడి ఆర్టీసీ అధికారులకు సమాచారం అందించినట్లు తెలుస్తోంది.



# నియామకాలకు నోటిఫికేషన్

(మొదటిపేజీ తరువాయి)

విధుల్లోకి తీసుకోవాలని డ్రైవర్ అభ్యర్థులకు రోజుకు రూ.1500, కండక్టర్లకు రూ.1000 చెల్లించాలని ఆదేశించింది. పారితోషికం పద్ధతిన పదవీ విరమణ చేసిన ట్రాఫిక్, మెకానిక్, సూపర్‌వైజర్లకు రోజుకు రూ.1500 వేతనం ఇవ్వాలని చెప్పింది. ఆర్టీసీతో పాటు ఇతర ప్రభుత్వ రంగ సంస్థల్లో సుదీర్ఘకాలం పనిచేసి పదవీ విరమణ చేసిన వారికి రోజుకు రూ.1000 చొప్పున ఇచ్చేందుకు ఆర్టీసీ యాజమాన్యం సంసిద్ధతను వ్యక్తం చేసింది. వోల్వో, ఏసీగరుడ, మల్టీయాక్సిల్ బస్సులను నడిపిన అనుభవం ఉన్న డ్రైవర్లు, మెకానిక్‌లు అందుబాటులో ఉంటే వారిని కూడా నియమించుకోవాలని, రోజుకు రూ.2000 చొప్పున పారితోషికం చెల్లించాలని సూచించింది. రోడ్లు భవనాల శాఖ పరిధిలో పనిచేసిన మెకానిక్‌లు, ఆర్మీతో పాటు కేంద్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేసిన అనుభవం ఉన్న వారు అందుబాటులో వుంటే వారి సేవలను కూడా వినియోగించుకుని వారికి రోజుకు రూ.1000 చొప్పున వేతనం ఇవ్వాలని ఆదేశించింది. కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు సాఫ్ట్‌వేర్ అనుభవం ఉన్న యువతీ, యువకులు పనిచేసేందుకు సిద్ధంగా ఉంటే వారిని నియమించుకోవాలని, వారికి రూ.1500 చొప్పున వేతనం చెల్లించాలని కోరింది. ఆసక్తి గల అభ్యర్థులు సమీప డిపో మేనేజర్ లేదా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, జిల్లా రవాణా శాఖ అధికారులను సంప్రదించాలని నోటిఫికేషన్‌లో పేర్కొంది.




# గ్రామ పంచాయతీల్లోనే వివాహ రిజిస్ట్రేషన్లు!

(మొదటిపేజీ తరువాయి)

అత్యధికశాతం వివాహాలు రికార్డుల్లో నమోదుకు దూరంగానే జరిగిపోయేవి. అయితే ఈ సమస్యలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వివాహాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలనుంచి తప్పించింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేసి స్థానిక సంస్థలకే వివాహాల నమోదు బాధ్యతలు అప్పగించింది. గ్రామ పంచాయతీ కార్యదర్శిని వివాహ నమోదు అధికారిగా నియమించింది. గ్రామంలో జననాలు, మరణాలు ఏవిధంగా రికార్డు చేసి అవసరమైన వారికి దరఖాస్తు చేసుకుంటే సర్టిఫికెట్లను అందచేస్తున్నారో ఆదేవిధంగా వివాహాల రికార్డు బాధ్యతలు కూడా కార్యదర్శులకే అప్పగించింది. వివాహ కార్యక్రమాన్ని ఎక్కడ నిర్వహించుకున్నప్పటికీ తప్పనిసరిగా ఆ వివాహ సమాచారాన్ని తగిన ఆధారాలతో కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలి. నెలరోజుల వ్యవధిలో అయితే వివాహ రిజిస్ట్రేషన్ ధృవీకరణ ప్రక్రియను ఎటువంటి ఫీజు లేకుండా ఉచితంగానే పూర్తి చేస్తారు. నెల రోజులు దాటితే వంద రూపాయల వంతున ఫీజు చెల్లించాల్సివుంటుంది. గ్రామ పంచాయతీ రికార్డుల్లో నమోదు చేసుకున్న వివాహాలకు పూర్తి చట్టబద్దత లభిస్తుంది. అర్హతగల ఎస్టీ, ఎస్సీ, బీసీ ఈబీసీ ,మైనారిటీ వర్గాల వారికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మీ , షాదీ ముబారక్ పథకాలకింద లబ్దిదారులకు ఆర్ధిక సహాయం కూడా లభించనుంది.

**బాల్యవివాహాలకు చెక్ !**

ప్రభుత్వం నూనత పంచాయతీరాజ్ చట్టం మేరకు స్థానిక సంస్థలకు వివాహాల రిజిస్ట్రేషన్ బాధ్యతలను అప్పగించటం ద్వారా రాష్ట్రంలో బాల్య వివాహాలకు చెక్ పడనుంది. వధువు , వరుడు మేజర్లయితేనే గ్రామ పంచాయతీకార్యదర్శి వారి వివాహానికి అనుమతి ఇస్తారు. మైనర్లతో వివాహం జరుగుతున్నట్టు తెలిస్తే వాటిని ఆపే అధికారం కూడా గ్రామ పంచాయతీ అధికారికే ప్రభుత్వం అప్పగించింది. బాల్యవివాహాలను అరికట్టగలిగితే వయస్సు రిత్యా వచ్చే ఆరోగ్య సమస్యలను తొలగించటంతోపాటు ఆరోగ్యకరమైన వైవాహిక జీవితాలను ప్రోత్సహించినట్టవుతుందని అధికారులు చెబుతున్నారు. వైవాహిక జీవితంలో ఒకరినొకరు ఆర్ధం చేసుకుని సుఖవంతమైన సంసారాలకు పునాదులు వేసుకుంటారన్న అశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి వివాహాల ద్వారా సామాజిక రుగ్మతలకు తావులేకుండా మెరుగైన సమాజానికి బాటలు పడతాయంటున్నారు.

# మార్కెట్ యార్డుల ఆధునీకరణ

● వచ్చే రబీ కొనుగోళ్ళనాటికి అన్ని మార్కెట్ల ప్రక్షాళన ● ఇ-నామ్ విధానం అమలుకు కసరత్తు ● ఏఎంసీల చట్ట సవరణ ద్వారా మార్పులకు శ్రీకారం ● లైసెన్స్ విధానంలో సమూల మార్పులు ● కొనుగోళ్ళు, చెల్లింపుల్లో పారదర్శకత

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ప్రతియేటా మార్కెటింగ్ సీజన్‌లో దోపిడీకి గురవుతున్న రైతాంగాన్ని ఆదుకునేందుకు రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ మార్కెట్ యార్డుల సమూల ప్రక్షాళనకు ప్రభుత్వం నడుంబిగించింది. వచ్చే ఏడాది రబీ కొనుగోళ్ళ నాటికి ఆధునీకరణ ప్రక్రియను పూర్తిచేసి అన్నిచోట్ల ఇ-నామ్ విధానం అమలుకు కసరత్తు ప్రారం భించింది. మూడేళ్ళ క్రితమే రూపొందించిన ప్రతిపాదనను పట్టాలెక్కిచేందుకు ముఖ్య మంత్రి కె.చంద్రశేఖర్‌రావు అంగీకారం తెలిపారు.



వ్యవస్థలో ఎక్కడ లోపాలున్నా, ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆ ప్రభావం రైతాంగంపైనే పడుతున్నందున నిబంధనలు సడలించి వెసులు బాటు కల్పించనున్నారు. అనేక ఆటుపోట్లను అధిగ మిస్తూ వ్యవసాయాన్నే నమ్ముకున్న అన్నదాతలు, తమ ఉత్పత్తులను ఎక్కడైనా అమ్ముకునేలా మార్కెటింగ్ చట్టాన్ని సవరించబోతున్నారు. తద్వారా దళారీల దోపిడీకి అడ్డుకట్టవేసి, నేరుగా లబ్ధి చేకూర్చనున్నారు.

ఇష్టారాజ్యంగా సాగు తున్న ఈ వ్యవహారం తెలిసినప్పటికీ సంబంధిత ఉన్న తాధికారులు ఇన్నాళ్ళూ పట్టించుకోలేదు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరలు, పారదర్శక కొనుగోళ్లకు వీలుగా ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసు కుంది. అన్ని వ్యవసాయ మార్కెట్లలో ఆన్‌లైన్ కొనుగోళ్ళను చేపట్టి ఉత్పత్తులను ఎక్కడి నుంచి ఎక్కడికైనా వెళ్ళి అమ్ముకు సందుకు అవ కాశం కల్పించనున్నారు. అదే సమయంలో ప్రస్తుత వ్యాపారుల లైసె న్సుల పరిమితిని ఎత్తివేసి ఏ మార్కెట్‌లోనైనా కొనుగోలు చేసేందుకు కొత్త లైసెన్సులను మంజూరు చేయనున్నారు. ఈ విధానంతో ఏఎంసీల ఆదాయం దాదాపు 150శాతం వరకు పెరిగే అవకాశాలున్నాయి.

అదే సమయంలో రైతులకు గిట్టుబాటు ధరలు కూడా అందుతాయని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అందుబాటులోకి వచ్చిన అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని వ్యవసాయ మార్కెట్ యార్డులను ఆధునీకరించనున్నారు. అందుకు రాష్ట్రవ్యాప్తంగా యాభై ప్రధాన మార్కెట్లను ఎంపిక చేశారు. వీటిల్లో ఆధునీకరణ ప్రక్రియ పూర్తయిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని మార్కెట్ యార్డుల్లో చర్యలు మొదలుపెట్టనున్నారు. జిల్లా కేంద్రాలు, రెవెన్యూ డివిజన్ కేంద్రాలు, కొన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్న మార్కెట్లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. పంటల ధర నిర్ణయించడంలో, కొనుగోళ్ళ లో జరుగుతున్న అక్రమాలను నిరోదిం చేందుకు ఎంపిక చేసిన మార్కెట్లన్నింటినీ జాతీయ ఆన్‌లైన్ నెట్‌వర్క్‌తో అనుసం ధానం చేయనున్నారు.

**మార్కెట్ యార్డులకు మరిన్ని నిధులు**

ఈ కొత్త విధానానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా కూడా కొంత మొత్తంలో నిధులు అందుతాయి. ఆన్‌లైన్ మార్కెట్ విధా నాన్ని ఏర్పాటు చేసేందుకు ఒక్కో వ్యవ సాయ మార్కెట్ యార్డుకు రూ.90 లక్షల చొప్పున నిధులు మంజూరు చేస్తారు. మిగతా మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. ఆన్‌లైన్ వ్యవస్థకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ లాంటి సదుపాయా లను కేంద్రమే సమకూరుస్తుంది. మొదటి విడతలో హైదరాబాద్ నగరంలోని గడ్డి అన్నారం, తిరుమ లగిరి, గుడిమల్కాపూర్, మెదక్, వరంగల్, కరీం నగర్, నిజామాబాద్, ఖమ్మం, సూర్యాపేట తదితర వ్యవసాయ మార్కెట్లలో ఆన్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేసి కొత్త విధానాన్ని అమలు చేయనున్నట్లు అధికార వర్గాల సమాచారం.

పెరుగుతున్న అవసరాల నేపథ్యంలో 1969 వ్యవసాయ మార్కెట్ యార్డుల చట్టంలో కొన్ని సవరణలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆన్‌లైన్ వ్యాపారాలు పెరుగుతున్నందున ఈ-ట్రాన్స్ పోర్ట్ విధానం ద్వారా అనుమతులు మంజూరు చేసేందుకు అవకాశం కల్పించాలన్న ప్రతిపాదనను చేర్చింది. మార్కెట్ కమిటీల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఏజెంట్ల ద్వారా ఆన్‌లైన్ అనుమతుల ప్రక్రియను ప్రారంభించేందుకు సూచనప్రాయంగా అంగీ కారం తెలిపింది. వర్తకులు, వ్యాపారుల లైసెన్స్ ధరఖాస్తు ఫీజు మొత్తాన్ని రూ.100గా నిర్ణయించింది. లైసెన్స్ పొందేందుకు రూ.5వేల డిపాజిట్ మొత్తాన్ని 15 రోజుల్లోగా మార్కెట్ కమిటీ ఖాతాల్లో జమచేసే విధంగా నిబంధన విధించారు.

గరిష్టంగా మూడు సంవత్సరాల పాటు చెల్లుబాటయ్యే విధంగా లైసెన్స్‌లను మంజూరు చేస్తారు. ఆ తర్వాత వాటిని మళ్ళీ రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఐదు కేటగిరీల్లో లైసెన్స్‌లను విడుదల చేయనున్నారు. కమిషన్ ఏజెంట్ల లైసెన్స్‌కు ధరఖాస్తు ఫీజు మొత్తం రూ.1000, లైసెన్స్ ఫీజు మొత్తం రూ.10వేలుగా నిర్ణయించారు. వేర్‌హౌజ్‌మెన్ లైసెన్స్‌కు ధరఖాస్తు ఫీజు మొత్తం రూ.1000, లైసెన్స్ ఫీజు మొత్తం రూ.5వేలుగా, తూకపు లైసెన్స్‌కు ధరఖాస్తు ఫీజు మొత్తం రూ.100, లైసెన్స్ ఫీజు మొత్తం రూ.1000, హమాలీ లైసెన్స్‌కు ధరఖాస్తు ఫీజు మొత్తం రూ.50, లైసెన్స్ ఫీజు మొత్తం రూ.100లుగా నిర్ణయించారు. ప్రాసెసర్ లైసెన్స్‌కు ధరఖాస్తు ఫీజు మొత్తం రూ.2000 నిర్ణయించిన ప్రభుత్వం లైసెన్స్ ఫీజు మొత్తాన్ని ప్రభుత్వం ఎత్తివేయనుంది.



# జ్యోతిషం మన విశ్వాసం.. శాస్త్రం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** జ్యోతిషం ఒక శాస్త్రమని, నమ్మకం, విశ్వాసాల ప్రాతిపదికగా వేల సంవత్సరాల నుంచి మన జీవన విధానంలో భాగంగా ఉందని ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు అన్నారు. జ్యోతిషంపై దేశవిదేశాల్లో ఇప్పుడు అధ్యయనాలు జరుగుతున్నాయని, ప్రపంచవ్యాప్తంగా ఆదరణ కూడా పెరిగిందని ఆయన అన్నారు. ఆదివారం విశ్వేశ్వరయ్య భవన్‌లో ఆస్ట్రో ఫౌండేషన్ జేకేఆర్ ఇంజనీరింగ్ ఇనిస్టిట్యూట్ 8వ వార్షికోత్సవం కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రహాలు, జాతకాలు అన్ని చూశాకే జ్యోతిష పండితులు వర్తమాన, భూత ,భవిష్యత్‌లను తెలియజేసే వారన్నారు. వైద్యులు రోగికి తక్షణ ఉపశమనం కలిగిస్తారని ఆస్ట్రాలజిస్టులు జరిగే మంచి చెడులతోపాటు భవిష్యత్తు తెలియచేస్తారన్నారు. మనదేశంలో జ్యోతిషానికి, జోతిష పండితులకు ఎంతో గౌరవం ఉందన్నారు. భారతీయ చరిత్రలోను, మనకు తెలిసిన రాజరిక పాలనలోనూ జ్యోతిషానికి ఉన్న ప్రాధాన్యత అపారమని అన్నారు. ప్రస్తుతం జ్యోతిష శాస్త్ర అధ్యయనం, బోధన కోసం యూనివర్శిటీలు, కళాశాలలు ఏర్పాటయ్యాయని అన్నారు. జ్యోతిషం అంతిమలక్ష్యం ప్రజల సుఖసంతోషాలేనని అన్నారు.

# 10 కోట్ల మొబైళ్లలో జిన్‌పింగ్ యాప్

**బీజింగ్:** స్టడీ ద గ్రేట్ నేషన్ పేరుతో ఈ ఏడాది జనవరిలో విడుదల చేసిన జీ జిన్‌పింగ్ యాప్‌కు చైనాలో విపరీతమైన ఆదరణ లభిస్తోంది. చైనా కమ్యూనిస్ట్ పార్టీ విడుదల చేసిన ఈ యాప్‌లో జిన్‌పింగ్‌కు సంబంధించిన వార్తలు, వీడియోలు, ఆయన కార్యక్రమాలతోపాటు ఇతర కంటెంట్ ఉంటుంది. ఈ యాప్‌ను ఇప్పటికే 10 కోట్లమందిపైగా డౌన్‌లోడ్ చేసుకున్నారు. వార్తలు చదివి, వాటిపై స్పందించిన వారికి రేటింగ్ కూడా ఇస్తున్నారు. ఎవరు మొదటి స్థానంలో ఉన్నారనే అంశాన్ని లీడర్ బోర్డ్ ద్వారా సూచిస్తున్నారు. చైనా కమ్యూనిస్ట్ పార్టీ వ్యవస్థాపకుడు మావో జెడాంగ్ లిటిల్ రెడ్ బుక్‌తో ఈ యాప్‌ను పోల్చుతున్నారు. పార్టీ సిద్ధాం తాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, జనాభాపై పార్టీ నియంత్రణ తీసుకురావడమే లక్ష్యంగా ఈ యాప్‌ను విడుదల చేశారు. ఇదిలావుండగా ఈ యాప్‌ను సెల్‌ఫోన్లో డౌన్‌లోడ్ చేసుకున్నవారి వివరాలను ప్రభుత్వం తెలుసుకోవచ్చని అమెరికాకు చెందిన సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. అంటే మొత్తం 10 కోట్ల పౌరులకు సంబంధించిన సమాచారం చైనా కమ్యూనిస్ట్ పార్టీ చేతిలో ఉందని ఓపెన్ టెక్నాలజీ ఫండ్ అనే సంస్థ టెక్నాలజీ డైరెక్టర్ సారా అవోన్ వెల్లడించారు. ఈ విధానంలో పౌరులపై ప్రభుత్వం పర్యవేక్షణ రోజురోజుకూ పెరుగుతోందని ఆయన వివరించారు.

# 'గిట్టుబాటు' వ్యూహం

● మద్దతు ధరకోసం ప్రణాళికలు ● ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద ధరల పట్టిక ● మౌలిక వసతులు తప్పనిసరి ● దళారులొస్తే దండన ● విపత్తుల పట్ల అప్రమత్తం ● అధికారులకు వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆదేశం



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కొన్ని రకాల పంటల విస్తీర్ణం అంచనాకు మించిసాగైనందున కనీస మద్దతు ధరల అమలుకు ముందస్తు వ్యూహంతో కొనుగోళ్ళకు వెళ్ళాల్సిన అవసరం ఉందని వ్యవసాయశాఖ మంత్రి ఎస్. నిరంజన్‌రెడ్డి అభిప్రా యప డ్డారు. కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి సమయం దగ్గరపడుతున్నందున ఆ దిశగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలక మండళ్ళకు ఏర్పాట్లపై మార్గదర్శకాలు ఇవ్వాలన్నారు. కొనుగోలు ప్రక్రియలో ఎక్కడా సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని, రైతుల ఆందోళనకు ఏమాత్రం అవకాశం లేకుండా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. లేదంటే తదనంతర పరిణామాలకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని మంత్రి హెచ్చరించారు. ఈ అంశంపై ఆదివారం తన అధికార నివాసం నుంచి మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులతో మాట్లాడిన నిరంజన్‌రెడ్డి కొనుగోలు ఏర్పాట్లను సమీక్షించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఒక్కసారిగా మార్కెట్ యార్డులు పంటలతో పోటెత్తే అవకాశాలున్నాయని, సకాలంలో కొనుగోళ్ళతో పాటు మద్దతు ధరలు అమలు కాకుంటే ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకుంటాయని హెచ్చరించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని క్షేత్రస్థాయి అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. మార్కెట్ యార్డులు, జిన్నింగ్ మిల్లులు, ప్రాసెసింగ్ కేంద్రాలు ముందుగానే పరిశీలించి ఏర్పాటును నిరంతరం పర్యవేక్షిం చాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికే జారీ చేసిన చెక్‌లిస్టులను పరిశీలించి, రైతుల నుంచి వచ్చే డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని, గ్రామాల వారీగా పంటల దిగుబడిని అంచనా వేసుకుని ఆ ప్రకారం కొను గోలు కేంద్రాలను పెంచాలన్నారు. కలెక్టర్ల అనుమతితో పత్తి కొనుగోలు కేంద్రాలకు సంబంధించి సాధ్యమైనన్ని ఎక్కువ కేంద్రాలను నెలకొల్పాలన్నారు. జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేసి కేంద్రాల వద్ద వేబ్రిడ్జిలను, సాంకేతిక సౌకర్యాలను కల్పించా లన్నారు.

**టోకెన్లతో రద్దీ నియంత్రణ**

కొనుగోలు కేంద్రాల వద్ద రద్దీకి ఏమాత్రం అవకాశం లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. రైతులు వరుస క్రమంలో వచ్చే విధంగా వారికి టోకెన్లు ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల కార్యదర్శులు, ఇతర అధికారులతో జిల్లా అధికారులు సమావేశమై విధులు, బాధ్యతలను గుర్తు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద మార్కెట్ కమిటీల సిబ్బంది అందుబాటులో ఉంటే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సమస్యలు, భారీ వర్షాలతో సమస్యలు తలెత్తినపుడు తక్షణ చర్యల కోసం అన్ని కోణాల్లో ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, అన్ని కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, విశ్రాంతి గదులు, మరుగుదొడ్ల తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

**ముందస్తు జాగ్రత్తలు**

ఒకవేళ అగ్నిప్రమాదాలు సంభవిస్తే పంటలకు నష్టం వాటిల్లకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. మార్కెట్లకు వచ్చే పత్తి, ధాన్యం, ఇతర ఉత్పత్తులు అకాల వర్షాలు వస్తే తడవకుండా ఉండేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. టార్పాలిన్లు, లాందర్లు, టార్చ్‌లైట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. ఎక్కడా కొనుగోళ్ళలో దళారుల ప్రమేయం లేకుండా చూడాలన్నారు. వ్యాపారులు అక్రమాలకు పాల్పడితే వెంటనే స్థానిక కలెక్టర్లకు ఫిర్యాదు చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశాలు ఇచ్చారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద మద్దతు ధరలు తెలిపే బోర్డులను ఖచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోళ్ళకు సంబంధించిన అన్ని విషయాలు, ప్రభుత్వ ఏర్పాట్లపై రైతుల్లో అవగాహన కల్పించేలా ప్రచారం చేయాలన్నారు. పంట కొనుగోలు ప్రక్రియలో ఇబ్బందులు ఎదురుకాకుండా, స్తంభించకుండా అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయి సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా మంత్రి నిరంజన్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చారు.

# కంపెనీల రొట్టె విరిగి గనిలో..!

(మొదటిపేజీ తరువాయి)

దృష్ట్యా విక్రయించేందుకు అవకాశం లభించనుందని అత్యున్నత స్థాయి ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ నేతృత్వంలో ఫైనాన్స్, మైన్స్, కోల్, ఎన్విరాన్‌మెంట్‌కు చెందిన ప్రతినిధులతో కూడిన కమిటీ ఈ మేరకు పలు ప్రతిపాదనలు చేసింది. కంపెనీలు తమ వినియోగం కోసం మాత్రమే లీజుకు తీసుకుంటున్నాయి. కొత్త విధానంలో మొత్తం ఉత్పత్తిలో 50 శాతాన్ని బహిరంగ మార్కెట్లో విక్రయించేందుకు అవకాశమివ్వాలని కమిటీ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వం అంగీకరించిందని ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. సంస్కరణలు తీసుకొచ్చేందుకు మైనింగ్‌కు సంబంధించిన చట్టాల్లో మార్పులకు ప్రభుత్వం సిద్ధమైందని వివరించారు.

**కొత్త గనులను కనుగొన్న వాడొచ్చు...**

కొత్త హైబ్రీడ్ మోడల్‌లో కేవలం కమర్షియల్ మార్కెట్లో ఉత్పత్తిని విక్రయించే అవకాశం మాత్రమే కాకుండా.. కంపెనీలు లీజింగ్ హక్కులు పొందిన మైనింగ్ ప్రాంతంలో కొత్తగా గనులను కనుగొంటే వాటిని కూడా తవ్వొచ్చు. అందుకు కోట్ చేసిన మొత్తం ఆదాయంలో 10 శాతాన్ని ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. అంతేకాకుండా జాయింట్ వెంచర్ అగ్రిమెంట్ ద్వారా లీజింగ్ పొందిన కొత్త మైనింగ్ యూనిట్ల మిగులు ఉత్పత్తిని 26 శాతం షేర్ హోల్డింగ్‌తో కంపెనీలు ఉపయోగించుకోవచ్చని కమిటీ ప్రతిపాదించింది. ఇదిలావుండగా ఈ కొత్త సంస్కరణ తీసుకొస్తే టాటా, వేదాంత, జేఎస్‌డబ్ల్యూ వంటి కంపెనీలు తమ మైనింగ్ ఉత్పత్తులను బహిరంగ మార్కెట్లో విక్రయించేందుకు అవకాశం లభించనుంది. ఇదిలావుండగా ఎస్ఏఐఎల్ వంటి ప్రభుత్వరంగ సంస్థలు ఇప్పటికే బహిరంగ మార్కెట్లో ఉత్పత్తులను విక్రయించేందుకు అనుమతి లభించిన విషయం తెలిసిందే.

**మైనింగ్‌లో ఆర్థిక క్రియాశీలత పెరుగుతుంది**

కంపెనీల వినియోగం కోసమే అనుమతులు లభించడంతో అధికంగా ఖనిజాలను తవ్వేందుకు అవకాశం లేకుండాపోయింది. ఫలితంగా ఆర్థిక క్రియాశీలత పెద్దగా లేదు. కంపెనీల వినియోగం కోసమే కాకుండా అధికంగా ఉత్పత్తి చేస్తే మిగులు ఉత్పత్తిని బహిరంగ మార్కెట్లో విక్రయించేందుకు అవకాశం లభిస్తుంది. తద్వారా ఆర్థిక క్రియాశీలిత పెరుగుతుంది.

ఆదాయం పెరుగుతుంది. ఈ ప్రక్రియకు సరికొత్త సంస్కరణలు ఉపయుక్తం చేసేందుకు అవకాశం ఉందని, ఈ విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయని కోల్ ఇండియా లిమిటెడ్ మాజీ చీఫ్ అభి ప్రాయపడ్డారు. పేరు వెల్లడించేందుకు ఆయన నిరాక రించారు. ఇదిలావుండగా ఆర్థికమాంద్యం నేపథ్యం లో ఊతమివ్వాల్సిన రంగాల్లో మైనింగ్ కూడా ఉందని ప్రభు త్వం గుర్తించింది. మైనింగ్ రంగంలో ఉద్యోగాలు కల్పిం చేందుకు ఖనిజ ఉత్పత్తులు కంపెనీలు, మార్కెట్లో విక్ర యానికి అనుమతించాలని ప్రభుత్వం భావిస్తోంది. తర్వాత మైనింగ్ రంగంలో ఉత్పత్తి, పెట్టుబడులు పెరుగుతాయని ప్రభుత్వం అంచనావేస్తోంది.



## ఆత్మహత్య చూసైనా స్పందించండి

**• ఆర్టీసీ సమ్మెపై రౌండ్ టేబుల్ సమావేశం వినతి**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వం వైఖరివల్లే ఖమ్మం జిల్లాలో ఆర్టీసీ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డారని, ఈ విషయాన్ని స్వయంగా బాధితుడే మరణ వాంగ్మూలంలో పేర్కొన్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమ్మె విరమణకు ప్రయత్నించాలని రౌండ్‌టేబుల్ సమావేశం కోరింది. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా పీఆర్‌టీయూ తెలంగాణ ఉపాధ్యాయసంఘం అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ పార్టీలు, సంఘాల నేతలు పాల్గొన్నారు. ఇప్పుడు ఆర్టీసీపై దృష్టిపెట్టిన ప్రభుత్వం మునుముందు ఉపాధ్యాయులపై దృష్టి పెడుతుందని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. రెండు రోజులు విధులకు రాకపోతేనే ఆర్టీసీ ఉద్యోగులపై ఎస్మా ప్రయోగించారని, సెల్ఫ్ డిస్మిస్ అంటున్నారని, మరి ఆరేళ్లుగా సచివాలయానికి రాని ముఖ్యమంత్రి విషయంలో ఏం చేయాలని, ఆర్టీసీ సమస్య, పేదవర్గాల సమస్య అని ఎంపీ, కాంగ్రెస్ నేత ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఈనెల 19న నిర్వహించే తెలంగాణ బంద్‌లో పాల్గొనాలని ప్రజలను కోరారు.

**ప్రైవేటుపరం చేస్తే దోపిడీయే: ఆర్.కృష్ణయ్య**

ఆర్టీసీని ప్రైవేటుపరం చేస్తే రూ.10 చార్జీ రూ.40కి పెరిగిపోతుందని, ప్రజలను ఇబ్బంది పెట్టింది ఆర్టీసీ కార్మికులు కాదని, ప్రభుత్వమేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. ఆర్టీసీ కార్మికుడు ఆత్మహత్య చేసుకుంటే సీఎం కేసీఆర్ కనీసం స్పందించకపోవటం దారుణమన్నారు. ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాస్‌రెడ్డిది ప్రభుత్వ హత్యేనని న్యూడెమోక్రసీ నేత గోవర్ధన్ విమర్శించారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పీఆర్‌టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాలు, మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ నేతలు, ఎంబీఏ, ఇంజనీరింగ్ కళాశాలల అసోసియేషన్ నేతలు భుజంగరావు, మల్లిక, గీతాంజలి, కొండయ్య, బాబు, టీపీసీసీ అధికార ప్రతినిధులు కోటూరి మానవతారాయ్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలి



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్ర అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టి మంచిపేరు తెచ్చుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్, ఆర్టీసీ సమ్మె విషయంలో చెడ్డపేరు వస్తోందని, అధికారుల మాటలు పక్కనబెట్టి సరైన నిర్ణయం తీసుకోవాలని సంగారెడ్డి ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జగ్గారెడ్డి కోరారు. సమ్మె గురించి కేసీఆర్‌కు విషం నూరిపోస్తున్నదెవరని ప్రశ్నించారు. అధికారుల సబ్ కమిటీలతో అసలు విషయం పక్కదారి పడుతోందని, ఇప్పటికే ఆర్టీసీ ఉద్యమం ఎమోషనల్‌గా మారిపోయిందన్నారు. ఒకప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పాలాభిషేకాన్ని ఆర్టీసీ కార్మికులు చేశారని, కానీ ఈరోజు ఎక్కడ లోపం జరిగిందో గుర్తించాలని సూచించారు. తెలంగాణలో కార్మికుడి ఆత్మహత్య జరగడం దురదృష్టకరమన్నారు.కార్మికులెవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. 19వ తేదీన ఆర్టీసీ కార్మికుల రాష్ట్రబంద్‌లో సంగారెడ్డి బస్‌డిపో వద్ద కార్మికులకు మద్దతుగా నిలబడతానని ఆయన చెప్పారు.

## శ్రీనివాసరెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం

సమ్మెలో పాల్గొంటూ ఆత్మహత్యకు పాల్పడిన ఆర్టీసీ కార్మికుడు శ్రీనివాస్ రెడ్డి మరణం పట్ల పలువురు కాంగ్రెస్ నేతలు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరపున అండగా ఉంటామని ప్రకటించారు. శ్రీనివాస్ రెడ్డి ఆత్మహత్య ప్రభుత్వ హత్యేనంటూ వారు ఆరోపించారు..

**మనో ధైర్యం కోల్పోవద్దు: కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

ఆర్టీసీ కార్మికులు మనోధైర్యం కోల్పోవద్దని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. మీ ఉద్యోగాలకు ఎలాంటి ఢోకా లేదని, ఆందోళన చెందవద్దని ఆయన కోరారు. బలిదానమైన శ్రీనివాస్‌రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు.

**ప్రభుత్వమే బాధ్యత వహించాలి: పొన్నాల లక్ష్మయ్య**

ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాస్ రెడ్డి ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని పీసీసీమాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య డిమాండ్ చేశారు. కార్మికులు ఆత్మహత్యలు చేసుకునేందుకేనా తెలంగాణ తెచ్చుకున్నదని ఆయన ప్రశ్నించారు. శ్రీనివాస్ రెడ్డి మరణం పట్ల పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కార్మికులెవ్వరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని ఆయన కోరారు. శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## 'కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి'

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎల్ రమణ డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తూ సమ్మెను ప్రభుత్వమే జటిలం చేస్తోందన్నారు. ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాసరెడ్డి ఆత్మహత్యకు ప్రభుత్వం బాధ్యత వహించాలని, ఆయన కుటుంబాన్ని ప్రభుత్వమే అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. ఆర్టీ కార్మికుల న్యాయమైన డిమాండ్లపై సీఎం కేసీఆర్ స్పందించాలన్నారు.

## సమ్మెకు ఏపీ ఆర్టీసీ యూనియన్ల మద్దతు

**అమరావతి, ఆంధ్రప్రభ:** తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు చేపడుతున్న సమ్మెకు ఏపీఎస్‌ఆర్టీసీ యూనియన్లు సంఘీభావం ప్రకటించాయి. తెలంగాణ ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఏపీలోని 13 జిల్లాల్లో, 128 డిపోల వద్ద ఆదివారం ఏపీఎస్‌ఆర్టీసీ యూనియన్ల జేఏసీ నాయకులు, కార్మికులు కొద్దిసేపు ధర్నాలు నిర్వహించారు. తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మె తొమ్మిదో రోజుకు చేరుకున్నా అక్కడి ప్రభుత్వం మొండి వైఖరితో వ్యవహరిస్తోందని, తెలంగాణ జేఏసీ నాయకత్వంతో చర్చలు జరపకుండా స్వయంగా ముఖ్యమంత్రే కక్ష గట్టినట్లు వ్యవహరిస్తున్నారని ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రావు, ఏపీఎస్ ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ పలిశెట్టి దామోదర్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.అలాగే ఈ నెల 19న తెలంగాణ రాష్ట్రం బంద్‌కు మద్దతుగా ఏపీలో ఆర్టీసీ ఉద్యోగులంతా ఎర్ర బ్యాడ్జీలతో విధులకు హాజరై టీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులకు సంఘీభావం తెలియజేస్తా మన్నారు.

## నర్సంపేటలో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం



**నర్సంపేట, ప్రభ న్యూస్:** ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో మనస్తాపానికి గురై మరో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యా యత్నం చేశాడు. వరంగల్ రూరల్ జిల్లా, నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన బత్తిని రవి అనే ఆర్టీసీ డ్రైవర్ నర్సంపేట డిపోలో టీఎంయు కార్యదర్శిగా వ్యవహరిస్తున్నాడు. ఆదివారం పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా పక్కనే ఉన్న కార్మికులు ఆపడంతో ప్రమాదం తప్పింది. పోలీసులు అక్కడకు చేరుకుని బత్తిని రవిని ఆస్పత్రికి, అక్కడి నుంచి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## 'శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి పరిహారమివ్వాలి'

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఆత్మహత్య చేసుకుని మరణించిన ఆర్‌టీసీ డ్రైవర్ శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి రూ. 25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్(టీఈఏ) డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు చిలగాని సంపత్‌కుమార్ స్వామి అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి గడ్డం బాలస్వామి, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు జి నిర్మల, రాష్ట్ర కన్వీనర్ బత్తిని సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. ఆర్‌టీసీ కార్మికుల సమ్మెను వెంటనే పరిష్కరించి ఆర్టీసీ సమ్మెను విరమింప చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

## నేడు బస్సు డిపోల ఎదుట సంతాప సభలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రవాప్తంగా అన్ని బస్‌డిపోల ఎదుట డ్రైవర్ శ్రీనివాస్‌రెడ్డి మృతికి సంతాప సభలు నిర్వహించాలని ఆర్టీసీ కార్మిక జేఏసీ పిలుపు నిచ్చింది. సమ్మెపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఖమ్మంకు చెందిన డ్రైవర్ శ్రీనివాస్‌రెడ్డి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందిన విషయం తెలిసిందే. శ్రీనివాస్‌రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఆదివారం సాయంత్రమే డిపోల ఎదుట కార్మికులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్మికులు పెద్ద ఎత్తున డీఆర్‌డీఎల్ అపోలో ఆసుపత్రికి చేరుకుని శ్రీనివాస్‌రెడ్డికి ఘనంగా నివాళులు అర్పించారు. కాగా... సమ్మెకు మద్దతుగా ట్రేడ్ యూనియన్లు సోమవారం ఇందిరాపార్కు వద్ద నిర్వహించతలపెట్టిన బహిరంగసభ వాయిదా పడే అవకాశం ఉంది.

# ఉద్రిక్తతల నడుమ శ్రీనివాస్‌రెడ్డి అంత్యక్రియలు

**• కట్టుదిట్టమైన భద్రత నడుమ పూర్తి • సోమవారం అంత్యక్రియలు నిర్వహించాలన్నా.. ఒప్పుకోని పోలీసులు • కాసేపు పోలీసులు-కార్మిక సంఘాల మధ్య వాగ్వాదం • హైదరాబాద్‌లోనూ కార్మిక సంఘాల ఆందోళన.. చెదరగొట్టిన పోలీసులు**

**ఖమ్మం / హైదరాబాద్ (సైదాబాద్), ప్రభ న్యూస్ :** ఆర్టీసీ కార్మికుడు దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి అంత్యక్రియలు గట్టి పోలీసు బందోబస్తు మధ్య, ఉద్రిక్తతల నడుమ ఆదివారం రాత్రి ఖమ్మం రాపర్తినగర్ శివారులో ముగిశాయి. శ్రీనివాసరెడ్డి అంత్యక్రియలను సోమవారం నిర్వహించాలని ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేసినప్పటికి వారి ప్రయత్నం నేరవేరలేదు. కడసారి శ్రీనివాసరెడ్డి మృతదేహానికి నివాళులు అర్పించేందుకు బంధువులు, తోటి కార్మికులు చేసిన ప్రయత్నం కార్యరూపం దాల్చలేదు.

శ్రీనివాసరెడ్డి పార్థివ దేహాన్ని తాను పనిచేసిన బస్సు డిపో ముందునుంచి తీసుకువెళ్లాలని కార్మిక సంఘాల నాయకులు షరతు విధించారు. ఈ ప్రతిపాదనకు పోలీసులు ససేమిరా అన్నారు. ఆ తర్వాత ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్ అశ్వత్థామరెడ్డి, కో చైర్మన్ రాజిరెడ్డి, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఖమ్మం చేరుకుని పోలీసులతో చర్చలు జరిపారు. చివరికి శ్రీనివాసరెడ్డి అంతిమ యాత్రను బస్సుడిపో ముందునుంచి తీసుకువెళ్తేందుకు అంగీకరించడంతో గొడవ సద్దుమణిగింది. శ్రీనివాసరెడ్డి మృతదేహానికి మాజీ ఎంపి జితేందర్‌రెడ్డి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, ఆయా పార్టీల నేతలు వీహెచ్, పెద్దిరెడ్డి, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి బాగం హేమంతరావు, నున్నా నాగేశ్వరరావు, పోటు రంగారావు, ఆర్టీసీ యూనియన్ నేతలు ఐక్యకార్యాచరణ సమితి సభ్యులు నివాళులు అర్పించారు.

**అపోలో ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత**

డ్రైవర్ శ్రీనివాస రెడ్డి మృతివార్త విషయం తెలుసుకున్న ఆర్టీసీ కార్మికులు కంచన్‌బాగ్ అపోలో ఆస్పత్రి ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. వీరికి మద్దతుగా కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ, ఎమ్మార్పీఎస్, జనసేన పార్టీ నేతలు ధర్నాలో పాల్గొన్నారు. కార్మికులు పెద్ద ఎత్తున ఆస్పత్రికి చేరుకోవడంతో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తును ఏర్పాటు చేసి ఆందోళనకారులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

**కార్మికులను ముంచేస్తారా?**

కార్మికసంఘాల డిమాండ్లను పరిష్కరించకుండా కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్లే పరిస్థితి ఆత్మహత్యల వరకు వెళ్లిందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌లక్ష్మణ్, మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యమ సమయంలో ఆర్టీసీ కార్మికులు చేసిన ఆందోళనను సమర్థించిన కేసీఆర్ ఇప్పుడు ఎందుకు వారి సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసా గిస్తూ అమాయక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండ రామ్, సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ కార్యదర్శి నారాయణ, ఎమ్మార్పీ ఎస్ అధ్యక్షుడు మందకృష్ణమాదిగ మాట్లాడుతూ.. ఆత్మబలిదానం చేసుకున్న శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి 50 లక్షల ఎక్స్‌గ్రెషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. ఉద్యోగుల పీఎఫ్ డబ్బులు, రిటైర్మెంట్ అనంతరం వచ్చే డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కొత్తగా ఉద్యోగులను చేర్చుకోకుండా కొన్ని రూట్లల్లో బస్సులను తిప్పడం లేదని మండిపడ్డారు. నిజమైన ఉద్యమకారులు స్వామి గౌడ్, హరీష్‌రావు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. వెంటనే ఆర్టీసీ కార్మికులతో మరోసారి చర్చలు జరిపి డిమాండ్లను పరిష్కరించాలన్నారు. అడిషనల్ డీసీపీ చవాన్ ఆధ్వర్యంలో ఆందోళనకారులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



## నేడు ఖమ్మం జిల్లా బంద్‌కు పిలుపు

**ఖమ్మం సిటీ బ్యూరో / ప్రభన్యూస్ :** ఆర్టీసీ డ్రైవర్ దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆత్మహత్య నేపథ్యంలో ఆర్టీసీ ఐక్య కార్యాచరణ కమిటీ(జేఏసీ) నేతలతో పాటు అఖిల పక్ష పార్టీల నేతలు సోమవారం ఉమ్మడి ఖమ్మం జిల్లా బంద్‌కు పిలుపు నివ్వడంతో జిల్లా అంతటా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు భారీబందోబస్తు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా ఆర్టీసీ కార్మికులకు సంఘీభావం తెలుపుతూ ప్రయివేటు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్‌ను ప్రకటించారు.



## పార్టీల వలలో చిక్కుకోవద్దు

**• మమ్మల్ని సంప్రదించలేదు: టీఎన్జీవో నేత కారం రవీందర్‌రెడ్డి • సీఎం పిలిస్తే వెళ్లడం నేరంకాదు: టీజీవో అధ్యక్షురాలు మమత**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ప్రభుత్వాన్ని కాదని, రాజకీయ పార్టీల ఉచ్చులో చిక్కుకోవద్దని ఆర్టీసీ కార్మిక నేతలకు టీఎన్‌జీవో, టీజీవో నేతలు సూచించారు. సమస్యల సాధన కోసం సీఎం కేసీఆర్‌ను కలిస్తే, వక్రీకరించటం బాధాకరమన్నారు. ఆదివారం టీఎన్‌జీవో భవన్‌లో ఉద్యోగసంఘాల నేతలు సమావేశమయ్యారు. ఆర్టీసీ సమ్మెతోపాటు ఉద్యోగుల సమస్యలపైన చర్చించారు. అనంతరం మీడియాతో టీఎన్‌జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ... సమ్మెకు వెళ్లే ముందు తమను ఎందుకు సంప్రదించలేదని ఆర్టీసీ కార్మిక నేతలను ప్రశ్నించారు. మా అభిప్రాయం తీసుకోకుండానే సమ్మెకు వెళ్లారని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని అణిచివేసేందుకు ప్రయత్నించినవాళ్లే ఆర్టీసీ కార్మికులతో కలిసి సమ్మె చేయిస్తున్నారని ఆరోపించారు. ఆర్టీసీ సమస్యలకు ఉద్యోగ సంఘాలకు సంబంధం లేదని స్పష్టం చేశారు. తమపై ఆరోపణలు చేసే నైతిక హక్కు ఎవరికీ లేదన్నారు. ఆర్టీసీ సమ్మె కొన్ని రాజకీయ శక్తుల చేతుల్లోకి వెళ్లిందని ఆరోపించారు. అయితే... ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు న్యాయబద్ధమైనవన్నారు. ఆర్టీసీ కార్మిక నేతలు కలిస్తే తమ వైఖరిని వారికి చెబుతామని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ఆర్టీసీ కార్మిక జేఏసీ నేతలు వచ్చి కలుస్తామంటే 2గంటలపాటు వేచి చూశామని, అయితే వేరే కారణాల వల్ల రాలేకపోతున్నామని చెప్పారని వివరించారు. ఆత్మహత్యలు చేసుకొవద్దని ఆర్టీసీ కార్మికులకు ధైర్యం చెప్పారు. టీజీవో అధ్యక్షురాలు మమత మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమం తర్వాత జరిగిన ఏ సమావేశంలోనూ ఆర్టీసీ నేతలు పాల్గొనలేదని స్పష్టం చేశారు. సమ్మెకు వెళ్లేప్పుడూ కూడా తమను సంప్రదించలేదన్నారు. రాజకీయ పార్టీలతో జతకట్టొద్దని ఆర్టీసీ కార్మిక నేతలకు హితవు చెప్పారు. తొందరపాటు చర్యలకు పోకుండా నాయకత్వంపై ఒత్తిడి తేవాలని కార్మికులకు సూచించారు. ఉద్యోగ సంఘాలపై ఆరోపణలు చేయటం తగదని రాజకీయ పార్టీల నేతలకు హితవు చెప్పారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వంతో మాట్లాడుతామన్నారు. ఇకనైనా ఉద్యోగ సంఘాలపై దుష్ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. సీఎం పిలిస్తే వెళ్లటం నేరం కాదు... మా బాధ్యత అని తేల్చి చెప్పారు. ఆర్టీసీ జేఏసీ నేతలు తమను కలిస్తే వారి సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

## సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి?

**• నిందలు మోపి ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తున్నారు • ఆర్టీసీ సమ్మెకు పూర్తి మద్దతు: రెవెన్యూ ఉద్యోగుల సంఘాలు**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రెవెన్యూ సిబ్బంది పని ఒత్తిడితో సహా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, అయినా ప్రభుత్వ కార్యక్రమాలన్నింటినీ ఓపికగా చేస్తున్నామని, అయితే అబాండాలు వేసి ఆత్మాభిమానం దెబ్బతీస్తుంటే సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని రెవెన్యూ సంఘాలు ఆవేదన వ్యక్తం చేశాయి. శాఖాపరంగా కూడా సమస్యలు వినేందుకు తమ శాఖకు హెచ్‌ఓడీ లేరని, ఇక ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించాయి. విధి నిర్వహణలో అసువులు బాసిన రెవెన్యూ ఉద్యోగుల సంతాప సభ ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. మృతిచెందిన రెవెన్యూ ఉద్యోగులకు ఈ సందర్భంగా నేతలు సంతాపం తెలిపారు. డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు లచ్చిరెడ్డి, టీజీటీఏ అధ్యక్షుడు రాములు, టీవీఆర్‌ఒడబ్ల్యూఏ రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేందర్‌రావు, టీవీఆర్‌ఒఏ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, టీడీఆర్‌వీఆర్వోఏ అధ్యక్షుడు రవినాయక్, టీఎస్‌వీఆర్‌ఏ అధ్యక్షుడు వంగూరి రాములు తదితరులు హాజరైన ఈ సమావేశం, ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించింది.

ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటైన తర్వాత రెవెన్యూ ఉద్యోగులకు పని ఒత్తిడి పెరిగిందన్నారు. దీంతో అనేకమంది పని ఒత్తిడి, ఆనసిక రుగ్మతలు, ప్రమాదాలతో మృతి చెందారన్నారు. రాత్రింబవళ్లు పనిచేసి 58లక్షల మందికి చెందిన రైతుల భూముల రికార్డులను ప్రక్షాళన చేసి కొత్త పాస్ పుస్తకాలు ఇచ్చామన్నారు. సాఫ్ట్ వేర్‌తో ఎన్నో ఇబ్బందులున్నప్పటికీ సాధ్యమైనంత మేర భూ రికార్డుల ప్రక్షాళన పూర్తి చేశామని, కాళేశ్వరం ప్రాజెక్టు, మల్లన్నసాగర్ భూసేకరణకు రెవెన్యూ ఉద్యోగులు ఎంతగానో కష్ట పడ్డారని, కేసులు కూడా ఎదుర్కొన్నారని, ఆర్డీవోలకు జైలు శిక్షలుకూడా పడ్డాయని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం ఉద్యోగులపై వ్యతిరేక భావం వీడి స్నేహపూర్వక వాతావరణంలో పని చేయించుకోవాలని తహశీల్దార్ల సంఘం అధ్యక్షుడు రాములు హితవు పలికారు.

టీవీఆర్వోఏ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సమ్మెకు కూడా వెనుకాడమని స్పష్టం చేశారు. తెలంగాణలో రెవెన్యూ శాఖ కృంగిపోతున్నదని డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్వో అధ్యక్షుడు రవినాయక్ అన్నారు. రెవెన్యూ వ్యవస్థను ప్రభుత్వం ఛిన్నాభిన్నం చేస్తోందని టీఎస్‌వీఆర్‌ఏ అధ్యక్షుడు వంగూరి రాములు అన్నారు.

## ఆత్మహత్యలకు విపక్షాలదే బాధ్యత



**• వారి వలలో కార్మిక సంఘాలు చిక్కుకున్నాయి • విలీనంపై ఎప్పడూ మాటివ్వలేదు • ఆర్టీసీని దేశంలో నెం.1 స్థానంలో నిలుపుతాం: మంత్రి ఎర్రబెల్లి**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను ప్రైవేటుపరం చేస్తామన్న బూచి చూపించి కార్మిక సంఘాలను విపక్షాలు రెచ్చగొడుతున్నాయని, ఆ రాజకీయ పార్టీలను చూసి కార్మికులూ రెచ్చిపోతున్నారని, నిజానికి ప్రైవేటు పరం చేసే ఆలోచనే ప్రభుత్వానికి లేదని, ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో ఆర్టీసీ లాభాల బాట పడుతుందని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. విపక్షాల వైఖరి వల్ల కార్మికుల్లో మరింత ఆందోళన పెరుగుతోందని, ఆత్మహత్యలకు పాల్పడేలా చేస్తున్నాయని, దానికి ప్రతిపక్షాలే బాధ్యత వహించాలని హెచ్చరించారు. సమ్మె పేరుతో ప్రతిపక్షాలు తెరాస ప్రభుత్వంపై కుట్రలు పన్నుతున్నాయని, ఆ ప్రయత్నాలను విఫలం చేస్తామన్నారు. అన్ని రాష్ట్రాల కంటే గౌరవప్రదమైన వేతనాలు టీఎస్ ఆర్టీసీ కార్మికులు పొందుతున్నారని, కానీ ఈరోజు భాజపా, కాంగ్రెస్, టీడీపీ పార్టీల నేతలు ఎందుకు రాజకీయం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఆర్టీసీని బాగు చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని విధాల సహకరిస్తున్నారని ఆయన తెలిపారు. ఆదివారం తెరాస శాసనసభా పక్షకార్యాలయంలో మీడియా సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడారు. ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో గానీ, మరెక్కడా గానీ ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పలేదని ఆయన తెలిపారు.

**బీజేపీ పాలిత రాష్ట్రాల్లో విలీనం చేస్తారా?**

భాజపా పాలిత రాష్ట్రాలలో ఆర్టీసీని విలీనం చేశారా? అని ఆయన ప్రశ్నించారు. దమ్ముంటే భాజపా నేతలు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో ప్రకటన ఇప్పించగలరా అని ఆయన సవాల్ విసిరారు. ఇప్పటికైనా రాష్ట్ర భాజపా నేతలు డ్రామాలు మానుకుంటే మంచిదన్నారు. తెలంగాణ నుంచి ఐదేళ్లలో కేంద్రానికి రెండు లక్షల ముప్పై వేల కోట్ల రూపాయలు ఆదాయంగా వెళ్లాయి కానీ తెలంగాణకు అవార్డులు, రివార్డులే తప్ప అదనంగా నిధు లేమీ ఇవ్వలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకోవడానికి కాంగ్రెస్, భాజపా పార్టీలు ఎన్నో ప్రయత్నాలు చేశాయని, కేంద్రం నుంచి నిధులు రాకుండా రాష్ట్ర భాజపా నేతలు అడ్డుకున్నారని, కోర్టుల్లో కేసులు వేస్తూ కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేసిందని ఎర్రబెల్లి ఆరోపించారు.

## ఆత్మహత్యలు చేసుకోవద్దు

**• అండగా ఉంటాం: లక్ష్మణ్**



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు బీజేపీ అన్ని రకాలుగా అండదండగా నిలుస్తుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె. లక్ష్మణ్ మరోసారి స్పష్టం చేశారు. పార్టీ పరంగా ఆర్టీసీ కార్మికుల పక్షాన పోరాటం చేస్తూనే ఆర్టీసీ జేఏసీ చేసే ఆందోళనలలోనూ భాగస్తులం అవుతామని చెప్పారు. ఖమ్మం ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాస్‌రెడ్డి మృతికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమ కారులను రెచ్చగొట్టేలా తెలంగాణ ఉద్యమ ద్రోహులైన మంత్రులతో రెచ్చగొట్టేలా మాట్లాడించడం వల్లే ఈ ఘటన చోటు చేసుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరూ అధైర్యపడొద్దని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. నాడు ఉద్యోగులు సమ్మె చేస్తే ఎస్మా ప్రయోగిస్తామని కిరణ్‌కుమార్‌రెడ్డి హెచ్చరిస్తే నేడు కేసీఆర్ ఏకంగా డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. ఉద్యోగ సంఘాల మధ్య చీలికలు తీసుకు వస్తున్నారన్నారు. సమైఖ్య రాష్ట్రంలో ప్రత్యేక రాష్ట్రం కోసం ఆత్మహత్యలు, గుండెలు ఆగి మరణిస్తే నేడు కేసీఆర్ నిర్ణయాల వల్ల మృతి చెందుతున్నారన్నారు.

**టీఎన్‌జీవోలపై ఆగ్రహం**

రాజకీయ పార్టీలతో కలిసి ఆర్టీసీ కార్మికులు పోరాటం చేయొద్దంటూ టీఎన్‌జీవో నేతలు పేర్కొనడంపై లక్ష్మణ్ మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమం సందర్భంగా ఇదే టీఎన్‌జీవోల సంఘం నేతలు రాజకీయ పార్టీలతో ఎందుకు పని చేశారని నిలదీశారు. సీఎం కేసీఆర్ కనుసన్నల్లో పని చేస్తున్న టీఎన్‌జీవోల సంఘం నేతలు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతివ్వాలని డిమాండ్ చేశారు.

**ఆస్తులపై శ్వేతపత్రం ఇవ్వాలి**

ఆర్టీసీ ఆస్తులపై మంత్రి పువ్వాడ అజయ్ తప్పు మాట్లాడారని లక్ష్మణ్ అన్నారు. ఆర్టీసీ ఆస్తులు కేవలం రూ. 4700 కోట్లు అని చెప్పడం దారుణమని, ముషీరాబాద్ పరిసర ప్రాంతాలలోనే దాదాపు రూ. 1500 కోట్ల విలువ చేసే ఆస్తులున్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా కోట్ల రూపాయల విలువ చేసే ఆస్తున్నాయన్నారు. ఆస్తులపై వెంటనే శ్వేతపత్రం ప్రకటించాలన్నారు.

## విపక్షాల ఉచ్చులో ఆర్టీసీ కార్మికులు

**• మంత్రి గంగుల కమలాకర్**



**కరీంనగర్, ప్రభ న్యూస్ బ్యూరో :** కార్మికులను, ఆర్టీసీని కాపాడేందుకు సీఎం ప్రయత్నిస్తున్నారని రాష్ట్రబీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్‌లో విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వంమీద విమర్శలు చేసేందుకే కార్మికులను వాడుకుంటున్నారని, వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. కార్మికులు అడిగిన 26 డిమాండ్లను మర్చిపోయి కేవలం ఆర్టీసీని ప్రభుత్వం విలీనం చేయాలని మాత్రమే అడుగుతున్నారని, విలీనం అనేది టీఆర్ఎస్ మేనిఫెస్టోలో లేదన్నారు. ఆర్టీసీని ప్రైవేటీకరిస్తామని ముఖ్యమంత్రి ఏనాడు చెప్పలేదన్నారు. ఎయిర్ ఇండియాను, రైల్వేను, బిఎస్ఎన్ఎల్‌ను ప్రైవేటీకరించేందుకు కేంద్రం ప్రయత్నిస్తుండగా ఈ విషయాన్ని విపక్షాలు ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. ఆర్టీసీ కార్మికులకు 44 శాతం ఫిట్‌మెంట్, 16 శాతం ఐఆర్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణే అన్నారు. కాంగ్రెస్ ఐదు రాష్ట్రాల్లో 18 రాష్ట్రాల్లో బీజేపీ అధి కారంలో ఉందని, ఆయా రాష్ట్రాల్లోని ఆర్టీసీని ప్రభుత్వంలో ఎందుకు విలీనం చేయలేదని ప్రశ్నించారు. వారు విలీనం చేయకుండా తెలంగాణలో విలీనం చేయాలంటూ డిమాండ్ చేయడం సముచితం కాదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక గతంలో కంటే ప్రస్తుతం రవాణా వ్యవస్థ మెరుగైందని, ఆర్టీసీ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తుండగా దీన్ని చూసి ఓర్వలేక కార్మికులను సమ్మెపేరుతో తప్పుదారి పట్టిస్తు న్నారన్నారు.

**మంత్రి గంగుల ఇంటి ఎదుట ధర్నా**

కరీంనగర్‌లోని కోర్టు సమీపంలో గల మంత్రి గంగుల కమలాకర్ ఇంటి ఎదుట ఆదివారం ఆర్టీసీ జేఏసీ నాయకులు ధర్నా నిర్వహించారు. బస్టాండ్ నుంచి ర్యాలీగా వచ్చిన జేఏసీ నాయకులు గంగుల ఇంటి ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ ఎన్‌పి రెడ్డి, సభ్యులు జక్కుల మల్లేశం, శ్రీనివాస్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వంటా వార్పుతో నిరసనలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఆర్టీసీ కార్మికుల సమ్మె ఉధృతమవుతోంది. కార్మికులు, వారి కుటుంబ సభ్యులతో పాటు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, కొన్ని ఉద్యోగ సంఘాలు సమ్మెలో పాల్గొంటుండటంతో సమ్మె ప్రభావం క్రమక్రమంగా తీవ్రమవుతోంది. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు కార్మికులు వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. వంటలు చేసిన కార్మికుల కుటుంబ సభ్యులు అక్కడే భోజనాలు చేసి తమ నిరసనను వ్యక్త పరిచారు. డ్రైవర్ శ్రీనివాస్‌రెడ్డి మరణించాడని తెలియడంతో ఖమ్మం జిల్లాలో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఖమ్మం, భద్రాచలం తదితర డిపోల ముందు కార్మికులు ఆందోళనలకు దిగారు. ఖమ్మం డిపో ముందు ఆందోళనకు దిగిన కార్మికులను పోలీసులు అరెస్టు చేస్తున్న సందర్భంగా ఒక మహిళా కండక్టర్ స్పృహకోల్పోయారు. వెంటనే తోటి కార్మికులు సదరు మహిళకు సపర్యలు చేయడంతో కోలుకున్నారు. సమ్మె ప్రారంభమై తొమ్మిది రోజులు కావస్తున్నప్పటికీ ఎవరి పట్టింపులతో వారు ఉండటంతో సమస్య ఎప్పుడు పరిష్కారమవుతుందన్నది తెలియని పరిస్థితి నెలకొంది.

**బీజేపీ మాజీ ఉద్యోగుల సెల్ మద్దతు**

ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీజేపీ అనుబంధ విభాగమైన మాజీ ఉపాధ్యాయులు, ఉద్యోగుల సెల్ మద్దతు ప్రకటించింది. సెల్ కన్వీనర్, మాజీ ఎంఎల్‌సీ బి. మోహన్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న వారంతా ఆర్టీసీ కార్మికుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిని తీవ్రంగా ఖండించారు. సమ్మెలోకి వెళ్ళిన కార్మికులను తొలగించినట్లు ప్రకటించడంపై మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏకపక్ష నిర్ణయాలు చెల్లుబాటు కావని, రాచరికపు పోకడలను అనుసరించడం సరైంది కాదని సీఎం కేసీఆర్‌ను హెచ్చరించారు. ఈ నెల 19 న జరుగనున్న తెలంగాణ బంద్‌తో పాటు ఆర్టీసీ కార్మికులు నిర్వహిస్తున్న ఆందోళనా కార్యక్రమాలన్నింటిలో రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొనాలని సమావేశం పిలుపునిచ్చింది.



## బలిదానం మనసును కలిచివేసింది



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాస్‌రెడ్డి ఆత్మ బలిదానం తీవ్రంగా కలిచి వేసిందని జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ సంఘటన అత్యంత దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం బస్సు డిపోలో పనిచేస్తున్న శ్రీనివాస్ శనివారం మధ్యాహ్నం ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించగా తోటి కార్మికులు నిలువరించడంతో ఆయన ప్రాణాలు నిలబడ్డాయని, అప్పుడే ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకుని శ్రీనివాస్‌తో మాట్లాడి ఉంటే ఆయన ఇంటికి వెళ్లిన తర్వాత ఆత్మాహుతి అయ్యేవారు కాదన్నారు. భార్యాపిల్లల ఎదుట ఆయన మంటల్లో దహించుకుపోవడం తలచుకుంటేనే గుండెలు బరువెక్కుతున్నాయన్నారు. వరంగల్ జిల్లా నర సన్నపేట డిపోలో కూడా ఆదివారం రవి అనే కార్మికుడు ఆత్మహత్యకు ప్రయ త్నించారని వచ్చిన వార్త కూడా ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ పరిస్థితిని తెలంగాణ ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, ఆర్టీసీ కార్మికులలో ధైర్యాన్ని నింపేలా చర్యలు తీసుకోవాలన్నారు.

Andhraprabha business 2019
బిజినెస్
BUSINESS

# రేపు జీఎస్టీ ప్యానల్ భేటీ

**న్యూఢిల్లీ :** జీఎస్టీ వసూళ్లు పెంచుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఉన్నతస్థాయి ప్యానెల్ సమావేశం మంగళవారం నాడు జరగనుంది. జీఎస్టీ వసూళ్లు 19 నెలల కనిష్ఠానికి పడిపోవడంతో ప్రభుత్వం గత వారం ప్యానెల్ ఆఫీసర్లను ఏర్పాటు చేసి వసూళ్లను పెంచుకోవాడానికి, జీఎస్టి ఎగ్గొట్టకుండా ఎలాంటి నివారణ చర్యలు తీసుకోవాలని సలహాలు సూచనలు ఇవ్వాలని ఈ ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది. ఇదిలా ఉండగా సెప్టెంబర్ నెల జీఎస్టీ వసూళ్లు రూ.91,916 కోట్లకు దిగవచ్చాయి. ఉన్నతస్థాయి కమిటి సమావేశం అక్టోబర్ 15న జరగనుందని జీఎస్టి కౌన్సిల్ ప్రత్యేక




కార్యదర్శి రాజీవ్ రాజన్ చెప్పారు. కాగా ఈ కమిటి తన నివేదికను 15 రోజుల్లో సమర్పిస్తుందని ఆయన చెప్పారు. పరోక్ష పన్నుల వ్యవస్థ జీఎస్టి జులై 1, 2017 నుంచి అమల్లోకి వచ్చింది. అటు తర్వాత దానిపై లోతుగా సమీక్ష జరపడం ఇదే మొదటిసారి.

# మాంద్యం తీవ్రం

## •డిమాండ్ ఢమాల్ •జీడీపీ 6శాతమే

## • కోత విధించిన ప్రపంచ బ్యాంక్




**న్యూఢిల్లీ :** భారత్ జీడీపీ వృద్ధిరేటును ప్రపంచబ్యాంకు తగ్గించింది. భారతీయ రిజర్వుబ్యాంకు కూడా ఈ ఆర్థికసంవత్సరం జీడీపీ వృద్ధిరేటును సవరించింది. ముఖ్యంగా దేశీయంగా డిమాండ్ తగ్గడమే కారణమని ఆర్‌బీఐ ద్రవ్యపరపతి సమీక్షలో పేర్కొంది. కాగా ప్రపంచ బ్యాంకు ఈ ఆర్థిక సంవత్సరానికి ముందుగా వృద్ధిరేటును 6 శాతంగాను.. అంతకు ముందు 7.5 శాతంగా అంచనా వేసింది. కాగా గత ఆర్థికసంవత్సరం భారత్ జీడీపీ వృద్ధిరేటు 6.8 శాతంగా నమోదైంది. ప్రపంచబ్యాంకు తాజా దక్షిణాసియా ఎకనమిక్ ఫోకస్ నివేదికను ఆదివారం నాడు విడుదల చేసింది. అయితే భారత వృద్ధిరేటు క్రమంగా పుంజుకుంటుందని 2020-21 నాటికి కాస్తా కోలుకొని 6.9 శాతానికి, అటు తర్వాత 2021-22 నాటికి జీడీపీ వృద్ధిరేటు 7.2 శాతానికి చేరుతుందని అంచనా వేసింది. భారత్‌లో ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థ మందగమనం తీవ్రంగా ఉందని నివేదికలో పేర్కొంది. వృద్ధిరేటు మందగించడానికి ప్రధాన కారణం స్థానికంగా డిమాండ్ తగ్గడమేనని బ్యాంకు పేర్కొంది. బలహీనమైన ఆర్థిక పరిస్థితి, నిర్మాణాత్మకమైన అంశాలు, బ్యాంకింగ్ వ్యవస్థ బలహీనంగా ఉండటం కలిసి జీడీపీ వృద్ధిరేటుపై ప్రభావం చూపుతు న్నాయని పేర్కొంది.

ఈ నెల ప్రారంభంలో రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా కూడా వృద్ధిరేటు అంచనాను 6.1 శాతానికి కుదించింది. ఐదేళ్లలో అత్యంత కనిష్టం ... జీడీపీ వృద్ధిరేటు వరుసగా ఐదో నెల తగ్గి జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఐదు శాతానికి దిగివచ్చింది. మార్చి 2013 తర్వాత జీడీపీ వృద్ధిరేటు అత్యంత బలహీనంగా నమోదైంది. పరిస్థితులు దారుణంగా మారడంతో ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చింది. వృద్ధిరేటు మందగించడంతో రిజర్వుబ్యాంకు కూడా వరుసగా కీలక వడ్డీరేట్లు.. లేదా రెపోరేటును తగ్గించుకుంటూ వచ్చింది. ప్రభుత్వం కూడా ఉద్దీపన పథకాలను ప్రకటించిందని ప్రపంచబ్యాంకు నివేదికలో వెల్లడించింది. ఈ చర్యల వల్ల మందగమనం నుంచి కాస్తా ఉపశమనం లభిస్తుంది. అయితే దీని ప్రభావం వల్ల ద్రవ్యలోటు పెరిగిపోయే అవకాశం కూడా ఉంటుందని హెచ్చరించింది. ప్రైవేట్ వినియోగం పెంచుకోవడానికి, విధానపరమైన నిర్ణయాల తీసుకోవడం ప్రభుత్వానికి అతి పెద్ద సవాలు అని నివేదికలో వెల్లడించింది. భారత్‌కు అంతర్గత ఇబ్బందులకన్నా బయటి నుంచే ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ముఖ్యంగా గ్లోబల్ ఆర్థిక పరిస్థితులు సవాలుగా మారాయని, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల్లో కొత్త కొత్త డిఫాల్ట్లు తెలెత్తడంతో మళ్లీ బ్యాంకింగ్ వ్యవస్థలో సంక్షోభం మొదలైందని తెలిపింది. ఈ పరిణామాలను అధ్యయనం చేసిన తర్వాత అధికారులు బ్యాంకింగ్ రంగంలో నిధులు పుష్కలంగా ఉండేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, దీంతో పాటు ఎన్‌బీఎఫ్‌సీ రంగాన్ని కూడా నియంత్రణా సంస్థ పరిధిలోకి తేవాల్సిన అవసరం ఉందని సూచించింది. దక్షిణాసియా ఆర్థిక వ్యవస్థ ఈ ఏడాది 5.1 శాతంగా నమోదు కావచ్చునని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. ముందుగా ఏప్రిల్‌లో వేసినా అంచనాతో పోల్చుకుంటే 1.1 శాతం తక్కువ. దీంతో పాటు శ్రీలంక, మాల్దీవ్స్, భూటాన్‌ల వృద్ధిరేటులో కోత విధించగా.. నేపాల్, బంగ్లాదేశ్ వృద్ధిరేటు పెరుగుతుందని నివేదికలో పేర్కొంది.

### రియల్ సంక్షోభం..ఎన్‌పీఏల సెగ

బ్యాంకింగ్ రంగం ఇప్పుడిప్పడే మొండిబ కాయి ల గండం నుంచి గట్టెక్కు తోంది. అయితే రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న నగదు కటకట బ్యాంకింగ్ రంగం పై తీవ్ర ప్రభావం చూపుతుం ది. మరోమారు బ్యాంకులకు ఎన్‌పీఏల ప్రమాదం పొంచి ఉంది. స్థిరాస్తి రంగంలో రెసిడెన్షియల్ ఫ్లాట్లకు డిమాండ్ తగ్గడంతో చాలా మంది బిల్డర్లు తీసుకున్న రుణాలు చెల్లించడంలో విఫలం అవుతున్నారు. బిల్డర్లు నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల నుంచి రుణాలు తీసుకుంటాయి. హౌసింగ్ ఫైనాన్స్ కంపనీలు బ్యాంకింగ్ నియం త్రణా సంస్థ పరిధి కిందికి రావు. డెవలపర్లలో 50 శాతం మంది హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీల నుంచి రుణాలు తీసుకున్నవే.

### వచ్చే ఏడాది రూ.70వేల కోట్లు చెల్లించాలి

వచ్చే ఏడాది 2020 ద్వితీయార్థంలో డెవలప ర్లు సుమారు పది బిలియన్ డాలర్ల రుణాలు లేదా రూ.70వేల కోట్లు హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లకు బకాయిల కింద చెల్లించాల్సి ఉంటుందని ఫిచ్ రేటింగ్ భారతీయ విభాగం వెల్లడిం చింది. ఒక వేళ డిఫాల్ట్ అయితే మాత్రం దీని ప్రభావం మొత్తం బ్యాంకింగ్ రంగంపై పడుతుంది. ఎందుకంటే బ్యాంకులు నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీ)లకు రుణాలు ఇస్తాయి. భారతీయ రిజర్వుబ్యాంకుతో పాటు ప్రభుత్వం కూడా బ్యాంకింగ్ రంగంలో మొండిబకాయిలు మొత్తం 150 బిలియన్ డాలర్లకు చేరాయని పేర్కొన్నాయి. ప్రస్తుతం బ్యాంకింగ్ రంగంలో నాలుగేళ్ల మొండిబకాయిలు తగ్గుముఖం పట్టాయి. గత తొమ్మిది నెలల నుంచి పెద్ద సంఖ్యలో స్తిరాస్థి డెవలపర్లు పెద్ద సంఖ్యలో డిఫాల్ట్ అయ్యారు. దీని ప్రభావం నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలపై పడుతోంది. తాజా పరిణామాల నేపథ్యంలో మరోసారి బ్యాంకింగ్ రంగంలో మొండిబకా యిలు లేదా ఎన్‌పీఏలు బిలియన్‌ల కొద్ది డాలర్లుపెరిగిపోతాయి.

### నిలిచిపోయిన ప్రాజెక్టులు

ఉదాహరణకు ఢిల్లీలో జెపీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నోయిడాలో కొత్త ప్రాజెక్టును ప్రారంభించింది. చాలా మంది ఈ ఫ్లాట్‌లు బుక్ చేసుకొని 90 శాతం వరకు చెల్లించేశారు. ఐదేళ్ల క్రితమే ఈ ఫ్లాట్‌లు కొనుగోలుదారుడికి అందించాలి. అయితే జెపీ కావాలని ఈ ప్రాజెక్టును జాప్యం చేసి 2017 దివాలాతీసినట్లు దివాలాకోర్టును ఆశ్రయించింది. కాగా దివాలాచట్టం కోర్టు కూడా ఈ సమస్యను పరిష్కరించలేకపోయింది. ఇప్పటికి ఫ్లాట్‌లు కొనుగోలు చేసిన వారు త్రిశంకుస్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ ప్రాజెక్టులో ఫ్లాట్‌ధర కోట్లలో ఉంటుంది. ఇలాంటి ప్రాజెక్టులు దేశంలో కోకొల్లలు. కొనుగోలు దార్లు ఇలాంటి ప్రాజెక్టుల్లో స్తిరాస్తి కొనుగోలు చేసి చేతులు కాల్చుకున్నారు. ఈ స్థిరాస్తిని మరో డెవలపర్ ఎవరైనా కొనుగోలు చేసి ఎప్పుడు పూర్తి చేసి తమకు అప్పగిస్తారా అని కొనుగోలుదార్లు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. కష్టపడి సంపాదించిన సొమ్ము డెవలపర్లకు అప్పగించి వారి చుట్టు తిరగాల్సి వస్తోంది.

### దివాలాకోర్టులకు రియల్టర్లు

ఈ ఏడాది జూన్ నాటికి సుమారు 421 రియల్టర్లు దివా లకోర్టును ఆశ్రయించాయి. గతేడాది సెప్టెంబర్ 30న ఈ సంఖ్య 209 మాత్రమే. హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఆల్టికో క్యాపిటల్ డిఫాల్ బ్యాంకింగ్ రంగంపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశం కనిపిస్తోంది.

### ఆర్‌బీఐ దృష్టికి రియల్‌ఎస్టేట్ అంశం

ఇదిలా ఉండ గా.. రియల్ ఎస్టేట్ రంగం లో ఏర్పడిన సంక్షోభం ఈ నెల ప్రారం భంలో జరిగిన రిజ ర్వు బ్యాంకు ద్రవ్య పరపతి సమీక్షలో ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ దృష్టికి వచ్చింది. సెంట్రల్ బ్యాంకు ఈ రంగంలో గత ఆరు నెలల ఆర్థిక స్థిరత్వ నివేదికపై అధ్యయనం చేస్తుందని తెలిపింది. రియల్ రంగానికి చెందిన వర్గాల ప్రకారం డెవలపర్లు తమ వద్ద ఉన్న యూనిట్లను 25 శాతం డిస్కౌంట్‌కు విక్రయించి బకాయిలు చెల్లించాలని చూస్తున్నా పెద్దగా ఫలితాలివ్వడం లేదని చెబుతున్నారు. బిల్డర్ల వద్ద అమ్ముడుపోకుండా నిలిచిపోయిన ప్రాజెక్టులు కోకొల్లలు. అలాగే గత నాలుగు ఐదు సంవత్సరాల నుంచి దేశంలోని చాలా ప్రాంతాల్లో పెద్దగా పురోగతి కనిపించలేదు. దేశవ్యాప్తంగా చూస్తే సుమారు 25 బిలియన్ డాలర్ల ప్రాజెక్టులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కాబట్టి దాని ప్రభావం బ్యాంకింగ్ రంగంపై ఖచ్చితంగా ఉంటుంది. ఇప్పడిప్పుడే బ్యాంకులు ఎన్‌పీఏల నుంచి కోలుకుంటు న్నాయి. తిరిగి మళ్లీ బ్యాంకులకు ఎన్‌పీఏల సెగ తగిలే అవకాశాలు మాత్రం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# హీరో మోటోను వెనక్కినెట్టిన సుజుకి మోటార్ సైకిల్



**న్యూఢిల్లీ:** స్కూటర్ల అమ్మకాల్లో ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో సుజుకి మోటార్‌సైకిల్ ఇండియా .. హీరోమో టోకార్ప్‌ను వెనక్కి నెట్టి మూడవ స్థానాన్ని ఆక్రమించినట్లు ఆటో పరిశ్రమకు చెందిన సియామ్ వెల్లడించింది. స్కూటర్ల విభాగంలో హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్‌ఎంఎస్‌ఐ) నెంబర్ వన్ స్థానంలో కొనసా గుతోంది. తర్వాత స్థానం లో టీవీ ఎస్ మోటార్ కంపెనీ ఆక్రమించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ కాలానికి సుజుకి మోటార్‌సైకిల్ మొత్తం 3,41,928 యూనిట్లు విక్రయిస్తే.. హీరోమోటో కార్ప్ మాత్రం 2,49,365 యూనిట్లు విక్రయించినట్లు సియామ్ వెల్లడించింది. ఏడాది క్రితం ఇదే కాలంలో సుజుకీ మోటార్ సైకిల్ 2,91,847 యూనిట్లు విక్రయిస్తే.. హీరోమోటోకార్ప్ 3,91,019 యూనిట్లు విక్రయించింది. ఈ ఏడాది ఏప్రిల్-సెప్టెంబర్‌లో స్కూటర్ల అమ్మకాలు 17.16 శాతం తగ్గిస్తే.. హీరోమోటో 36.23 శాతం క్షీణించాయి. మొత్తం స్కూటర్ మార్కెట్ 16.94 శాతం తగ్గి 31,17,433 యూనిట్లకు దిగిరాగా.. ఏడాది క్రితం 37,53,064 యూనిట్ల విక్రయాలు జరిగాయి. మార్కెట్ లీడర్ హెచ్‌ఎంఎస్‌ఐ స్కూటర్ల అమ్మకాలు 17,32,579 యనిట్లు విక్రయించగా.. ఏడాది 21,82,860 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. అమ్మకాల్లో 20.62 శాతం తగ్గాయి. టీవీఎస్ మోటార్ 5,98,617 యూనిట్లు విక్రయించగా, ఏడాది క్రితం 6,44,981 యూనిట్లు విక్రయించాయి.. 7.19 శాతం క్షీణించాయి. యమహా మోటార్ సైకిల్ ఐదవ స్థానానికి పరిమితం అయ్యింది. 157,483 యూనిట్లు విక్రయించగా.. ఏడాది క్రితం విక్రయించగా..1,93,385 యూనిట్లు విక్రయించింది. 20.61 శాతం అమ్మకాలు తగ్గాయని సియామ్ వెల్లడించింది.

# ఈవారం మార్కెట్.. ఫలితాలే కీలకం




**ముంబై :** ఈ వారం స్టాక్ మార్కెట్లకు కీలకమయ్యే అంశాల విషయానికి వస్తే రియలన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌యూఎల్, విప్రో రెండవ త్రైమాసిక ఫలితాలు కీలకం కానున్నాయి. దీంతో పాటు విదేశీ మార్కెట్లో జరిగే పరిణామాలు కూడా దేశీయ మార్కెట్లపై ప్రభావం చూపనున్నాయని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయప డుతున్నారు. సోమవారం నాడు మార్కెట్ ప్రారంభం కాగానే ఇన్ఫోసిస్ ఫలితాల ప్రభావం కనిపిస్తుంది. దీంతో పాటు అమెరికా- చైనాల మధ్య వాణిజ్య చర్చలపై ప్రభావం కూడా ఉంటుందని చెబుతున్నారు. మొత్తానికి మార్కెట్లో మిశ్రమ స్పందన కనిపిస్తుందని రేలిగేర్ బ్రోకింగ్ లిమిటెడ్ తెలిపింది. ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ శుక్రవారం నాడు మార్కెట్ ముగిసిన తర్వాత ఫలితాలు వెల్లడించింది. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికం నికరలాభంలో 2.2 శాతం క్షీణించింది. మార్కెట్లకు దిశానిర్దేశం చేసే అంశానికి వస్తే కార్పొరేట్ ఫలితాలే కీలకపాత్ర పోషిస్తాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాగా కార్పొరేట్ ఫలితాల్లో మిశ్రమ స్పందన కనిపిస్తోంది. గతేడాదితో పోల్చుకుంటే రెవన్యూ తగ్గే అవకాశాలు న్నాయి. ఈ వారంలో వెల్లడయ్యే కార్పొరేట్ ఫలితాలు ఇలా ఉన్నాయి. హిందుస్తాన్ యూనీలీవర్ లిమిటెడ్, ఫెడరల్ బ్యాంకు, విప్రో,రిలయన్స్ ఇండస్ట్రీస్ లమిటెడ్‌లున్నాయి. సూక్ష్మ ఆర్థిక అంశాల విషయానికి వస్తే టోకు ద్రవ్యోల్బణం గణాంకాలు సోమవారం నాడు విడుదల కానున్నాయి. దాని ప్రభావం మార్కెట్లపై కనిపిస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు. శుక్రవారం నాడు విడుదలైన పారిశ్రామికోత్పత్తి గణాంకాలుకూడా మార్కెట్లపై ప్రభావం చూపుతాయి. ఆగస్టు నెల ఐఐపీ 1.1 శాతంగా నమోదైంది. తయారీరంగంతో పాటు విద్యుత్, గనుల రంగంలో ఉత్పత్తి క్షీణించినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. అమెరికా - చైనాల మధ్య వాణిజ్య చర్చల పురోగతితో శుక్రవారం నాడు గ్లోబల్ ఈక్విటీ మార్కెట్లు ఊపందుకున్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రికత్తల విషయానికి వస్తే... ఇరానీయన్ చమురు ట్యాంకర్లపై సౌదీ అరేబియాకు సమీపంలో ఎర్ర సముద్రంలో దాడులు జరిగాయి. దీంతో చముర సరఫరాపై ప్రభావం చూపించింది. చమురు ధరలు రెండు శాతం పెరిగాయి. గత వారం బీఎస్ఈ 453.77 పాయింట్లు లాభపడింది.

# ఎయిర్‌కార్గో హబ్‌గా హైదరాబాద్

## •హైదరాబాద్ కార్గో చార్టర్ సర్కిల్‌ను ప్రారంభించిన జీఎంఆర్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** హైదరాబాద్ నుంచి దేశ, విదేశాలకు చౌకగా, సమర్థంగా విమానాల ద్వారా సరకు రవాణాను పెంచే లక్ష్యంతో హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానా శ్రయంలో హైదరాబాద్ కార్గో చార్టర్ సర్కిల్ (హెచ్‌సీ3)ను జీఎంఆర్ సంస్థ ప్రారంభించింది. ఈ ఛాప్టర్‌లో సభ్యత్వం పొందిన ఏ కార్గో సంస్థ అయినా పలు రాయితీలు, సౌకర్యాలతో ఎక్కడికైనా సరకు రవాణాను భద్రంగా, సమర్థంగా, త్వరితంగా చేరవేసే అవకాశం ఏర్పడు తుంది. వివిధ కార్గో ఆపరేటర్ల కోసం అందుబాటులోకి తీసుకువచ్చిన ఈ చాప్టర్ దేశంలోనే మొట్ట మొదటిది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో చార్టర్ ఆపరేటర్లు, ఫ్రైటర్లు, పిప్పర్లు, కన్సాలిడేషన్ ఏజెంట్లు, ఫ్రైయిట్ ఫార్వర్డర్ల సమక్షంలో హైదరాబాద్ కార్గో చార్టర్ సర్కిల్‌ను ఆవిష్కరించారు. హైదరాబాద్‌ను దక్షిణాది ఎయిర్ చార్టర్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు, ప్రపంచంలోని ప్రధానమైన మార్కెట్లకు అనుసంధానించే లక్ష్యంతో జీఎంఆ ర్ సంస్థ ఈ ఏర్పాటు చేసింది. హెచ్‌సి3 సభ్యత్వ పథకంలో చేరిన వారికి అదనపు ఉచిత కార్గో స్టోరేజీ సమయంతో అనేక సౌలభ్యాలను కల్పిస్తోంది. సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ 24/7 అందుబాటులో ఉండటం, ప్రయారిటీ స్టోరేజ్ కేటాయింపు టెర్మినల్‌లో మొదటి నుంచి చివరి వరకు లాజిస్టిక్ సపోర్ట్ లాంటి అనేక సదుపాయాలు కల్పిస్తోంది. హెచ్‌సీ3 వల్ల దక్షిణ భారతదేశంలో సరుకు రవాణా చేసేవారందరి సరుకులు పలు చోట్ల హ్యాండిల్ చేయడం తగ్గి, సరుకు రవాణా మరింత సులభంగా సురక్షితంగా జరిగిపోతుంది. ఈ సందర్భంగా జీహెచ్ ఐఈఎల్ సీఈఓ ఎస్.జి.కె. కిషోర్ మాట్లాడు తూ భారతదేశంలో కార్గో చార్టర్లు అనే భావన ఇంకా ప్రాథమి క దశలో ఉందని, ప్రస్తుతం దేశంలోని విమానాశ్రయాల్లో కార్గో చాలా తక్కువగా ఉన్నా, భవిష్య త్‌లో పెరుగుతుందని, కార్గో చార్టర్లకు అనేక అవకాశాలు ఉన్నాయి. దీనిని గుర్తించి ఈ వినూత్నమైన హెచ్‌సీ3 పథకం ప్రారంభిం చామ న్నారు. హైదరాబా ద్ ఎయిర్ పోర్ట్ నేతృత్వం లో ప్రారంభి స్తున్న ఈ వేదిక పారిశ్రామిక వర్గాల వాణి జ్యం, లాజిస్టిక్స్ పెరగడానికి దోహదపడుతుంద న్నారు. హైదరా బాద్ అంతర్జాతీ య విమానా శ్రయానికి ఔషధాలు, ఇంజనీ రింగ్ గూడ్స్, టెలికాం, రక్షణ, ఎయిరోస్పేస్ కమాడిటీస్‌కు చెందిన విభాగాల కు చెందిన కార్గో చార్టర్‌ల నుంచి డిమాండ్ పెరుగు తోంది. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్ర యానికి మొదటి మాడ్యులార్ ఇంటిగ్రేటెడ్ కార్గో ఫెసిలిటీని నిర్మించిన ఘనత ఉంది. ఏడాదికి 150000 మెట్రిక్ టన్నుల ను హ్యాండ్లింగ్ చేయగల సామర్థ్యం ఉన్న ఈ కార్గో ఫెసిలిటీ లో దేశంలో మొట్ట మొదటి ఫార్మా జోన్ ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఈ టెర్మినల్ 148 వేల టన్నుల కార్గోను నిర్వహించడం విశేషం. భారత ప్రభుత్వ విజన్‌కు అనుగుణంగా హైదరాబాద్‌ను ఒక పెద్ద కార్గో హబ్‌గా తయారు చేయడానికి జీహెచ్ఐఏఎల్ కృషిచేస్తోంది. 2025 నాటికి భారతదేశాన్ని ప్రపంచంలోని ఐదు ప్రధాన ఎయిర్ ఫ్రైయిట్ మార్కెట్లలో ఒకదానిగా చేయాలన్న లక్ష్యానికి అనుగుణంగా హైదరాబాద్, ఢిల్లీ విమానాశ్రయాలను నిర్వహిస్తున్న జీఎంఆర్ గ్రూప్ కృషి చేస్తోంది.




# పీఎస్‌యు బ్యాంకు చీఫ్‌లతో సీతారామన్ భేటీ నేడు



**న్యూఢిల్లీ :** ఆర్థిక మంత్రి నిర్మలా సీతారా మన్ సోమవారం నాడు ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకుల సీఈవో లతో సమావేశం అవుతారు. ముఖ్యంగా రుణాల డిమాండ్ పెంచడానికి.. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి ఎలాంటి చర్చలు తీసుకోవాలో ఈ సమావేశంలో చర్చిస్తారు. ఎన్‌బీఎఫ్‌సీలకు, ఎంఎస్ఎంఈ రంగానికి రుణాలు అందుబాటులో ఉంచే అంశం గురించి కూడా సమీక్ష జరుపుతారని విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఈ సమావేశంలో బ్యాంకులు పాక్షిక క్రెడిట్ గ్యారంటీ పథకం మార్కెట్ నుంచి నిధుల సేకరించి మూలధనం పెంచుకొనే అంశానికి సంబంధించినవి ఆమె దృష్టికి తీసుకువస్తారని చెబుతున్నారు. ఈ ఏడాది ఆగస్టులో కేంద్రప్రభుత్వం నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలకు చెందిన స్థిరాస్తులను (అవి పటిష్ఠంగా) ఉంటేనే కొనుగోలు చేయడానికి అనుమతులు మంజూరు చేసింది. ఎన్‌బీఎఫ్‌సీలకు వ్యాపారం చేసుకోవడానికి రూ.1 లక్ష కోట్ల వరకు పాక్షిక గ్యారంటీ ఇవ్వడానికి కేంద్రప్రభుత్వం అనుమతించింది. ఇదిలా ఉండగా గత ఏడాది ఐఎల్ అండ్‌ఎఫ్ఎస్ గ్రూపు కంపెనీలు దివాలా తీయడంతో దాని ప్రభావం ఎన్‌బీఎఫ్‌సీలపై పడింది. ఈ సమావేశంలోనే దేశవ్యాప్తంగా 226 జిల్లాల్లో జరుగుతున్న బ్యాంకుల రుణమేళా గురించి చర్చిస్తారు. కాగా సీతారామన్ ఇలాం టి సమావేశం నిర్వహించడం నెల కాలంలో ఇది రెండవసారి. అక్టోబర్ 7వ తేదీ నుంచి మొదలైన రుణమేళా ద్వారా వ్యవసాయ, వాహనాలు, గృహ, విద్య, వ్యక్తిగ త రుణాలతో పాటు చిన్నమధ్య తరహా వ్యాపారులకు రుణాలు అందిస్తాయి. రెండ వ దఫా రుణ మేళా అక్టోబర్ 21 నుంచి 25వరకు జరుగుతాయి. దీంతో పాటు ప్రభుత్వం కూడా పీఎస్‌బీలోన్ 59 మినిట్స్ అనే పోర్టల్‌ను ప్రారంభించింది. అర్హులై న వారికి సూత్రప్రాయంగా 59 నిమిషాల్లో తమకు కావాల్సిన రుణాలు పొందవచ్చు.

# నేడు ఐఆర్‌సీటీసీ లిస్టింగ్

**న్యూఢిల్లీ :** ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) లిస్టింగ్ సోమవారం నాడు స్టాక్ మార్కెట్లో జరగనుంది. ఇటీవలే మార్కెట్ నుంచి రూ.645 కోట్లు సేకరించింది. బీఎస్ఈతో పాటు ఎన్ఎస్ఈలో 'బి' గ్రూపు సెక్యూరిటీల్లో ఈ షేర్లు లిస్టు అవుతాయని బీఎస్ఈ ఒక సర్క్యూలర్‌లో పేర్కొంది. ఐఆర్‌సీటీసీ ఐపీవో సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 4 వరకు కొనసాగింది. 112 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయ్యింది. షేరు ధర రూ.315 నుంచి రూ.320 గా నిర్ణయించింది.

# కార్ల ఎగుమతుల్లో హ్యుందాయ్ టాప్

## •ఏప్రిల్- సెప్టెంబర్‌లో 4 శాతం వృద్ధి




**న్యూఢిల్లీ :** ప్యాసింజర్ కార్ల ఎగుమతుల్లో ఈ ఆర్థిక సంవత్సర ప్రథమార్థంలో నాలుగు శాతం వృద్ధి కనిపించింది. ఎగుమతుల్లో హ్యుందాయ్ అగ్రస్థానంలో నిలిచింది. ఆఫ్రికాతో పాటు లాటిన్ అమెరికాకు సుమారు 1.03 లక్షల యూనిట్లను ఎగుమతి చేసిందని తాజా సియామ్ గణాంకాలను బట్టి తెలుస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో ప్యాసింజర్ వాహనాల ఎగుమతులు 3,65,282 యూనిట్లకు ఎగబాకగా. క్రితం ఏడాది ఇదే కాలంలో 3,49,951 యూనిట్లుగా నమోదైనాయి. కార్ల ఎగుమతుల్లో 5.61శాతం వృద్ధితో 2,86,495 యూనిట్లు కాగా.. యుటిలిటి వాహనాల ఎగుమతులు మాత్రం స్వలంగా పెరిగి 77,397 యూనిట్లకు ఎగబాకాయని పేర్కొంది. అయితే వ్యాన్‌ల ఎగుమతులు మాత్రం 27.57 శాతం క్షీణించి 1,390 యూనిట్లకు దిగివచ్చాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో 1,919 యూనిట్లు ఎగుమతి చేశాయి. ఎగుమతుల్లో హ్యుందాయ్ అగ్రస్థానంలో నిలవగా.. తర్వాత స్థానంలో ఫోర్డ్ ఇండియా, మారుతి సుజుకిలు నిలిచాయి. ఎగుమతుల గురించి హ్యుందాయ్ మోటార్ ఇండియా ఎండీ, సీఈవో ఎస్ఎస్‌కిమ్ మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాల నుంచి ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనుభవం తమకు బాగా కలిసొచ్చిందని ఆయన తెలిపారు. తమ ప్రొడక్టులు ప్రపంచంలోని 91 దేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు చెప్పారు. గ్లోబల్ సేల్స్‌లో క్రమంగా చిన్న కార్ల నుంచి మిడ్‌సైజ్ సెడాన్‌లకు, ఎస్‌యూవీలకు మారుతున్నాయని చెప్పారు. కంపెనీకి చెందిన మోడల్స్ గ్రాండ్ ఐ10, ఐ 20 కార్లకు ఆఫ్రికాతో పాట లాటిన్ అమెరికాలో మంచి ప్రజాదరణ లభించిందని.. క్రెటా, వెర్నాలకు ఆఫ్రికా, లాటిన్ అమెరికా, మధ్య ప్రాచ్యదేశాల్లో లభిస్తోం దన్నారు. ఫోర్డ్ ఇండియా ఈ ఏడాది ప్రథమార్థంలో 71,850 యూనిట్లు ఎగుమతి చేసింది. క్రితం ఏడాదితో పోల్చుకుంటే 6.6 శాతం క్షీణించాయి. మారుతి ఎగుమ తుల్లో కూడా 4.09 శాతం క్షీణించి 52,603 యూనిట్లకు పరిమితం అయ్యా యి. జనరల్ మోటార్స్ 40,096 యూనిట్లు, ఫోక్స్‌వ్యాగెన్ 37,908 యూనిట్లు, నిస్సాన్ మోటార్ 33,897 యూనిట్లు ఎగుమతి చేయగా.. ఎంఅం డ్ఎం 7,280 యూనిట్లు, రెనో 6,885 యూనిట్లు, టయోటా కిర్లోస్కర్ 5,476 యూనిట్లు, హోండాకార్స్ 2,385 యూనిట్లు గ్లోబల్ మార్కెట్లకు ఎగుమతులు చేశాయి.

# 1.4 లక్షల కోట్ల బకాయిల చెల్లింపు

## •కార్పొరేట్ బకాయిలు చెల్లింపుల్లో టాప్: ప్రశాంత్ రుయా

**న్యూఢిల్లీ :** భారత్ కార్పొరేట్ రంగంలో ఎస్సార్ గ్రూపు బకాయిలు చెల్లించడంలో అగ్రస్థానంలో నిలిచింది. ఇప్పటి వరకు కంపెనీకి చెందిన పలు ఆస్తులను విక్రయించి రూ.1.4 లక్షల కోట్లు చెల్లించింది. మిగిలిన 10-15 శాతం బకాయిలు వచ్చే రెండు త్రైమాసికాల్లో చెల్లిస్తామని ఎస్సార్ క్యాపిటల్ డైరెక్టర్ ప్రశాంత్‌రుయా చెప్పారు. గత మూడు సంవత్సరాల నుంచి బకాయిలు తీర్చడానికి కొన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకొని రుణ భారాన్ని తగ్గించుకుంటూ వచ్చామని ఆయన అన్నారు. ముందుగా ఎస్సార్ ఆయిల్‌ను రాస్‌నెఫ్ట్, ట్రాఫిగురాకు 12.9 బిలియన్ డాలర్లకు విక్రయించామని, అటు తర్వాత తమ బీపీవో వ్యాపారం ఏజీస్ నుంచి తప్పుకున్నామని, తర్వాత మరిన్ని కంపెనీలను విక్రయించి సుమారు రూ.1,40,000 కోట్ల బకాయిలు చెల్లించామని రుయా పేర్కొన్నారు. భారత్ కార్పొరేట్‌లో ఈ స్థాయిలో రుణభారాన్ని తగ్గించుకున్న దాఖలాల్లేవని ఆయన అన్నారు. ప్రస్తుతం తమ పోర్టుపోలియో వ్యాపారం మొత్తం 13 బిలియన్ డాలర్లు.. లేదా రూ.1,00,000 కోట్లు ఉంటుందన్నారు. ఎస్సార్ కొన్ని ఆస్తులను విక్రయించినా.. కంపెనీ చేతిలో కీలకమైన ఎస్సార్‌స్టీల్ ఉంది. కాగా బకాయిలు చెల్లించనందుకు బ్యాంకులు కంపెనీని దివాలాకోర్టుకు లాగాయి. ఇటీవల కాలంలో ఆర్థికమంత్రి నిర్మలాసీతా రామన్ పలు ఉద్దీపన పథకాలు ప్రకటించడం తో.. కంపెనీ పూర్తి స్థాయిలో అప్పులు తీర్చేసిన తర్వాత కొత్త పెట్టుబడులు పెడతామని రుయా పేర్కొన్నారు. సంప్రదాయ రంగాలు కాకుండా ఇతర రంగాల్లో పెట్టుబడులు పెట్టి మంచి లాభాలను ఆర్జించాలనుకుంటు న్నామన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన కొత్త విధానాల ద్వారా కార్పొరేట్ ఇండియాకు బాగా కలిసివస్తోందన్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి కార్పొరేట్‌లు లెవనెత్తన అంశాలను ప్రభుత్వం పరిష్కరించిం దని, నియంత్రణా సంస్థల ఇబ్బందులను తొలగించిందని రుయా తెలిపారు. దీంతో దేశీయంగా డిమాండ్ పెరగడంతో పాటు పెట్టుబడులు కూడా పెద్దమొత్తంలో వస్తాయన్నారు.

భారత ఆర్థిక వ్యవస్థ 2010-11లో వృద్ధిరేటు 10 శాతానికి ఎగబాకింది. ఈ రేటు అలానే కొనసాగుతుందని భావించి ఎస్సార్ పెద్దెత్తున విస్తరణబాట పట్టిందన్నారు. సుమారు 24 బిలయన్ డాలర్ల పెట్టుబడులు వివిధ రంగాలు ముఖ్యంగా గ్యాస్, విద్యుత్, ఉక్కు, ఓడరేవుల్లో పెట్టుబడులు పెట్టాయని రుయా వివరించారు. కొన్ని ఇబ్బందులు తలెత్తినా కొన్ని సంవత్సరాల పాటు ఈ పెట్టుబడులు కొనసాగించామన్నారు. అటు తర్వాత భవిష్యత్తులో నియంత్రణా సంస్థలు, న్యాయవ్యవస్థల జోక్యం ఉండదనుకు న్నామని... నియంత్రణా సంస్థల అతి జోక్యం వల్ల ఈ రంగాలు బాగా దెబ్బతిన్నాయన్నారు. అయితే దీనికి సంబం ధించి ఆయన వివరణ మాత్రం ఇవ్వలేదు. అదే సమయంలో భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థ కూడా ఎన్‌పీఏలతో నష్టాల్లో కూరుకుపోయాయి. ఈ వ్యవహారాలను గమనించిన తాము ఎస్సార్‌కు చెందిన ఆస్తులను అవి బాగా నడుస్తున్నా వాటిని విక్రయించి బ్యాంకు బకాయిలు చెల్లించి అప్పులు తగ్గించుకున్నామని ఆయన తెలిపారు. ఎట్టకేలకు చివరగా తాము తీసుకున్న నిర్ణయం సరేందేనని తేలిందని...ప్రస్తుతం తమ పెట్టుబడులకు తగ్గ విలువ లభించిందన్నారు. పెద్దమొత్తంలో బకాయిలు చెల్లించిన తర్వాత కూడా తమ పోర్టుపోలియోలో ప్రధానంగా ఐదు రంగాలు ఎనర్జీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మెటల్, మైనింగ్, సర్వీసెస్, టెక్నాలజీలున్నా యి. ఈ రంగాల్లో క్రమంగా పుంజుకుంటామని రుయా భరోసా వ్యక్తం చేశారు. ఒక వేళ ఈ ఆస్తులను విక్రయించినా.. ఎస్సార్ గ్రూపు సుమారు 32 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించిందని చెప్పారు. ప్రస్తుతం నాలుగు రంగాలల్లో సుమారు 12-13 బిలియన్ డాలర్ల టర్నోవర్ కొనసాగుతోందన్నారు. ఈ ఆస్తుల్లో బ్రిటన్‌లో చమురు రిఫైనరీలు, రిటైలింగ్ వ్యాపారాలతో పాటు భారత్‌లో కోల్ బేస్డ్ మేథాయిన్ (సీబీఎం) ఆస్తులున్నాయి. భారత్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగం తాము రెండవ స్థానంలో ఉన్నామని, అతి పెద్ద ఓడరేవుల కంపెనీల తమదన్నారు.



## సెయింట్‌గా మరియం థ్రెసియా

● పోప్ ఫ్రాన్సిస్ ప్రకటన

**వాటికన్:** వాటికన్ సిటీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పోప్ ఫ్రాన్సిస్ భారత్‌లోని కేరళకు చెందిన నన్ మరియం థ్రెసియాను సెయింట్‌గా ప్రకటించారు. ఈ కార్యక్రమానికి విదేశాంగ సహాయ మంత్రి మురళీధరన్ హాజరయ్యారు. థ్రెసియా 1914మేలో త్రిస్సూర్‌లో పవిత్ర కుటుంబ సోదరీమణుల సమాజాన్ని స్థాపించారు. రోమ్‌లోని సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో యూకారిస్టిక్ వేడుకలో థ్రెసియాను కీర్తించారు. ఇంగ్లీష్ కార్డినల్ జాన్ హెన్రీ న్యూమాన్, స్విస్ లేవుమన్ మార్గ్గరేట్ బేస్, బ్రెజిలియన్ సిస్టర్ డుల్స్‌లోప్ మరియు ఇటాలియన్ సిస్టర్ గియుసెప్పినా వన్నినీలతోపాటు మరియం థ్రెసియాను మహాత్ముల జాబితాలో చేర్చనున్నారు.

శతాబ్దాలకాలంలో కేరళ నుంచి అత్యున్నత స్థానానికి ఎదిగిన నాల్గవ వ్యక్తిగా ఆమెను పరిగణించనున్నారు. మదర్ మరియం థ్రెసియా కాననైజేషన్ వేడుకలను ఆదివారం త్రివేంద్రంలోని సెయింట్ జోసఫ్ కెథడ్రిల్ చర్చిలో నిర్వహించారు. బాప్తిజం తీసుకున్న మే 3 1876 నుంచి 1904వరకు మరియం థ్రెసియా సగం జీవితకాలం వరకూ ఆమెను థెరిసాగానే పిలిచేవారు. అనంతరం ఆమె మేరీ మాత ఆశీస్సులతో తనపేరు ముందు మరియం చేర్చవలసిందిగా కోరారు. ఏసును అనుకరిస్తూ ఆమె పేదలకు సహాయంచేసిందని, రోగులకు వైద్యం, పారిస్‌ను సందర్శించి ఒంటరి ప్రజలను ఆమె ఓదార్చిందని వాటికన్ న్యూస్ తెలిపింది. చర్చి ఆమెను అరుదైన పవిత్ర వ్యక్తులుగా ప్రకటించింది. జోస్యం, వైద్యం, కాంతి ప్రకాశం, సువాసన వంటి ఆధ్యాత్మిక బహుమతులు ఆమెకు లభించాయని వాటికన్ తెలిపింది. సిస్టర్‌థ్రెసియా జూన్ 8, 1926న 50సంవత్సరాల వయసులో మరణించారు. పోప్ సెయింట్ జాన్‌పాల్ -2 ఏప్రిల్ 9, 2000న ఆమెను ఆశీర్వదించారు. పోప్ ఫ్రాన్సిస్ ఆమె మధ్యవర్తిత్వం ద్వారా జరిగిన అద్భుతాన్ని గుర్తించడంతో సెయింట్‌హుడ్‌కు మార్గం సుగమమైంది. అక్టోబర్ 13న కాననైజేషన్ రోజుగా నిర్ణయించారు.



పోప్ ఫ్రాన్సిస్‌కు 'భగవత్‌గీత అకార్డింగ్ గాంధీ' పుస్తకం అందజేసిన విదేశాంగ సహాయ మంత్రి వి. మురళీ ధరన్

## లింగ సమానత్వంలో నాసా ముందడుగు

**వాషింగ్టన్:** మహిళలు ఏ రంగంలో తక్కువ కాదని ప్రపంచానికి బలమైన సంకేతమిచ్చారు అమెరికన్లు. 120 మంది బాలికలను డెల్టా విమానంలో అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా)కు తీసుకెళ్లి బాలికల్లో నూతనోత్తేజాన్ని నింపారు. అంతర్జాతీయ బాలికా ఏవియేషన్ ఉత్స వాల సందర్భంగా మహిళా పైలెట్లు ఈ సాహస యాత్రకు పూనుకున్నారు. లింగ సమానత్వాన్ని పెంపొందించేందుకు 12-18 మధ్య వయస్సు గల సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్ విద్యార్థులను నాసాకు తీసుకెళ్లడం విశేషం. వివిధ రంగాల్లో పురుషాధిక్యాన్ని తగ్గించడమే లక్ష్యంగా 2015 లో వింగ్ ప్లైట్ ను ప్రారంభించగా.. నాటి నుంచి ప్రతీ ఏడాది జెండర్ ఈ క్వాలిటీపై ఏదో ఓ రకమైన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మహిళా పైలెట్లు 120 మంది బాలికలను నాసాకు తీసుకెళ్లి అక్కడి విశేషాలను వివరించారు.

## పాక్‌కు రాజ్‌నాథ్ స్వీట్ వార్నింగ్

**హరియాణా:** హరియాణాలోని పటౌడీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కాశ్మీర్‌పై స్వరంపై పెంచుతున్న పాకిస్థాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్ తన ఆలోచనా విధానంలో మార్పు తీసుకురావాలని పూర్తి మర్యాదతో విజ్ఞప్తి చేస్తున్నాను అన్నారు. తమ అభ్యర్థనను విస్మరించినట్లయితే భయంకర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. వారిఆలోచన విధానం, దిశను మార్చుకోవాలని పూర్తిమర్యాదతో సూచిస్తున్నాను అని లేకపోతే పాకిస్థాన్ అంతకుముందు రెండు భాగాలుగా విభజించబడిందని, ఇప్పుడు అనేకభాగాలుగా విభజించబడుతుందని సింగ్ అన్నారు. పాకిస్థాన్ నిజాయితీగా పనిచేసి ఉగ్రవాదాన్ని నిర్మూలించాలని, సోదరభావాన్ని కొనసాగించాలని కోరుతున్నామన్నారు. తాము పొరుగువారితో కలిసి నడవాలనుకుంటున్నామని రాజ్‌నాథ్ అన్నారు. మీరు ఉగ్రవాదంపై నిజాయితీగా పోరాడకపోతే ఛాందసవాద శక్తులతో పోరాడే సామర్థ్యం భారత్‌కు ఉందని స్పష్టం చేస్తున్నామని రక్షణమంత్రి అన్నారు.



# శాంతి పథంలో.. ? శాసనోల్లంఘన..

● నిశబ్దాన్ని పాటిస్తున్న కాశ్మీరీలు
● దుకాణాలు తెరిచేందుకు ససేమిరా
● మిలిటెంట్లకు భయపడి కాదు
● ఆర్టికల్ 370 రద్దుకు నిరసనగానే
● నివేదికలో పేర్కొన్న ఓ బృందం

**న్యూఢిల్లీ:** ఆగస్టు 5న ఆర్టికల్ 370 రద్దు తర్వాత కాశ్మీర్‌లో పరిస్థితులపై నాలుగు విద్యాసంస్థలు, పలువురు ఉద్యమకారులు, జర్నలిస్టులతో కూడిన ఓ బృందం అక్కడి పరిస్థితిని పరిశీలించి ఒక నివేదికను విడుదల చేసింది. కాశ్మీర్ లోయలో పౌరులు స్వచ్ఛంధంగానే తమ దుకాణాలు, కార్యాలయాలను మూసివుంచుతున్నారని పేర్కొంది. అయితే ఉగ్రవాదులు, విభజనకారులు లేదా రాజకీయ నాయకులు ఇచ్చిన పిలుపును పట్టించుకోవడం లేదని, భారత్‌లో భాగమైన కాశ్మీర్ విషయంలో ప్రభుత్వ తీరుకు శాంతియుతంగా నిరసన తెలుపుతున్నామని కాశ్మీరీలు చెబుతున్నారని నివేదిక పేర్కొంది.

దుకాణాలు తెరవొద్దంటూ ఉగ్రవాదులు అంటించినవిగా భావిస్తున్న పోస్టర్లను చూశాం. అదేవిధంగా దుకాణాలు తెరచివుంచాలని భద్రతా బలగాలు తీవ్రమైన ఒత్తిడి చేస్తుండడాన్ని అనుభవిస్తున్నమని పేర్కొంటున్నారని వెల్లడించింది. దుకాణాలు తెరవని వారిని అరెస్ట్ చేస్తామంటున్న భద్రతా బలగాల ఆదేశాలతో వారిలో భయం నెలకొంది. అయితే భద్రతా దళాల ఆంక్షలను పక్కనపెట్టి మరీ దుకాణాలు తెరవకుండా ఉండేందుకు చివరి వరకూ ప్రయత్నిస్తున్నారు. వీలైనంతవరకూ శాసనోల్లంఘనను పాటించేందుకు ప్రయత్నిస్తున్నారని రిపోర్ట్ వివరించింది.

### ప్రభుత్వంతో సఖ్యతకు సిద్ధంగా లేరు

ప్రజలవైపు నుంచి ఎలాంటి హింసాత్మక ఘటనలు జరగడం లేదు. పౌర శాసనోల్లంఘనను పాటించడమే ప్రజల ఉమ్మడి క్రియాశీలక ఆలోచనగా ఉంది. ప్రభుత్వం మమ్మల్ని తిరస్కరించింది. మభ్యపెట్టిందని కాశ్మీరీలు భావిస్తున్నారు. శాంతియుతంగా నిరసన తెలిపి ప్రతిస్పందించాలని భావిస్తున్నారు. కాశ్మీరీలు నిరసన తెలిపేవిధానంలో చాలా వ్యత్యాసం ఉంది. ప్రభుత్వంతో సఖ్యతగా మెలిగేందుకు కాశ్మీరీలు సిద్ధంగా లేరు. అవకాశాలన్నీ దాదాపుగా సన్నగిల్లాయి. కాశ్మీర్‌ను పాకిస్తాన్‌లో కలపాలని లేదా ప్రత్యేక దేశం ఆజాదీగా చూడాలని కోరుకున్నవారు ప్ర భుత్వ నిర్ణయంతో షాక్‌కు గురయ్యారు. ఈ పరిస్థితులన్నీ కలిపి నిరసనకారులను నిశ్శబ్ధంగా మార్చేశాయి. అయితే ఈ వాతావరణాన్ని తుపానుకు ముందు నిశబ్దంగా నివేదిక వర్ణించింది.

### ప్రభుత్వానికి సూచనలివే...

భారతప్రభుత్వం, న్యాయవ్యవస్థ, పౌరసమాజం, మీడియా, మానవ హక్కుల సంస్థలకు రిపోర్ట్ పలు సూచనలు చేసింది. వెంటనే 370, 35ఏ ఆర్టికల్స్‌ను పునరుద్ధరించాలని సూచించింది. సమాచారవ్యవస్థల్లో ఇబ్బందులు లేకుండా చూడాలని, నిర్బంధంలో ఉన్న రాజకీయ నాయకులు, ఉద్యమకారులను విడుదల చేయాలని పేర్కొంది. ఆర్మీ, పారామిలిటరీ భద్రతా బలగాలను ఉపసంహరించుకోవాలని సూచించింది. కాశ్మీర్‌లో సాధారణ పరిస్థితులను నెలకొల్పేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, ఈమేరకు భాగస్వాములకు ప్ర భుత్వం సహకరించాలని సూచింది. కాశ్మీర్ అంశానికి సంబంధించి పలు కోర్టుల్లో ఉన్న పిటిషన్ సత్వరమే విచారణ చేపట్టాలని న్యాయవ్యవస్థకు సూచించింది. ప్రజాస్వామ్యంపై కాశ్మీరీలకు నమ్మకం కల్పించాలని, ఈమేరకు అక్కడి పౌర సమాజంతో బంధాలను ఏర్పరచుకోవాలని తెలిపింది. ఐదు జిల్లాల్లో ఎనిమిది రోజులపాటు పర్యటించాం.

రాజకీయనాయకులు, ఉద్యోగులు, గృహిణులు, స్కూల్‌టీచర్లు, వ్యాపారులు, పండ్ల వ్యాపారులు, ట్యాక్సీ యూనియన్లు, విద్యార్థులు, నిపుణులు, రచయితలు, కవులు, రైతులు, పిల్లలు, జర్నలిస్టులు, సివిల్ సొసైటీ వర్కర్లు, పండిట్లు, సిక్కులు, క్రిస్టియన్లు ఇలా అనేకమందితో మాట్లాడామని రిపోర్ట్ విడుదల చేసిన బృందం పేర్కొంది.

ఉగ్రవాదులకు భయపడొద్దు, సాధారణ జీవితానికి దగ్గరవ్వాలని ఫుల్ పేజీ ప్రకటన ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం. పేపరు కొనుగోలు చేస్తున్న శ్రీనగర్ వాసి



### జమ్మూలో పరిస్థితి విభిన్నం

కాశ్మీర్ లోయకు జమ్మూలో పరిస్థితులకు వ్యత్యాసం ఉందని రిపోర్ట్ పేర్కొంది. జమ్మూలో దుకాణాలు తెరిచే ఉన్నాయి. అదేవిధంగా ప్రజలు ఎలాంటి శాసనోల్లంఘనను పాటించ డం లేదు. దుకాణాలు, వ్యాపార సముదాయలు తెరిచే ఉంటున్నా యి. అయితే భారీగా నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తోందని వ్యాపారులు, దుకాణాల యజ మానులు చెబుతున్నారు.

## 86 శాతం అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతు

● ఓడిన 7,484 మందిలో 587 మందికే డిపాజిట్లు ● 2019 సార్వత్రిక ఎన్నికల ఈసీ రిపోర్టు

**న్యూఢిల్లీ:** 2019 లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం విడుదల చేసిన గణాంకాల్లో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పోటీ చేసిన మొత్తం అభ్యర్థుల్లో 86 శాతం మంది తమ డిపాజిట్లను కోల్పోయారు. గణాంకాల నివేదికలో మొత్తం 542 నియోజకవర్గాలను పరిగణలోకి తీసుకున్నారు. వెల్లూరు నియోజకవర్గానికి అనివార్య కారణాల రిత్యా ఎన్నికల రద్దు చేయడంతో లెక్కలోకి తీసుకోలేదు. ఈ ఎన్నికల్లో మొత్తం 7,484 మంది ఓటమిపాలవ్వగా అందులో కేవలం 587 మంది మాత్రమే సెక్యూరిటీ డిపాజిట్లను తిరిగి పొందారు. అత్యధికంగా బహుజన సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థులు డిపాజిట్లను కోల్పోయారు. సమాజ్‌వాదీ పార్టీతో కలిసి బరిలోకి దిగిన బీఎస్పీ మొత్తం 383 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలిపింది. ఇందులో 345 మంది డిపాజిట్లు కోల్పోవడం గమనార్హం. అత్యధికంగా డిపాజిట్లు కోల్పోయిన పార్టీల జాబితాలో కాంగ్రెస్ రెండవ స్థానంలో నిలిచింది. 421 స్థానాల్లో పోటీలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థుల్లో 148 మంది తమ సెక్యూరిటీ డిపాజిట్లు కోల్పోయారు. సీపీఐఎం పార్టీ మొత్తం 69 సీట్లలో పోటీ చేయడగా 51 మంది డిపాజిట్లు దక్కలేదు. సీపీఐ పార్టీ 49 స్థానాల్లో పోటీ చేయడగా 41 చోట్ల డిపాజిట్లు రాలేదు. నేషలిస్ట్ కాంగ్రెస్ పార్టీ 34 చోట్ల పోటీ చేసి 14 చోట్ల, 62 స్థానాల్లో పోటీ చేసిన తృణమూల్ కాంగ్రెస్‌కు 20 చోట్ల డిపాజిట్లు దక్కలేదు. రికార్డ్ స్థాయిలో 303 ఎంపీ స్థానాలను కైవసం చేసుకున్న అధికార బీజేపీకి కూడా 51 చోట్ల డిపాజిట్లు రాలేదని ఈసీ నివేదిక వెల్లడించింది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో అత్యధికంగా 67.4 శాతం పోలింగ్ శాతం నమోదవ్వడం రికార్డ్ అని ఈసీ పేర్కొంది. ఇదిలావుండగా ఈ ఎన్నికల్లో గణాంకాలు తికమకలకు గురిచేశాయి. ముఖ్యంగా చత్తీష్‌గడ్‌లో పోలింగ్ శాతం విషయంలో ఈసీ ప్రకటించిన గణాంకాల విషయంలో వ్యత్యాసం ఉంది. విజేతలకు వచ్చిన మెజారిటీతో ఎన్నికల సంఘం గణాంకాలు సరిపోలలేదు.

## నా వ్యాఖ్యలు వక్రీకరించారు..



**న్యూఢిల్లీ:** కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ తన వ్యాఖ్యలపై వెనక్కి తీసుకున్నారు. మూడు బాలీవుడ్ సినిమాల బాక్సాఫీస్ కలెక్షన్లు ఒక్కరోజులోనే రూ.120 కోట్ల వసూలవడం ఎప్పుడు జరగని విషయం. దీంతో ఆర్థిక వ్యవస్థ మళ్లీ పుంజుకుందని నేను చేసిన వ్యాఖ్యలు అక్షర సత్యం. సినిమా రాజధానిగా పేరున్న ముంబైలో పర్యటించినప్పుడు చేసిన ఆ వ్యాఖ్యలు చేశా. మీడియా ముందు నేను మాట్లాడిందంతా నిజమే. కానీ నేను మాట్లాడిన దాన్ని పూర్తిగా వక్రీకరించారు. సున్నితమైన మనస్కుడినైన నేను నా వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా. అని ట్వీట్ చేశారు. శనివారం నాటి వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటూ ఓ ప్రెస్ నోట్‌ను కూడా రవిశంకర్ ప్రసాద్ విడుదల చేశారు. ఫిల్మ్ ఇండస్ట్రీ లక్షలాది మందికి ఉపాధి అవకాశాలను కల్పించడం గొప్పవిషయం.. పన్నుల రూపంలో ప్రజలు అందిస్తున్న సహకారం ఎంతో ఉన్నతమైనది. ప్రజలకు ఉపయోగపడే అనేక అంశాల్లో ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలు ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్ఠం చేసాయి.నా వ్యాఖ్యలను రాద్ధాంతం చేయడం ఎందుకోనని ఇప్పటికీ చింతిస్తున్నా. నేను మాట్లాడిన దాన్ని వక్రీకరిం చారు. సున్నిత మనస్కుడిని కనుకే నా వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా. అని పేర్కొన్నారు.

## ఇన్‌స్టాలో మోడీ ఫస్ట్

**న్యూఢిల్లీ:** ప్రధాని మోడీకి సోషల్ మీడియాలో రోజురోజుకూ ఫాలోవర్స్ పెరిగిపోతున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా సామాన్యులకు దగ్గరవడంతో తనకు మరొకరు సాటి లేరని నిరూపించిన మోడీ.. ఇన్‌స్టాగ్రామ్‌లోనూ రికార్డు సృష్టించారు. తాజాగా మోడీ ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్లు 3 కోట్లు దాటారు.ట్విట్టర్‌లో ఇటీవలే 5 కోట్లకు పైగా నెటిజన్లు మోడీని అనుసరిస్తుండగా.. ఇన్‌స్టాగ్రామ్‌లోనూ ప్రజల ఆదరాభిమానాలను చూరగొంటున్నారు. ఫొటో షేరింగ్ యాప్‌లోనూ ప్రధాని మోడీ.. మోస్ట్ ఫాలోవ్డ్ వరల్డ్ లీడర్‌గా మారారు. ఇన్‌స్టాగ్రామ్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ప్రస్తుతం కోటి 90 లక్షల మంది ఫాలోవర్లు ఉండగా.. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాను 2.48 కోట్ల మంది అనుసరిస్తున్నారు. మోడీని అనుసరిస్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగిపోవడంపై బీజేపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా స్పందిస్తూ.. పీఎం మోడీని ఇన్‌స్టాగ్రామ్‌లో 3 కోట్లకు పైగా మంది అనుసరిస్తున్నారు.ప్రపంచంలోనే అత్యధిక మంది ఇన్‌స్టా ఫాలోవర్లు ఉన్న వ్యక్తిగా మోడీ పేరు గడించారు. అమెరికాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, మాజీ అధ్యక్షుడు ఒబామాను కూడా దాటి మోడీ ముందుకుసాగారు. మోడీపై ప్రజల్లో ఉన్న అభిమానం ఇన్‌స్టా ద్వారా మరోసారి రుజువైంది. అని నడ్డా ట్వీట్ చేశారు. ట్విట్టర్‌లో మోడీకి ప్రస్తుతం 5 .7 కోట్ల మంది, ట్రంప్‌కు 6.57 కోట్లు, బరాక్ ఒబామాకు అత్యధికంగా 10.9 కోట్ల మంది ఫాలోవర్లు ఉండటం విశేషం.

## దమ్ముంటే 370ని వెనక్కి తీసుకురండి

● అలాగే త్రిపుల్ తలాక్‌ను ప్రవేశపెట్టండి ● ప్రతిపక్షాలకు ప్రధాని మోడీ సవాల్
● కాంగ్రెస్, ఎన్‌సీపీపై తీవ్ర విమర్శలు ● ఐదేళ్ల అభివృద్ధిని చూసి ఓట్లేయాలని పిలుపు

**ముంబై:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి ప్రధాని మోడీ శ్రీకారం చుట్టారు. ఆదివారం సుడిగాలి ర్యాలీలతో ప్రచారాన్ని హోరెత్తించారు. ప్రధాన ప్రతిపక్షాలైన కాంగ్రెస్, ఎన్‌సీపీలను లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు గుప్పించారు. జమ్ము-కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దుపై విపక్షాలు మొసలి కన్నీరు కార్చడం ఆపాలని హితవు పలికారు. ఈ చర్యను వ్యతిరేకించే వారికి రాజకీయ భవిష్యత్తు ఉండదని నేరుగా హెచ్చరించారు. గతంలోనూ ముస్లిం మహిళల హక్కులను కాపాడేలా, త్రిపుల్ తలాక్‌ను నిషేధించే విషయంలోనూ కాంగ్రెస్ పార్టీ ఇలాగే వ్యతిరేకించిందని గుర్తుచేశారు. తమ ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టే వారు ఇప్పటికైనా ఈ అంశంలో వారి అభిప్రాయం ఏమిటో స్పష్టంచేయాలని ప్రధాని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వస్తే కాశ్మీర్‌లో 370 అధికరణం తిరిగి అమలు చేస్తామని, త్రిపుల్ తలాక్‌కు చట్టబద్ధత కల్పిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలని ప్రతిపక్ష పార్టీలకు సవాల్ విసిరారు. దమ్ముంటే తమ సవాల్‌ను స్వీకరించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం జల్‌గాన్, సాకోలి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బహిరంగసభల్లో మోడీ పాల్గొని ప్రసంగించారు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లయినా నా సోదరీమణులు, సోదరులు వారి హక్కులను సాధించుకోలేక పోయారు. గతంలో ఎవరూ ఊహించని రీతిలో ఆగస్టు 5న మా ప్రభుత్వం సాహసోపేత నిర్ణయం తీసుకుంది. 40 ఏళ్లుగా ఉన్న పరిస్థితి మారడానికి నాలుగు మాసాలైనా వేచివుండలేరా? అని ప్రతిపక్షాలను నిలదీశారు. జమ్ము-కాశ్మీర్‌లో తప్పకుండా సాధారణ పరిస్థితులు నెలకొనేలా చేస్తామని మోడీ భరోసా ఇచ్చారు. కొన్నిరాజకీయ పార్టీలు పొరుగు దేశానికి మద్దతిచ్చేలా వారికి వంతపాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్‌సహా మరికొన్ని పార్టీలు ముస్లిం మహిళలకు న్యాయం జరక్కూడదని ప్రయత్నించాయని, అయితే తమ ప్రభుత్వం అంకితభావంతో వారికి న్యాయం చేకూర్చిందని మోడీ చెప్పారు.

### గ్రామీణ అభివృద్ధికి రూ. 25 లక్షల కోట్లు

గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి తమ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. మునుపెన్నడూ లేని విధంగా ఈ రంగానికి పెద్దపీట వేశాం. బడ్జెట్‌లోనూ ఇతోధికంగా కేటాయింపులు జరిపాం. సమీప కాలంలో దేశవ్యాప్తంగా గ్రామీణ అభివృద్ధికి దాదాపు 25 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేయబోతున్నాం. ఇప్పటికే పల్లెల్లో అంతర్గత రోడ్లు నిర్మించాం. పంట నిల్వకు ఆధునిక గోడౌన్లను నిర్మించనున్నాం. తద్వారా రైతులకు చేయూత ఇవ్వనున్నాం. అన్నదాత సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలన్నదే మా ధ్యేయం అని ప్రధాని మోడీ వివరించారు. ఆదివారం సాకోలిలో ఎన్నికల ప్రచారంలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. రూ. 3.5 లక్షల కోట్లతో నీటి సంరక్షణ చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఇందుకోసం జల్‌జీవన్ మిషన్ పథకాన్ని చేపట్టామని చెప్పారు. సురక్షిత మంచినీరు అందుబాటులోకి వచ్చే ప్రజలు, వారి పశుసంపద ఆరోగ్యంగా ఉంటారని, నీటి వసతి మెరుగైతే పాడిపరిశ్రమ అభివృద్ధి చెంది, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రధాని అన్నారు.

### పవార్‌పై పవర్‌ఫుల్ పంచ్‌లు..

ఇటీవల అంతర్జాలంలో వైరల్ అయిన ఓ వీడియోను ప్రస్తావిస్తూ, ఎన్సీపీ అధినేత శరద్‌పవార్‌పై ప్రధాని మోడీ ఎదురుదాడికి దిగారు. గజమాల సత్కారంలో ఆయన వారి పార్టీ నేతనే మోచేత్తో నెట్టేశారు. ఇక సామాన్య ప్రజలను ఏం పట్టించుకుంటారు అంటూ పవార్ పేరును ప్రస్తావించకుండానే చురకలు అంటించారు. ప్రముఖ నేతను ఇలా అవమానించడం తనను షాక్‌కు గురిచేసిందని చెప్పారు. గజమాలలో తలదూర్చేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో సదరు నాయకుడిని పార్టీ అధినేత మోచేత్తో నెట్టేసిన వీడియోలు, ఫొటోలు మీడియాలో హల్‌చల్ చేశాయని గుర్తుచేస్తూ పవార్ వ్యవహారశైలిని విమర్శించారు. మహారాష్ట్రను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అవకాశం లభించడం పట్ల బీజేపీ సంతోషంగా ఉందన్నారు. మహిళల అభివృద్ధికి పాటుపడ్డామన్న సంతృప్తి కలిగింది. రాష్ట్రంలో మహిళల పేరిట ఇప్పటి దాకా 10 లక్షల గృహాలు ఇచ్చామని, వచ్చే యేడాది మరో 10 లక్షల గృహాలను నిర్మించి ఇస్తామని భరోసా ఇచ్చారు.



## ఉద్యోగాలడిగితే.. చందమామను చూపిస్తున్నారు

● మోడీ సర్కార్‌పై రాహుల్ ధ్వజం ● లాతూర్‌లో ఎన్నికల ప్రచారం



**ముంబై:** కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ఎదురుదాడికి దిగారు. ఆదివారం మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. లాతూర్ జిల్లా ఔసాలో నిర్వహించిన బహిరంగసభలో పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. దేశంలోని ప్రధాన సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు చంద్రయాన్‌ను తెరపైకి తెస్తున్నారని విమర్శించారు. యువకులు ఉద్యోగాలు అడుగుతుంటే ప్రభుత్వం వారికి చంద్రుడిని చూపిస్తోందని ఎద్దేవా చేశారు. జిన్‌పింగ్‌తో ప్రధాని భేటీని ఉటంకిస్తూ, 2017 డోక్లాం ఉద్రిక్తల మాటేమిటని ప్రశ్నించారు. నాడు చైనా బలగాలు భారత భాగంలోకి చొరబడ్డాయని, ఇది మేకిన్ ఇండియా కాదు మేకిన్ చైనా అంటూ ధ్వజమెత్తారు.

ఆర్టికల్ 370, చంద్రయాన్ గురించి విస్తృత ప్రచారం చేస్తున్న మోడీ ప్రభుత్వం, దేశాన్ని పట్టిపీడిస్తున్న ప్రధాన సమస్యలపై ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. రైతాంగసంక్షోభం, నిరుద్యోగం వంటిసమస్యలపై మీడియా మిన్నకుండటంపైనా రాహుల్ అసహనం వ్యక్తంచేశారు. కేవలం 15 మంది సంపన్నుల కోసం 5.5 లక్షల కోట్లు మాఫీ చేసిన ప్రభుత్వం పేదల కోసం ఏమీచేయడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పెద్దనోట్ల రద్దు వల్ల ఎవరికి మేలు జరిగిందో ప్ర భుత్వం చెప్పాలి? నోట్లరద్దు ప్రయోజకారి కాకుంటే తనను ఉరితీయండి అన్న ప్రధాని ఇప్పుడేమంటారు? నిజంగా ఎవరికి లబ్ధిచేకూరింది? అంటూ ప్రశ్నలు సంధించారు. చంద్రుడిపైకి రాకెట్ పంపడం వల్ల మహారాష్ట్ర పేదల ఆకలిమంటలు చల్లారవని హితవు పలికారు. పెద్దనోట్ల రద్దు, వస్తు సేవల పన్ను అమలు వల్ల నిరుపేదల జేబులు కొల్లకొట్టి సంపన్నుల ఖజానా నింపారని కేంద్రంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

### 370 రద్దు ప్రభావం ఉండదు

ఐదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీ హర్యానా అధ్యక్షురాలు కుమారి శెల్జా ఆరోపించారు. కిందటిసారి ఇచ్చిన 150 హామీల్లో సగమైనా అమలు చేయలేదని, కాషాయ పార్టీకి ఈ ఎన్నికల్లో ప్రజలు కచ్చితంగా బుద్ధిచెబుతారని అన్నారు. కాశ్మీర్‌లో 370 అధికరం రద్దు ప్రభావం హర్యానాలో ఉండబోదని స్పష్టంచేశారు. స్థానిక అంశాలు, సమస్యలపైనే తమ పార్టీ దృష్టిసారిస్తుందని చెప్పారు.

ఇందుకు అనుగుణంగానే మేనిఫెస్టో రూపొందించామని తెలిపారు. రైతులకు రుణమాఫీ, నిరుద్యోగులకు భృతి, ఉద్యోగాల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, మహిళల పేరుతో ఉన్న స్థిరాస్తులపై 50 శాతం పన్ను రాయితీ వంటి పథకాలు కాంగ్రెస్‌కు మేలు చేస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ కంటే బీజేపీలోనే అంతర్గత కుమ్ములాటలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కాగా, బీజేపీ ప్రధానంగా జాతీయభద్రత, 370 రద్దు, పౌర నమోదు ప్రక్రియ అంశాలను ప్రచార అస్త్రాలుగా మలచుకుంది.

# సంక్రాంతికి అలా వైకుంఠపురములో...


అల్లు అర్జున్

అల్లు అర్జున్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కు తున్న చిత్రం అలా వైకుంఠపురములో. హారిక అండ్ హాసిని క్రియేషన్స్, గీతా ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిసు_ ్తన్నాయి. జనవరి 12న సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటిస్తూ... అందుకు సంబంధించిన ప్రచార చిత్రాన్ని విడుదల చేసింది.

ఇక ఇటీవల విడుదలైన ఈ చిత్రం మొదటి పాట సామజవరగమన... దసరా సందర్భంగా విడుదల చేసిన ప్రచార చిత్రం. వీటికి ముందు చిత్రం పేరును వీడియో రూపంలో విడుదల చేసిన తీరు ప్రశంసలందుకుందని చిత్రబృందం వెల్లడించింది. దీంతో చిత్రంపై అంచనాలు మరింత పెరిగాయని అంటున్నారు. అలాగే అల్లు అర్జున్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో గతంలో వచ్చిన రెండు చిత్రాలు పెద్ద విజయాలు సాధించడం కూడా ఈ చిత్రానికి క్రేజ్ రావడానికి కారణమైం దని చెబుతు న్నారు. ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం ప్రధాన తారాగణపై పాట చిత్రీకరణ జరుపుకుం టోంది అని అన్నారు. అల్లు అర్జున్ సరసన పూజాహెగ్డే నటిస్తున్న ఈ చిత్రంలోని ఇతర పా త్రల్లో రాజేంద్రప్రసాద్, సచిన్ ఖేడ్‌కర్, తనికెళ్ల భరణి, మురళీశర్మ, సముద్రఖని, జయరాం, సునీల్, నవదీప్, సుశాంత్, నివేథా పేతురాజ్, గో విందా పద్మసూ ర్య, కల్యాణి నటరా జన్, రోహిణి, ఈశ్వరీరావు, శిరీష, బ్రహ్మాజీ హర్షవర్ధన్, అజయ్, రాహుల్ రామ కృష్ణ తదితరులు తారాగణం.

ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: పి.ఎస్.వినోద్, సంగీతం: తమన్, ఎడిటింగ్: నవీన్ నూలి, ఆర్ట్: ఎ.ఎస్. ప్రకాష్, ఫైట్స్: రామ్, లక్ష్మణ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పి.డి.వి.ప్రసాద్, నిర్మాతలు: అల్లు అరవింద్, ఎస్.రాధాకృష్ణ(చినబాబు).



# తోలు బొమ్మలాట మోషన్ పోస్టర్ విడుదల..

రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా తోలు బొమ్మలాట. విశ్వంత్ , హర్షిత, వెన్నెల కిషోర్, దేవీ ప్రసాద్ తదితరులు ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఐశ్వర్య మాగంటి సమర్పణలో, సుమ దుర్గా క్రియేషన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. దుర్గా ప్రసాద్ మాగంటి నిర్మాత. విశ్వనాథ్ మాగంటి దర్శకత్వం వహిస్తున్నారు. తోలు బొమ్మలాట సినిమా మోషన్ పోస్టర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగింది. ఈ సందర్భంగా దర్శకుడు విశ్వనాథ్ మాగంటి మాట్లాడుతూ...చక్కటి కుటుంబ కథా చిత్రమిది. కుటుంబంలోని అనుబంధాలను చూపిస్తుంది. మన కుటుంబ వ్యవస్థకున్న విలువలు తెలియజెప్పాం. అన్నారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ..కొందరు యువకులు వృద్ధుల్లా ఆలోచిస్తారు. మా దర్శకుడు విశ్వనాథ్ మాగంటి అలాంటి వాడే. చూసేందుకు యువకుడు కానీ, 50 సినిమాలు తెరకెక్కించిన అనుభవం ఉన్నవాడిలా కుటుంబ కథను అందంగా తెరకెక్కించాడు. లేడీస్ టైలర్ సినిమా తర్వాత దేవుడు మనల్ని బయట ఎడేసాడు అనుకున్నా, ఆ నలుగురు సినిమా చేశాక ఇంతకంటే మంచి కథ మళ్లీ వస్తుందా అనిపించింది. ఇప్పుడు తోలు బొమ్మలాట సినిమా నాకు మరో గుర్తుండిపోయే పాత్రనిచ్చింది. ఈ కథ విన్నాక అలా కాసేపు ఉండిపోయాను. అన్నారు.

ధన్ రాజ్, పూజా రామచంద్రన్, నారాయణరావు, చలపతిరావు, ప్రసాద్ బాబు తదితరులు ఇతర పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం - సురేష్ బొబ్బిలి, ఎడిటర్ - కోటగిరి వెంకటేశ్వరరావు, సాహిత్యం - చైతన్య ప్రసాద్, సినిమాటోగ్రఫీ - సతీష్ ముత్యాల.

# జాను పాత్ర మరో సవాల్

యూటర్న్, రంగస్థలం, ఓ బేబి వంటి చిత్రాలు సమంత నటనా కౌశలానికి అద్దంపడతాయి. ఇప్పుడు ఆమె మరో వైవిధ్యభరిత చిత్రం 96 తెలుగు రీమేక్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ పూర్తికావడంతో సోషల్ మీడియాలో ఆమె ఓ భావోద్వేగ పోస్ట్ పెట్టారు. అంతేకాదు సినిమాలోని తన స్టిల్‌ను కూడా షేర్ చేశారు. ఈ సందర్భంగా సమంత స్పందిస్తూ...మరో ప్రత్యేక సినిమా ఇది. ఇందులో జాను అనే మరో ఉత్తమ పాత్రను పోషించాను. నన్ను సవాల్ చేసిన మరో గొప్ప పాత్ర ఇది. ఇలాంటి పాత్ర చేయడం అదృష్టంగా భావిస్తున్నా. నా డ్రీమ్ టీమ్‌గా ఉన్న శర్వానంద్, ప్రేమ్‌కుమార్‌లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నా అని అన్నారు. తమిళంలో విజయ్‌సేతుపతి, త్రిష. జంటగా తమిళంలో రూపొందిన 96 చిత్రం ఎంతటి ఘన విజయం సాధించిందో తెలిసిందే. పాఠశాల ప్రేమ ఎలాంటి మలుపులు తిరిగింది...చివరకు ఏ తీరాన్ని చేరిందన్నదే ప్రధానాంశం. ఇప్పుడు అదే చిత్రాన్ని తెలుగులో పునర్నిర్మిస్తున్నారు. తమిళ వెర్షన్‌కు దర్శకత్వం వహించిన ప్రేమ్‌కుమార్ తెలుగు వెర్షన్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మిస్తున్నారు.


సమంత

# నవ్విస్తూ భయపెడుతుంది..


అలీ

వెయ్యికి పైగా చిత్రాల్లో నటించి, నాలుగు దశాబ్దాలుగా తెలుగు తెరపై నవ్వులు పంచుతున్నారు హాస్య నటుడు అలీ. ఆయన నటిస్తున్న కొత్త చిత్రం రాజుగారి గది3. ఈ సినిమా హీరోకు మేనమామ పాత్ర పోషిస్తున్నారు అలీ. అవికా గోర్, అశ్విన్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు ఓంకార్ రూపొందిస్తున్న రాజుగారి గది3 సినిమా త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా హాస్య నటుడు అలీ మాట్లాడుతూ....హారర్ సినిమాలో నటించడం నాకు కొత్త. ఇలాంటి సినిమా ఇప్పటిదాకా చేయలేదు. ఓంకార్ నా దగ్గరకొచ్చి ఎక్కువ రోజులు డేట్స్ అడిగాడు. హీరో అశ్విన్‌తో పాటు చివరిదాకా సాగే పాత్ర, చాలా కీలకంగా ఉంటుంది అన్నారు. రాత్రి చిత్రీకరణలో కూడా పాల్గొన్నాను. రాజుగారి గది3 చిత్రంలో గత రెండు చిత్రాలకు మించి భయం, హాస్యం ఉంటాయి. కొన్ని సన్నివేశాల్లో మాటలు వినిపించనంతగా నవ్వుతారు. ఈ సినిమాలో నటిస్తుంటే అక్కడున్న చిత్ర బృందం నవ్వారు. అప్పుడే అనుకున్నా, రేపు థియేటర్‌లో ప్రేక్షకులు కూడా నవ్వుతారని, సినిమా పోస్ట్ ప్రొడక్షన్‌లో ఉన్నప్పుడు పలువురు సాంకేతిక నిపుణులు కూడా సినిమాను మెచ్చుకున్నారు. నా పాత్ర బాగుందంటూ చెప్పారు. సినిమా కోసం ఓంకార్, అతని జట్టు సభ్యులంతా బాగా కష్టపడ్డారు. ఉదయం నుంచి రాత్రి దాకా చిత్రీకరణ చేస్తూనే ఉన్నారు. నేను చెన్నైలో ఉన్నప్పుడు ఓ హారర్ సినిమా చూసి థియేటర్ నుంచి ఇంటికెళ్లేందుకు భయపడిపోయా. ఈ సినిమాలో నేను నటించినా, టీజర్ చూసి భయపడిపోయా. అంత బాగా తెరకెక్కించారు. సినిమా నవ్విస్తూ, భయపెడుతుంది. అన్నారు.

# రొమాంటిక్ ప్రేమకథతో ఊల్లాలఊల్లాల



నటరాజ్, నూరిన్, అంకిత నాయకానాయికలుగా రూపొందుతున్న చిత్రం ఊల్లాల...ఊల్లాల. నటుడు సత్యప్రకాష్ దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో రక్షకభటుడు, ఆనందం, లవర్స్ డే లాంటి చిత్రాలను అందించిన ఎ.గురురాజ్ నిర్మిస్తున్నారు. శరవేగంగా నిర్మాణానంతర పనులను జరుపుకుంటున్న ఈ చిత్రం నవంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది ఈ నేపథ్యంలో ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ను హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విక్టరి వెంకటేష్ చేతులమీదుగా మోషన్ పోస్టర్ విడుదలైంది. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ, రొమాంటిక్ ప్రేమకథగా తెరకెక్కిన ఈ చిత్రం విజయం సాధించాలని ఆకాంక్షించారు. నిర్మాత గురురాజ్‌ను, తొలిసారి దర్శకుడిగా బాధ్యతలు చేపట్టిన సత్యప్రకాష్‌ను అభినందించారు. సత్యప్రకాష్ తనయుడు నటరాజ్‌కు మంచి భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు. నిర్మాత గురురాజ్ మాట్లాడుతూ, సత్యప్రకాష్ నాకెప్పటి నుంచో మంచి స్నేహితుడు. నటుడిగా అతనిలో ఎంత ఫైర్ ఉందో...దర్శకుడిగా అంతకు మించిన ఫైర్ ఉంది. ఈ చిత్రానికి నేనే కథను అందించాను. మేకింగ్ పరంగా ఎక్కడా రాజీపడలేదు. నిర్మాతగా నాకు, దర్శకుడిగా సత్యప్రకాష్‌కు ఈ చిత్రం కచ్చితంగా ఓ మలుపు అవుతుంది. షూటింగ్ కార్యక్రమాలు తుదిదశకు చేరుకున్నాయి. నిర్మాణానంతర పనలు శరవేగంగా జరుగుతున్నాయి. నవంబర్‌లో చిత్రాన్ని విడుదలచేస్తాం అని చెప్పారు. దర్శకుడు సత్యప్రకాష్ మాట్లాడుతూ, నన్ను దర్శకుడిగా మార్చిన నిర్మాత గురురాజ్‌కు రుణపడి ఉంటా. ప్రేక్షకులను ఏ మాత్రం నిరాసపరచకుండా ఈ చిత్రాన్ని మలిచాం. ఇందులో హీరోయిన్లు నూరిన్, అంకిత ఆకట్టుకుంటారు అని అన్నారు. ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో గురురాజ్, సత్యప్రకాష్, బాహుబలి ప్రభాకర్, పృథ్వీరాజ్, అదుర్స్ రఘు, జబర్దస్త్ నవీన్, అప్పారావు, రోబో మధు, రాజమౌళి, జ్యోతి, గీతాసింగ్, జయవాణి తదితరులు తారాగణం. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: జె.జి.కృష్ణ దీపక్, సంగీతం: జాయ్, ఎడిటింగ్: ఉద్ధవ్, యాక్షన్: డ్రాగన్ ప్రకాష్, ఆర్ట్: కె.మురళీధర్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, నిర్మాత: ఎ.గురురాజ్, దర్శకత్వం: సత్యప్రకాష్.

# ఈ అందానికి తీరిక లేదు..

ఎప్పుడూ తీరిక లేకుండా ఉంటే ఏదో పనిలో ఉన్నట్లే. రాశీ ఖన్నా అరంగేట్రం నుంచి ఇప్పటిదాకా తీరిక లేకుండా ఉన్నది లేదు. ఏడాదిలో కనీసం మూడు నాలుగు చిత్రాలు ఆమె ఖాతాలో ఉంటూనే ఉంటాయి. ఇటీవల తెలుగు నుంచి కోలీవుడ్ వెళ్లి అక్కడా సినిమాలు చేస్తోంది. తెలుగులో వెంకీ మామ, వరల్డ్ ఫేమస్ లవర్ లాంటి చిత్రాలతో పాటు తమిళనాట మరో రెండు చిత్రాల్లో నటిస్తోంది. ఊహలు గుసగుసలాడే చిత్రంతో తెలుగు తెరకొచ్చిన ఈ సుందరి. రాగానే ముందుగా అందంతో అందరినీ పడేసింది. నటిగా నెమ్మదిగా ఎదుగుతూ వచ్చింది. చాలా చిన్న వయసులో నాయిక కావడం వల్ల...పరిశ్రమలో ఆమెకంటూ ఓ ప్రత్యేక స్థానం దొరికింది. కుర్ర కథానాయకులతో పాటు కొత్తదనాన్ని కోరుకునే పేరున్న హీరోలతోనూ నటించింది. రెండు తరాల కథానాయకులతో నటిస్తూ తన అవకాశాల పరిధి పెంచుకుంది రాశీ ఖన్నా. తెలుగులో కొత్త చిత్రాలు అంగీకరిస్తూనే కోలీవుడ్ వైపు అడుగులు వేస్తోంది రాశీ. ఆమెకు అవకాశాలు తగ్గడం లేదు. ప్రతి సందర్భంలోనూ ఏడాదికి మూడు నాలుగు చిత్రాల్లో నటిస్తోంది. ఈ నేపథ్యంలో రాశీ ఖన్నా మాట్లాడుతూ..మంచి సినిమాల్లో భాగమవ్వాలని కోరుకుంటా. అందమే కాదు నటించే ఆస్కారమున్న పాత్రలూ కావాలి. ప్రతి చిత్రానికీ ఎదుగుతున్నాను. గ్లామర్‌తో పాటు నటించే అవకాశమున్న చిత్రాల్లో భాగమవ్వాలని ఉంది. తమిళంలోనూ మంచి అవకాశాలు వస్తున్నాయి. ఇటీవల కాస్త బరువు తగ్గాను. తగ్గడం నటిగానే కాదు వ్యక్తిగతంగా మంచిదే. వెంకీ మామ, వరల్డ్ ఫేమస్ లవర్ చిత్రాల్లో మంచి పాత్రలు చేస్తున్నాను. అని చెప్పింది.


రాశీ ఖన్నా

# కన్నడ చిత్రంలో...

సౌందర్యాన్ని ఇష్టపడే ప్రేక్షకులు సొగసు తారలకు ఎక్కడైనా ఎదురేగి స్వాగతం పలుకుతారు.

ప్రకృతిలాగే నాయికల అందానికీ భాషలేదు. ఆస్వాదించే అవకాశం కోసం చూడాల్సిందే గానీ ఎందుకు అని ఎవరంటారు. ఇలా తమిళం, తెలుగు, మలయాళంలో సినిమాలు చేసింది ధన్యా బాలకృష్ణన్. తెలుగులో రాజుగారి గది, రన్ రాజా రన్, జయజానకీ నాయకా లాంటి సినిమాలు ఆమెకు బాగా పేరు తీసుకొచ్చాయి. ఇటీవలే మలయాళం చేరిన ఈ భామ...ప్రస్తుతం కన్నడలో అడుగుపెడుతోంది. దీంతో మొత్తం దక్షిణాదిలోని నాలుగు భాషల్లో ధన్య నటించినట్లయింది. శాండల్‌వుడ్‌లో ఓ కొత్త చిత్రంలో నాయికగా ఎంపికైంది ధన్యా భాలకృష్ణన్. ఈ చిత్రానికి పేరు పెట్టాల్సి ఉంది. ఈ సందర్భంగా ధన్యా మాట్లాడుతూ...ప్రస్తుతం కన్నడ చిత్రంలో నటిస్తున్నాను. దీంతో మొత్తం దక్షిణాదిలో నటించినట్లయింది. కన్నడ చిత్రం కోసం ఆరేళ్లుగా వేచి చూస్తున్నాను. కన్నడలో సినిమాతో పాటు గిరిరాజ్ దర్శకత్వంలో ఓ వెబ్‌సిరీస్ చేస్తున్నాను. మిగతా భాషల్లో నటించేప్పుడు సంభాషణలు బాగా నేర్చుకునేదాన్ని. ఇప్పుడు కన్నడ నా మాతృ భాష కాబట్టి ఇక్కడ నటించడం సులువు. అని చెప్పింది.


ధన్యా బాలకృష్ణన్

# చరిత్ర లిఖించారు





విజయానందంలో కోహ్లి, ఉమేశ్ యాదవ్

## రెండో టెస్టులో సఫారీలపై ఇన్నింగ్స్ విజయం

- సొంతగడ్డపై వరుసగా 11వ టెస్టు సిరీస్ కైవసం
- ఆసీస్ రికార్డులను బద్దలుకొట్టిన టీమిండియా
- విదేశాల్లో వరుసగా 6 టెస్టు సిరీస్‌లు ఓడిన ఘనత సాధించిన దక్షిణాఫ్రికా జట్టు
- టెస్టు విజయాల్లో కోహ్లీ సరికొత్త రికార్డు

**పుణె:** సౌతాఫ్రికాతో జరిగిన రెండో టెస్టులో భారత్ ఇన్నింగ్స్ 137 పరుగులతో ఘన విజయం సాధించింది. ఫలితంగా మూడు టెస్టుల సిరీస్‌ను భారత్ మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో కైవసం చేసుకుంది. దాంతో టీమిండియా సొంతగడ్డపై వరుసగా 11వ సిరీస్ విజయం సాధించి కొత్త ప్రపంచ రికార్డు నమోదు చేసింది. హోమ్ గ్రౌండ్స్‌లో అత్యధిక సిరీస్ విజయాలు సాధించిన ఆస్ట్రేలియా (10) రికార్డును కోహ్లీసేన దాటేసి నయా చరిత్ర సృష్టించింది. ప్రస్తుతం టెస్టు ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నెంబర్‌వన్ జట్టుగా కొనసాగుతున్న టీమిండియా 2012-13 సీజన్ నుంచి ఇప్పటివరకూ వరుసగా 11 స్వదేశీ టెస్టు సిరీస్‌లను గెలుచుకొని టెస్టుల్లో ఎదురులేని జట్టుగా నిలిచింది. మరోవైపు సౌతాఫ్రికా విదేశాల్లో వరుసగా 6 టెస్టు సిరీస్‌ల్లో ఓడిన జట్టుగా అప్రతిష్టను మూటగట్టుకుంది. పుణె వేదికగా జరిగిన రెండో టెస్టులో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 601/5 స్కోరుతో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన సౌతాఫ్రికా భారత బౌలర్ల ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో 275, రెండో ఇన్నింగ్స్‌లో 189 పరుగులకే కుప్పకూలింది. దీంతో టీమిండియాకు ఇన్నింగ్స్ 137 పరుగుల భారీ విజయం దక్కింది. డబుల్ సెంచరీతో చెలరేగిన భారత సారథి విరాట్ కోహ్లీకి మ్యాచ్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

### ఆరంభంలోనే..

ఆదివారం ఫాలోఆన్‌తో రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన సౌతాఫ్రికాకు ఆరంభంలోనే షాక్ తగిలింది. తొలి ఓవర్ రెండో బంతికే మర్‌క్రమ్ (0)ను ఇషాంత్ శర్మ ఎల్బీగా పెవిలియన్‌కి పంపాడు. తర్వాత డి బ్రూన్ (8)ను ఉమేశ్ యాదవ్ రెండో వికెట్‌గా పల్టీ కొట్టించాడు. దీంతో సఫారీ జట్టు 21 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో డీన్ ఎల్గర్, కెప్టెన్ డు ప్లెసిస్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. కొద్ది సేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్న వీరు సింగిల్స్, డబుల్స్‌తో స్కోరుబోర్డును ముందుకు సాగించారు. కానీ ఈ సమయంలో అశ్విన్ అద్భుతమైన బంతితో 49 పరుగుల భాగస్వామ్యాన్ని విడగొట్టాడు. రక్షాత్మక ధోరణిలో ఆడుతున్న డుప్లెసిస్ (54 బంతుల్లో 5 పరుగులు)ను అశ్విన్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ సాహా కళ్లుచెదిరే క్యాచ్‌తో ఇంటి ముఖం పట్టించాడు. తర్వాత ఒక పరుగు వ్యవధిలోనే కీలక ఇన్నింగ్స్ ఆడుతున్న ఎల్గర్ (48; 72 బంతుల్లో 8 ఫోర్లు)ను కూడా ఆవుట్ చేసిన అశ్విన్ సఫారీలను కోలుకోలేని దెబ్బతీశాడు. తర్వాత వచ్చిన డికాక్ (5)ను జడేజా క్లీన్‌బౌల్డ్ చేయడంతో సౌతాఫ్రికా 79 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో బవుమా (38; 63 బంతుల్లో 4 ఫోర్లు) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. కానీ జడేజా అద్భుతమైన బంతితో ఇతనికి కూడా పెవిలియన్ దారి చూపెట్టాడు. ఆ కొద్ది సేపటికే సంయమనంతో ఆడుతున్న ముత్తు సామి (44 బంతుల్లో 9 పరుగులు)ను షమి ఆవుట్ చేశాడు.

### మరోసారి ఫిలాండర్, మహరాజ్ పోరాటం..

129 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి ఓటమికి చేరువైన సఫారీ జట్టును ఫిలాండర్, కేశవ్ మహరాజ్‌లు ఆదుకునే ప్రయత్నం చేశారు. టాప్ బ్యాట్స్‌మెన్ వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టినా వీరు చివర్లో అద్భుతమైన పోరాటం చేసి భారత్ విజయాన్ని కొంత ఆలస్యం చేశారు. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న వీరిద్దరూ ఎనిమిదో వికెట్‌కు 57 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అనంతరం ఫిలాండర్ (37)ను ఉమేశ్ యాదవ్.. కేశవ్ (22)ను జడేజా ఆవుట్ చేశారు. రబాడ(4) కూడా తక్కువ స్కోరుకే వెనుదిరగడంతో సౌతాఫ్రికా 67.2 ఓవర్లలో 189 పరుగులకు ఆలౌటైపోయింది. భారత బౌలర్లలో ఉమేశ్ యాదవ్, రవీంద్ర జడేజా చెరో మూడు వికెట్లు పడగొట్టగా.. అశ్విన్ రెండు వికెట్లు సాధించాడు. షమి, ఇషాంత్‌లకు చెరో వికెట్ దక్కింది. ఇక శనివారం నుంచి రాంచి వేదికగా ఇరు జట్ల మధ్య మూడో టెస్టు ప్రారంభం కానుంది.

### కొత్త ప్రపంచ రికార్డు

సౌతాఫ్రికాతో జరిగిన రెండో టెస్టులో ఘన విజయం సాధించిన టీమిండియా మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఫలితంగా సొంతగడ్డపై వరుసగా అత్యధిక టెస్టు సిరీస్‌లు గెలుచుకున్న జట్టుగా భారత్ కొత్త ప్రపంచ రికార్డు సాధించింది. సఫారీలతో సిరీస్ గెలుచుకున్న భారత్ 2012-13 నుంచి ఇప్పటివరకు తమ ఖాతాలో వరుసగా 11 సిరీస్‌లను వేసుకుంది. ఫలితంగా టెస్టుల్లో తిరుగులేని ఆధిపత్యాన్ని చలాయించిన ఆస్ట్రేలియాను వెనక్కినెట్టి టీమిండియా అగ్రస్థానాన్ని సొంతం చేసుకుంది. 1994-95 నుంచి 2000-01 వరకు, 2004 నుంచి 2009 వరకు ఆస్ట్రేలియా వరుసగా రెండు సార్లు 10 సిరీస్‌లను గెలుచుకుంది. కానీ ఇప్పుడు ఆసీస్ రికార్డును భారత్ బద్దలు చేసింది. భారత్, ఆస్ట్రేలియా తర్వాత వెస్టిండీస్ జట్టు 8 హోమ్ సిరీస్ విజయాలతో మూడో స్థానంలో ఉంది.



### స్కోర్‌బోర్డు

**ఇండియా మొదటి ఇన్నింగ్స్:** 601/5 డిక్లేర్డ్.

**సౌతాఫ్రికా మొదటి ఇన్నింగ్స్:** 275 ఆలౌట్.

**సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** మార్క్‌రమ్ (ఎల్బీ) ఇషాంత్ 0, డీన్ ఎల్గర్ (సి) ఉమేశ్ (బి) అశ్విన్ 48, డిబ్రూన్ (సి) సాహా (బి) ఉమేశ్ 8, డుప్లెసిస్ (సి) సాహా (బి) అశ్విన్ 5, బవుమా (సి) రహానె (బి) రవీంద్ర జడేజా 38, క్వింటన్ డికాక్ (బి) రవీంద్ర జడేజా 5, ముత్తుసామి (సి) రోహిత్ శర్మ (బి) షమి 9, ఫిలాండర్ (సి) సాహా (బి) ఉమేశ్ 37, కేశవ్ మహరాజ్ (ఎల్బీ) రవీంద్ర జడేజా 32, కగిసో రబాడ 4, అన్రిచ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు: 13, మొత్తం (67.2 ఓవర్లలో) 189 ఆలౌట్.

**వికెట్ల పతనం :** 1-0, 2-21, 3-70, 4-71, 5-79, 6-125, 7-129, 8-185, 9-189, 10-189.

**బౌలింగ్ :** ఇషాంత్ శర్మ 5-2-17-1, ఉమేశ్ యాదవ్ 8-3-22-3, మహ్మద్ షమి 9-2-34-1, రవిచంద్రన్ అశ్విన్ 21-6-45-2, రవీంద్ర జడేజా 21.2-4-52-3, రోహిత్ శర్మ 2-0-4-0, కోహ్లీ 1-0-4-0.

### కోహ్లీ టాప్...

- భారత్ తరపున 50 టెస్టుల్లో అత్యధిక విజయాలు సాధించిన కెప్టెన్‌గా కోహ్లీ కొత్త రికార్డు సృష్టించాడు. ఓవరాల్‌గా మూడో స్థానంలో నిలిచిన కోహ్లీ భారత్ తరపున మాత్రం నెంబర్‌వన్ సారథిగా నిలిచాడు. 50 టెస్టుల్లో 30 విజయాలు సాధించిన విజయవంతమైన భారత కెప్టెన్‌గా కోహ్లీ అవతరించాడు. మహేంద్ర సింగ్ ధోనీ 60 టెస్టుల్లో 27 విజయాలతో రెండో స్థానంలో నిలిచాడు. వీరిద్దరే భారత్ తరపున 50 లేదా అంతకంటే ఎక్కువ టెస్టు మ్యాచ్‌లకు సారథ్యం వహించారు.
- టెస్టుల్లో అత్యధిక విజయాలు సాధించిన మూడో కెప్టెన్‌గా టీమిండియా సారథి విరాట్ కోహ్లీ రికార్డు సృష్టించాడు. సౌతాఫ్రికాతో జరిగిన రెండో టెస్టులో కోహ్లీ సారథ్యంలోని టీమిండియా భారీ విజయం సాధించింది. ఈ గెలుపుతో కోహ్లీ మరో రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. కోహ్లీ కెప్టెన్‌గా 50 టెస్టుల్లో 30వ విజయాన్ని నమోదు చేశాడు. ఫలితంగా 50 టెస్టుల్లో అత్యధిక విజయాలు సాధించిన కెప్టెన్‌ల జాబితాలో కోహ్లీ మూడో స్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో ఆసీస్ దిగ్గజాలు స్టీవ్ స్మిత్ (37), రికీ పాంటింగ్ (35) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.
- కోహ్లీ సారథ్యంలో భారత్ 8వ ఇన్నింగ్స్ విజయాన్ని నమోదు చేసుకుంది. దీంతో భారత్‌కు అత్యధిక ఇన్నింగ్స్ విజయాలు అందించిన కెప్టెన్‌ల జాబితలో రెండో స్థానంలో ఉన్న అజరుద్దీన్ సరసన కోహ్లీ నిలిచాడు. ఈ జాబితాలో మహేంద్ర సింగ్ ధోనీ 9 విజయాలతో అగ్ర స్థానంలో ఉన్నాడు.



# టీమిండియాకు ఎదురుందా..

**(ఆంధ్రప్రభ క్రీడావిభాగం)**

టీమిండియా... ఈ పేరు వింటే ఇపుడు ఇతర టెస్టు క్రికెట్ జట్లకు వణుకు పుడుతోంది. ఇక స్వదేశంలో టీమిండియాకు ఎదురేలేదు. దీనిని రుజువుచేస్తూ కోహ్లీ సేన మాతృభూమిపై వరుసగా 11వ సిరీస్‌ను సొంతం చేసుకుంది. ఇటీవలి వరకు నంబర్ వన్ స్థానంలో నిలిచిన సౌతాఫ్రికాపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తూ మూడు టెస్టుల సిరీస్ ఇంకా ఒక టెస్టు మిగిలి ఉండగానే సొంతం చేసుకుంది. ఐసీసీ టెస్టు చాంపియన్‌షిప్ లో ఎవరికీ అందనంత ముందంజ వేసింది. రెండో స్థానంలోని జట్టుకంటె 140 పాయింట్లు అంతరం కలిగి ఉందంటే టెస్టు క్రికెట్‌లో టీమిండియా ఆధిపత్యం అవగతమౌతోంది. ఇటీవల వెస్టిండీస్‌లో 2-0తో టెస్టు సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన టీమిండియా సౌతాఫ్రికాతో సిరీస్‌లోనూ ఆ దిశగానే పయనిస్తోంది. సౌతాఫ్రికాపై సిరీస్ విజయం పరిశీలిస్తే టీమిండియా బలమేంటో అర్థమౌతుంది. కోహ్లీ అన్నీ తానై, అందరితో తానై ముందుండి నడిపిస్తున్నాడు. జట్టు బలమంతా కోహ్లీనే. ఏ ఆటగాడిని ఎలా ఉపయోగించుకోవాలో, ఎవరు ఏ స్థానానికి సరిపోతారో కోహ్లీ తెలిసినంతగా ఎవరికీ తెలియదంటే అతిశయోక్తి కాదు. వన్డే బ్యాట్స్‌మన్‌గా ముద్రపడిన రోహిత్ శర్మపై నమ్మకముంచి ఓపెనర్‌గా అవకాశమిచ్చి ఫలితాన్ని రాబట్టడం ఇందుకు నిదర్శనం. రోహిత్ తొలి టెస్టు రెండు ఇన్నింగ్స్‌లలో సెంచరీలు సాధించడం తెలిసిందే. ఇక యువ ఆగాళ్లను ప్రోత్సహించడంలోనూ కోహ్లీ ముందుంటాడు. అతని స్ఫూర్తితోనే మయాంక్ డబుల్ సెంచరీ సహా రెండు టెస్టులలో సెంచరీలు, రవీంద్ర జడేజా ధనాధన్ బ్యాటింగ్ తోపాటు బౌలింగ్‌లోనూ రాణించారు.

### టాపార్డర్ అంతరం

ఇరు జట్లకు ప్రధాన తేడా టాపార్డర్. ఏ జట్టుకైనా టాపార్డర్ రాణిస్తే భారీ స్కోరుతోపాటు, బౌలర్లూ తమ సత్తా ప్రదర్శించేందుకు అవకాశం ఉంటుంది. స్వల్ప స్కోర్లను కాపాడుకోవాలంటే బౌలర్లు చెమటోడ్చినా ఫలితం ఉండదు. ఇప్పటివరకు జరిగిన రెండు టెస్టులలోనూ ఇదే జరిగింది. భారత టాపార్డర్‌తో పోలిస్తే సౌతాఫ్రికా టాపార్డర్ పూచికపుల్లతో సమానం. తొలి టెస్టులో ఎల్గర్, డికాక్ సెంచరీలు మినహా సౌతాఫ్రికా బ్యాటింగ్ ఇప్పటివరకు సామర్థ్యం మేరకు రాణించింది లేదు. అదే భారత జట్టును తీసుకుంటే ఒకరు విఫలమైతే మరొకరు సౌతాఫ్రికా బౌలర్లను ఉతికేశారు. మొత్తంగా భారత బ్యాట్స్‌మెన్ రెండు డబుల్ సెంచరీలు సహా అయిదు సెంచరీలు, నాలుగు అర్ధసెంచరీలు సాధిస్తే, దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ చేసింది రెండు సెంచరీలు, నాలుగు అర్ధసెంచరీలు మాత్రమే. భారత్ ఆధిపత్యానికి ఇదొక నిదర్శనం. రెండు టెస్టులలో భారత్ టాప్ 5 ఆటగాళ్లు రెండు టెస్టులలో కలిపి మూడు ఇన్నింగ్స్‌లలో 1201 పరుగులు సాధిస్తే, సౌతాఫ్రికా టాప్ 5 ఆటగాళ్లు రెండు టెస్టులలో నాలుగు ఇన్నింగ్స్‌లలో సాధించింది 146 పరుగులు మాత్రమే. ఈ గణాంకాలు చాలవూ... సౌతాఫ్రికా సత్తా ఏమిటో తెలుసుకునేందుకు. భారత్ భారీ స్కోర్లు ముందుగానే వారిని మానసికంగా ఒత్తిడికి లోనుచేశాయి. భారత బ్యాట్స్‌మెన్ విజయవంతమైన పిచ్‌పై సౌతాఫ్రికా ఆటగాళ్లు విఫలమయ్యారంటే మానసికంగా వారు ఎంత దాసోహమయ్యారో అర్థమవుతోంది.

### డుప్లెసిస్ కెప్టెన్సీ లోపాలు

కోహ్లీ కెప్టెన్సీ గురించి ఇపుడు కొత్తగా చెప్పుకోవాల్సిందేమీ లేదు. భారత్ అత్యంత విజయవంతమైన కెప్టెన్‌గా ఎదుగుతున్నాడు. ఇదే సమయంలో సౌతాఫ్రికా కెప్టెన్ డుప్లెసిస్ కెప్టెన్సీ గురించి పరిశీలిస్తే అందులో లోపాలెన్నో. అతడు తమ బౌలర్లను ఉపయోగించుకోవడంలో పూర్తిగా విఫలమయ్యాడు. రాణిస్తున్నవారిని పక్కనబెట్టడం, కొందరిపైనే బౌలింగ్ భారం వేయడం కెప్టెన్‌గా అతని అపరిపక్వతను సూచిస్తున్నాయి. తొలి టెస్టులో స్పిన్నర్ కేశవ్ మహరాజ్‌పై అతిగా ఆధారపడడం అతడు చేసిన మొదటి తప్పు. ఆ టెస్టులో అత్యధిక పరుగులిచ్చిన సౌతాఫ్రికా బౌలర్‌గా అతని ఆత్మ విశ్వాసం దెబ్బతీసేలా చేసింది. ఇక రెండో టెస్టులోనూ వికెట్లు తీస్తున్న రబాడాను బౌలింగ్‌నుంచి తప్పించడం. రెండో టెస్టు తొలి రోజు త్వరితగతిన మూడు వికెట్లు తీసిన రబాడాను పక్కనబెట్టడంతో భారత బ్యాట్స్‌మెన్ కుదురుకునేందుకు అవకాశం కలిగింది. ఆ తప్పిదమే సౌతాఫ్రికా పరాజయానికి నాంది అయింది. ఆ తరువాత భారత్ భారీ స్కోరు సాధించడం, సౌతాఫ్రికా ఇన్నింగ్స్ ఓటమిపాలవడం వెంటవెంటనే జరిగిపోయాయి. పరిస్థితులను అంచనా వేయడంలో తాత్కాలిక కెప్టెన్ డుప్లెసిస్ పూర్తిగా విఫలమయ్యాడు.

### తోక బలం పెరిగింది

సౌతాఫ్రికా జట్టులో ఏదైనా ఆశావహ అంశముందంటే వారి లోయర్ ఆర్డర్ ఆటగాళ్లే. ప్రాథమికంగా బౌలర్లయిన ఫిలాండర్, మహరాజ్ బ్యాటింగ్‌లోనూ రాణించి శభాష్ అనిపించుకున్నారు. ముఖ్యంగా రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్ లో సౌతాఫ్రికా దాదాపు మూడు వందల పరుగు లు చేయగలిగిందంటే అది వారి చలవే. ప్రధాన బ్యాట్స్‌మెన్ విఫలమైన చోట వారు సెంచ రీ భాగస్వామ్యంతో పుణె పిచ్‌పై ఎలా బ్యాటింగ్ చేయాలో చూపించారు. సౌతాఫ్రికా ఇన్నింగ్స్‌లో దాదాపు సగం ఓవర్లు వారే ఆడారు. రెండో ఇన్నింగ్స్‌లోనూ వారు అంత తేలిగ్గా లొంగలేదు. వారిని టాపార్డర్‌లో పంపివుంటే భారత్‌కు విజయం అంత సులభంగా లభించి ఉండేది కాదేమో! ఇదొక్కటే సౌతాఫ్రికా జట్టులో చెప్పుకోదగ్గ అంశం. ఇక రాంచిలో జరిగే చివరి టెస్టులోనైనా సౌతాఫ్రికా కొంతైనా ప్రతిఘటన చూపుతుందేమో వేచి చూద్దాం.

### బౌలింగ్‌లోనూ ఆధిపత్యమే

భారత్ బౌలింగ్‌తో పోలిస్తే సౌతాఫ్రికా బౌలింగ్ నక్కకూ నాగలోకానికీ ఉన్నంత అంతరం ఉంది. ఇటీవలి కాలంలో భారత బౌలర్లు ప్రత్యర్థి 20 వికెట్లను పడగొట్టడంలో మెరుగైన ప్రదర్శన చేస్తుంటే, మన జట్టును రెండుసార్లు ఆలౌట్ చేసేందుకు ప్రత్యర్థి జట్లు తలకిందులవుతున్నాయి. ప్రస్తుత సిరీస్‌లో ఈ అంశంలో సౌతాఫ్రికా బౌలర్లు మరీ తీసికట్టుగా ఉన్నారు. మన బౌలర్లు నాలుగుసార్లు ప్రత్యర్థిని ఆలౌట్ చేస్తే, సౌతాఫ్రికా బౌలర్లు ఒక్కసారికూడా మన జట్టును ఆలౌట్ చేయలేకపోయారు. మన పేసర్లు, స్పిన్నర్లను ఎదుర్కోవడంలో సౌతాఫ్రికా బ్యాట్స్‌మెన్‌కు చుక్కలు కనిపించాయి. కొన్ని బంతులు ఎలా ఆడాలో కూడా తెలియక వికెట్లు సమర్పించుకున్న సందర్భాలున్నాయి. పేసర్లు వికెట్లను విరగ్గొట్టడమే లక్ష్యంగా బంతులు సంధించారు. ఒక టెస్టులో పేసర్లు విజయాన్నందిస్తే, మరో టెస్టులో పేసర్లు ఆ బాధ్యత అందుకున్నారు. ఇలా సమష్టిగా రాణించి భారత విజయాల్లో బ్యాట్స్‌మెన్‌తోపాటు బౌలర్లూ తమ కర్తవ్యాన్ని నిర్వర్తించారు.

## రజత మంజు



**అరంగేట్రంలోనే సత్తా చాటిన యువ బాక్సర్**

**ఉలాన్-ఉడే(రష్యా):** మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ మంజురాణి రజతం కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన మహిళల 48 కేజీల విభాగం ఫైనల్లో మంజురాణి 1-4తో రష్యా బాక్సర్ ఎకతెరిన పాల్సివ చేతిలో ఓటమిపాలై రజతంతో సరిపెట్టుకుంది. ఈ మెగా చాంపియన్‌షిప్‌లో తొలిసారి బరిలోకి దిగిన మంజు అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. మొదటి ప్రయత్నంలోనే సిల్వర్ మెడల్‌తో మెరిసింది. మరోవైపు భారత దిగ్గజ బాక్సర్ మేరీకోమ్ (51 కేజీలు), లవ్లీనా (69 కేజీలు), జమున బోరో (54 కేజీలు) కాంస్య పతకాలు దక్కించుకున్నారు.

## విజేత లక్ష్యసేన్



**డచ్ ఓపెన్ బ్యాడ్మింటన్**

**అల్మెరె (నెదర్లాండ్స్):** భారత్ యువ షట్లర్ లక్ష్యసేన్ డచ్ ఓపెన్ టైటిల్ కైవసం చేసుకున్నాడు. ఫలితంగా కెరీర్‌లో తొలి బీడబ్లూఎఫ్ వరల్డ్ టూర్ టైటిల్‌ను సాధించాడు. ఆదివారం ఇక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ 72వ ర్యాంకర్ లక్ష్యసేన్ 15-21, 21-14, 21-15తో జపాన్‌కు చెందిన యుసుకె ఒనోడెరపై విజయం సాధించాడు.గత నెలలో జరిగిన బెల్జియన్ ఇంటర్నేషనల్ టైటిల్‌ను కూడా లక్ష్యసేన్ గెలుచుకున్నాడు.

## భారత్ చేతిలో కివీస్ చిత్తు



**జొహార్ బారో (మలేసియా):** సుల్తాన్ జొహార్ కప్ జూనియర్ హాకీ టోర్నీలో భారత్ యువ జట్టు వరుస విజయాలతో సత్తా చాటుతోంది. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య మలేసియాను ఓడించిన భారత్ ఆదివారం జరిగిన రెండో మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను 8-2 గోల్స్‌తో చిత్తు చేసింది. భారత్ తరపున సంజయ్ (17, 22వ నిమిషాల్లో) రెండు గోల్స్ సాధించాడు. మరోవైపు దిల్‌ప్రీత్ సింగ్ (6ని.), శీలనంద్ లక్రా (14ని.), మందీప్ మోర్ (22ని.), సుమన్ బెక్ (45ని.), ప్రతాప్ లక్రా (50ని.), సుదీప్ (51ని.) ఒక్కో గోల్ సాధించి భారత్‌కు విజయాన్ని అందించారు.

## మెద్వెదెవ్‌కు షాంఘై టైటిల్



**షాంఘై:** షాంఘై మాస్టర్స్ టైటిల్‌ను మెద్వెదెవ్ గెలుచుకున్నాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో రష్యా స్టార్, మూడో సీడ్ డానియల్ మెద్వెదెవ్ 6-4, 6-1తో ఐదో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)ను వరుస సెట్లలో చిత్తు చేసి తొలిసారి షాంఘై మాస్టర్స్ టైటిల్‌ను సొంతం చేసుకన్నాడు. తొలి సెట్‌లో జ్వెరెవ్ నుంచి గట్టి పోటీ ఎదుర్కొన్న మెద్వెదెవ్ రెండో సెట్‌లో మాత్రం ధాటిగా ఆడి ఏకపక్షంగా ఈ సెట్‌ను, మ్యాచ్‌ను గెలుచుకొని చాంపియన్‌గా అవతరించాడు.

## బోతాస్‌దే జపాన్ గ్రాండ్‌ప్రి



**సుజుక(జపాన్) :** మెర్సిడెస్‌కు చెందిన వాల్టెరి బోతాస్ ఫార్ములా వన్ జపాన్ గ్రాండ్‌ప్రిని గెలుచుకున్నాడు. ఆరంభంలో మూడో స్థానంనుంచి బోతాస్ రేస్‌ను ప్రారంభించినా చివరకు మొదటి స్థానంలో నిలిచి టైటిల్ దక్కించుకున్నాడు. ఫెరారీకి చెందిన సెబాస్టియన్ వెటెల్, మెర్సిడెస్‌కే చెందిన లూయిస్ హామిల్టన్ రెండు, మూడు స్థానాలలో నిలిచారు. ఈ విజయంతో మెర్సిడెస్ సంస్థ రికార్డు స్థాయిలో వరుసగా ఆరోసారి కన్‌స్ట్రక్టర్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది.

## బీసీసీఐ అధ్యక్షుడిగా గంగూలీ..?

**ముంబై :** బీసీసీఐ అధ్యక్షుడిగా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఎంపికకు రంగం సిద్ధమైంది. ఈ పదవికి ఎన్.శ్రీనివాసన్ మద్దతు ఇస్తున్న బ్రిజేష్ పటేల్‌ను ఎంపిక చేసేందుకు వాతావరణం అనుకూలంగా ఉన్నప్పటికీ కొన్ని రాష్ట్ర సంఘాలు ఇందుకు సుముఖంగా లేకపోవడంతో లోపాయకారి ఒప్పందంతో గంగూలీని అధ్యక్షునిగా ఎన్నుకునేందుకు అంగీకారం కుదిరింది. పోటీనుంచి విరమించుకునేందుకు సోమవారం చివరి రోజు కాగా ఇప్పటివరకు దరఖాస్తు చేసినవారంతా ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు ఒప్పందం కుదిరింది. ఇపుడు గంగూలీనికూడా గద్దెనెక్కించేందుకు ఎక్కువమంది ఆసక్తి కనబరుస్తున్నారు.

## పతకదాహం తీరని బైల్స్

**స్టట్‌గార్ట్ :** అమెరికా జిమ్నాస్ట్ సిమోన్ బైల్స్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అత్యధిక పతకాలు సాధించిన జిమ్నాస్ట్‌గా చరిత్ర సృష్టించింది. ఆదివారం ఆమె బాలెన్స్ బీమ్ అంశంలో స్వర్ణం సాధించడంద్వారా బైలో రష్యా క్రీడాకారుడు విటాలీ షెర్బో 23 పతకాల రికార్డును అధిగమించింది. ఆ తరువాత రెండు గంటలలోనే ఆమె ఫ్లోర్ ఎక్సర్‌సైజ్ స్వర్ణం కూడా సొంతం చేసుకుని ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తన పతకాల సంఖ్యను 25కు పెంచుకుంది.

Vaccum Therapy లింగవర్ధక యంత్రం
లింగం చిన్నదని నిరాశ ఎందుకు?

అమెరికా ఏజెన్సీ FDA వారి అభిప్రాయం ప్రకారం Vaccum Therapy లింగవర్ధక యంత్రం మరియు ఔషధాల ద్వారా పురుషుడు తన చిన్న లింగాన్ని 75 రోజులలో 7 నుండి 8 అంగుళాల పొడవు, లావు, గట్టిగా, శక్తివంతంగా మరియు దృఢంగా చేసుకొనవచ్చును. మరియు తన ఇష్టానుసారం శృంగార సమయాన్ని పొడిగించుకోవచ్చును. శీఘ్రస్కలనం, నపుంసకత్వం, లింగము వదులుగా ఉండుట, చిన్నగా ఉండుట, సన్నగా ఉండుటను తొలగించుకోవడంకోసం 30 రోజుల ఔషధం.
☞ ఇంటి దగ్గరకే ఔషధం తెప్పించుకోండి
08943212076

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.